ఈనాడు

విజయవాడ 10-3-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 209

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



లలితా జ్యువెల్లరిలో వజ్రాభరణాల సంబరాలు!

ఉగాది శుభాకాంక్షలు



క్యారెట్ రూ.46000 నుంచి!

V.A గ్రాముకు రూ.975 మాత్రమే



100% Quality. E-F Colour Grade & VVS Clarity.

మా దగ్గర కొన్న వజ్రాభరణాలకు 100% ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌకర్యం మరియు 85% క్యాష్‌బాక్ సౌకర్యం.

అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.

(Certified by Internationally Recognized Gemmology Bodies.)

వజ్రపు వ్యాసం (సెంట్లలో)	సాధారణంగా మార్కెట్‌లో వజ్రాల ధర (ఒక క్యారెట్‌కు)	వజ్రాల న్యాయమైన ధర (ఒక క్యారెట్‌కు)
0 నుంచి 0.0749	రూ.67000 నుంచి 76000	రూ.46000
0.0750 నుంచి 0.1349	రూ.76000 నుంచి 85000	రూ.66500
0.1350 నుంచి 0.1749	రూ.98500 నుంచి 105000	రూ.83000
0.1750 నుంచి 0.2249	రూ.108500 నుంచి 112000	రూ.94000

ధరలు సర్వదేశ ఎగుమతి దిగుమతులకు తగినట్లు నిర్ణయించబడతాయి.

మరెవరికీ సాధ్యంకాని సదుపాయమిది!



ఇదివరకు ఉన్న తరుగు	ఉగాది కానుక తరుగు
~~8%~~	7%
~~8%~~	7%
~~9%~~	8%
~~9%~~	8%

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్

మీరు మునుపెన్నడూ చూడని ఆకట్టుకునే లక్షలాది డిజైన్లతో లెక్కలేనన్ని కౌంటర్లు.

ఆదా చేయాలంటే.. పోల్చి చూడండి!

మీరు చేయాల్సిన నాలుగు విషయాలు

1. మనసుకు నచ్చిన నగను మొబైల్‌లో క్లిక్ చేసి, దానికి 'ఎస్టిమేట్ స్లిప్' మా వద్ద తీసుకోండి.
2. నగ ఫొటో, ఎస్టిమేట్‌స్లిప్‌ను పెట్టుకుని కనీసం నాలుగైదు షోరూంలలో ధరలు పోల్చిచూడండి.
3. BIS 916 హాల్‌మార్క్ ముద్ర ఉందా అని సరిచూసుకోండి.
4. ఏ షోరూంలో అయితే మీకు నచ్చిన నగ తక్కువ ధరకు లభిస్తోందో అక్కడే కొని లబ్ధి పొందండి.

ఓ షోరూంలో డిజైన్ నచ్చి, అక్కడ తరుగు అధికంగా ఉంటే.. ఆ నగను మొబైల్‌లో క్లిక్ చేసి, ఎక్కడ తరుగు తక్కువగా ఉంటుందో అక్కడే చూపించి, ఆర్డర్ చేసి కొనుక్కోండి.



కనువిందు చేసే సంప్రదాయ మరియు వినూత్నమైన వెండిసామగ్రి.

మార్కెట్‌లోనే అతి తక్కువ ధరకు అందిస్తున్నాం!



Lalithaa®


లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్క్ రోడ్డు. (V.V. మహల్ రోడ్డు).
ఫోన్: 0877 - 666 0505 / 0606 / 7888.

వైజాగ్ : 29-1-75/1, ఆర్టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891 - 6600001.

హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677.

చెన్నై • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ www.lalithaajewellery.com




ఈనాడు



విజయవాడ 10-3-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 209 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

జనంలోకి వెళ్లాలి



- మన వాదనను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లాలి
- కేంద్రం చేసిన అన్యాయాన్ని ప్రతి ఒక్కరికీ వివరించాలి
- సాధిస్తున్న విజయాలు, అభివృద్ధి ప్రజలకు చెప్పండి
- ప్రజాకర్షక బడ్జెట్‌పై విస్తృతంగా చర్చ జరగాలి
- ముఖ్యనేతలతో వ్యూహరచన కమిటీ ఏర్పాటు
- ఎంపీలు, 15 వేల మంది పార్టీ నాయకులతో టెలికాన్ఫరెన్స్
- దిశానిర్దేశం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- ఏ1, ఏ2లా మాకు అజెండా నిర్ణయించేది అని జగన్‌పై ధ్వజం

ఈనాడు – అమరావతి

కేంద్రం చేసిన అన్యాయం గురించి ప్రజల మనసుల్లో బలంగా నాటుకునేలా వివరించాలని పార్టీ నాయకులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. కేంద్రంపై పోరాటం తీవ్రతరం చేయాలని, అదే సమయంలో ఆ హడావుడిలో మనం చేస్తున్న అభివృద్ధి, సాధించిన విజయాలు మరుగున పడకుండా జాగ్రత్త పడాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరగడం వల్లే కేంద్ర ప్రభుత్వం నుంచి తెదేపా బయటకు వచ్చిందని, దీనిలో రాష్ట్ర ప్రయోజనాలే తప్ప, రాజకీయకారణాలేమీ లేవన్న తమ వాదనను క్షేత్రస్థాయి వరకు బలంగా తీసుకెళ్లే ప్రక్రియను ఆయన ముమ్మరం చేశారు. తాజా పరిణామాలపై ఎప్పటికప్పుడు చర్చించి తగు నిర్ణయాలు తీసుకునేందుకు వ్యూహరచన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో మంత్రులు యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, కాలువ శ్రీనివాసులు, పి.నారాయణ, నక్కా ఆనందబాబు, నారా లోకేష్, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పయ్యావుల కేశవ్, ప్రభుత్వ మీడియా సలహాదారు పరకాల ప్రభాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సి.కుటుంబరావు ఉన్నారు. ఈ కమిటీతో ముఖ్యమంత్రి శుక్రవారం రెండు దఫాలుగా మొత్తం ఐదు గంటలపాటు సమాలోచనలు జరిపారు. దీనిలో భాగంగానే పార్టీ (మిగతా 2లో)



కారుణ్యం శరణ్యమే

పరోక్ష కారుణ్య మరణానికి అనుమతించవచ్చు

సర్వోన్నత న్యాయస్థానం కీలక తీర్పు

- మరణంలోనూ హుందాతనం కోరవచ్చు
- జీవన హక్కులో అది భాగమే
- చరమాంకంలో 'సజీవ వీలునామా' రాయవచ్చు
- అచేతన దశలో చికిత్స నిరాకరించేలా కోరవచ్చు
- ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టీకరణ

వేదన కాలాన్ని తగ్గించడానికి ఇది తప్పదు

అవసాన దశకు చేరుకున్న రోగి లేదా దీర్ఘకాలంగా అచేతనంగా ఉన్న వ్యక్తి కోలుకుంటారన్న ఆశ ఏమాత్రం లేని సందర్భాల్లో మరణ ప్రక్రియను వేగవంతం చేసి, వేదన కాలాన్ని తగ్గించడమూ హుందాతనంతో జీవించే హక్కే అవుతుంది. వ్యక్తిగత హుందాతనానికి చోటు కల్పించకుంటే జీవన హక్కు, స్వేచ్ఛ అనేవి అర్థ రహితంగా మిగిలిపోతాయి.

– ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర



దిల్లీ

'పరోక్ష కారుణ్య మరణాల'పై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. జీవిత చరమాంకంలో ఉన్న రోగి లేదా దీర్ఘకాలంగా అచేతనావస్థలో ఉన్న వ్యక్తి.. వైద్య చికిత్సను నిరాకరిస్తూ ముందస్తు వైద్య నిర్దేశం లేదా 'సజీవ వీలునామా'ను రాయవచ్చని తేల్చి చెప్పింది. హుందాగా జీవించే హక్కులో.. మరణ ప్రక్రియను 'సాఫీగా' సాగేలా చూడటమూ ఓ భాగమేనని స్పష్టంచేసింది. ముందస్తు వైద్య నిర్దేశాలకు చట్టబద్ధ గుర్తింపు ఇవ్వకుంటే మరణ ప్రక్రియను సాఫీగా సాగేలా చూసే హక్కుకు 'వీలు కల్పించకపోవడమే' అవుతుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం శుక్రవారం స్పష్టంచేసింది. ముందస్తు నిర్దేశం లేదా సజీవ వీలునామాకు సంబంధించి కొన్ని సూత్రాలను రూపొందించింది. రోగి ముందస్తు సూచనలు ఉన్న, లేని సందర్భాల్లో పరోక్ష మరణం అమలుపై వేరువేరుగా మార్గదర్శకాలను నిర్దేశించింది. వీటిపై నిర్ణయాధికారాన్ని వైద్య బోర్డుకు అప్పజెప్పింది. ఈ అంశంపై చట్టం వచ్చేవరకూ తన మార్గదర్శకాలు అమల్లో ఉంటాయని ధర్మాసనంలో తన తరఫున, మరో న్యాయమూర్తి జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్ తరఫున తీర్పును రాసిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర పేర్కొన్నారు. మిగతా ముగ్గురు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.కె.సిక్రి, జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ అశోక్ భూషణ్ వేరువేరుగా (మిగతా 2లో)



పెళ్లింట పెను విషాదం

- ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- వరుడు సహా అయిదుగురి దుర్మరణం
- తీవ్రంగా గాయపడిన వధువు

12లో

ప్రమాదానికి గురైన కారు..ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా మృతదేహాలు





'భావస్వేచ్ఛ'కు సంకెళ్లు బిగిస్తున్నారు

- పార్లమెంటరీ విధానాన్ని వాజ్‌పేయి గొప్పగా గౌరవించేవారు
- దేశం కోసం భావసారూప్య పార్టీలు కలిసిరావాలి
- 'ఇండియా టుడే' సమాలోచనలో సోనియాగాంధీ

10లో

ఇదీ సంగతి!



చావలేక బతకలేక ఉన్న రాజకీయ పార్టీలకు కూడా కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలి అని అడగాల్సింది!



మూడో జోన్‌కు నీటిని విడుదల చేయాలి

● సాగునీటి సంఘాల సారథుల విజ్ఞప్తి

ఈనాడు డిజిటల్, అమరావతి: సాగర్ ఎడమ కాలువ ద్వారా కృష్ణా జిల్లాలోని మూడో జోన్‌కు తక్షణమే నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డును సాగునీటి సంఘాల సారథులు కోరారు. ఈ మేరకు బోర్డు ఛైర్మన్ యోగేంద్ర కుమార్ శర్మను జలవనరుల శాఖ రాష్ట్ర అపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 6న బోర్డు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరారు. ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు ఆంధ్రప్రదేశ్‌కు 14.4 టీఎంసీల నీటిని బోర్డు కేటాయించినా, తెలంగాణ ప్రభుత్వం 8.96 టీఎంసీలు మాత్రమే విడుదల చేసిందని ఫిర్యాదు చేశారు. మిగతా నీటిని విడుదల చేయకపోవడం వల్ల మూడో జోన్‌లోని తిరువూరు, నూజివీడు, గన్నవరం, మైలవరం, నందిగామ నియోజకవర్గాల్లో 2 లక్షల ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందనీ చెప్పారు. తీవ్ర నీటి ఎద్దడి దృష్ట్యా మిగిలిన 5.46 టీఎంసీలతో పాటు, మొత్తం ఎడమ కాలువకు 7.72 టీఎంసీలను నీటిని విడుదల చేయాలని కోరారు. నాగార్జున సాగర్ హెడ్ రెగ్యులేటర్ నుంచి 280 కిలోమీటర్ల దూరంలోని మూడో జోన్‌కు సాగునీరు రావాల్సి ఉన్నందున కృష్ణా బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఏపీ రైతులకు న్యాయం చేయాలన్నారు. దీనిపై స్పందించిన బోర్డు ఛైర్మన్ యోగేంద్ర కుమార్ శర్మ.. ఉత్తర్వులు వెంటనే అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రాయలసీమలో హైకోర్టు బెంచ్!

● ప్రాథమికంగా సుముఖత వ్యక్తంచేసిన రాష్ట్ర ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా సుముఖత వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇందుకు నోటిపై చేయాల్సింది కేంద్ర ప్రభుత్వమే కాబట్టి.. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని దాదాపు 45 రోజుల నుంచి రాయలసీమ జిల్లాల్లోని న్యాయవాదులు ఆందోళనలు చేస్తున్నారు. బుధవారం అసెంబ్లీ ముట్టడికి రావడంతో మంత్రి కాలవ శ్రీనివాసులు, కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వారితో మాట్లాడారు. ముట్టడి మానుకోవాలని ముఖ్యమంత్రి వద్దకు తీసుకువెళతాం.. పరిస్థితిని ఆయనకు నివేదించాలని కోరడంతో వారు ఆగిపోయారు. ఈ మేరకు రాయలసీమ న్యాయవాదుల ఐకాస ప్రతినిధులు గురువారం సీఎంను కలిసినపుడు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆ ప్రతినిధులు తెలిపారు.

కారుణ్యం శరణ్యమే

(మొదటి పేజీ తరువాయి)

తీర్పులను వెలువరించినప్పటికీ ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయాలతో ఏకీభవించారు.

చరమాంకం వరకూ పరిరక్షణ

జీవనం, మరణం అనేవి వేరుచేయడానికి వీలు కాని అంశాలని తన 134 పేజీల తీర్పులో జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. "జీవన సంధ్యలో బతుకే ముగిసిపోయినట్లు అనిపించినప్పుడు, స్వీయ మరణానికి సంబంధించిన ప్రశ్నలు తలెత్తిన సందర్భాల్లోనూ పౌరుల హుందాతనానికి రాజ్యాంగం పరిరక్షణ కొనసాగుతుందని ఈ కోర్టు గుర్తించడం తప్పనిసరి. మరణంలో హుందాతనమనేది.. రాజ్యాంగంలోని 21వ అధికరణంలో పేర్కొన్న 'జీవన హక్కు'లో భాగమే. జీవిత చరమాంకంలో ఒక వ్యక్తికి హుందాతనాన్ని నిరాకరించడమంటే.. అతడికి అర్థవంతమైన మనుగడను తిరస్కరించడమే" అని పేర్కొన్నారు.

"జీవితానికి గౌరవార్హత ఇవ్వాల్సి ఉన్నప్పటికీ. . తిరిగి కోలుకుంటారన్న ఆశ లేనివారి విషయంలో వారి ముందస్తు నిర్దేశానికి, స్వీయ నిర్ణయాధికార హక్కుకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర స్పష్టంచేశారు. వైద్య పురోగతి కారణంగా ప్రాణాధార యంత్రాల సాయంతో రోగుల మరణాన్ని, నెలలు, సంవత్సరాల పాటు సాగదీసే వీలుందని పేర్కొన్నారు. "ఇలాంటి దశలోనే.. వైద్య చికిత్సను నిరాకరించే హక్కు తెరపైకి వస్తుంది. దీన్ని వినియోగించుకునే వ్యక్తి జీవించాలని కోరుకుంటున్నప్పటికీ.. దీర్ఘకాల యాతనను తప్పించుకోవడానికి శస్త్రచికిత్సలు, ఔషధాలు లేదా ఇతర చికిత్సల నుంచి తనకు విముక్తి కల్పించాలని వాంఛిస్తున్నాడు" అని పేర్కొన్నారు. తన శరీరాన్ని ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకునే హక్కు మానసిక ఆరోగ్యం సరిగా ఉన్న ప్రతి వయోజనుడికీ ఉంటుందన్న అమెరికా కోర్టు వ్యాఖ్యను ఉదహరించారు. అవసాన దశలో ఉన్న వ్యక్తి వైద్య చికిత్సకు నిరాకరించడం ఆత్మహత్య కిందకు రాదని స్పష్టంచేశారు.

చట్టాన్ని తీసుకురావాలి..

సీజేఐ మార్గదర్శకాలతో ఏకీభవిస్తూ 112 పేజీల తీర్పును జస్టిస్ సిక్రీ వెలువరించారు. సజీవ వీలునామా, ముందస్తు నిర్దేశం వంటి అంశాల్లో ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావడానికి శాసన వ్యవస్థ సత్వర చర్యలు చేపడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. తద్వారా కారుణ్య మరణంపై ఆందోళనలు దూరమవుతాయని చెప్పారు.

అది ప్రాథమిక హక్కు..

సీజేఐ తీర్పును సమర్థిస్తూ, జస్టిస్ భూషణ్ విడిగా తీర్పు చెప్పారు. హుందాతనంతో మరణించడం ప్రాథమిక హక్కు అని 1996లో ఒక రాజ్యాంగ ధర్మాసనం చేసిన వ్యాఖ్యను ఆయన ఉటంకించారు. "అవగాహనతో నిర్ణయం తీసుకునే మానసిక సామర్థ్యమున్న వయోజనులకు ప్రాణాధార వైద్య సాధనాల ఉపసంహరణ సహా వైద్య చికిత్సను నిరాకరించే హక్కు ఉందని స్పష్టం చేస్తున్నాం. న్యాయస్థాన షరతులకు అనుగుణంగా ముందస్తు వైద్య నిర్దేశాన్ని జారీ చేసే హక్కు మానసిక ఆరోగ్యం సక్రమంగా ఉన్న ప్రతి వ్యక్తికీ ఉంటుంది" అని ఉద్ఘాటించారు.

పరిస్థితికి అనుగుణంగా ఉపశమన చర్యగా పరోక్ష కారుణ్యమరణం వర్తింపచేసే పక్షంలో రోగి ప్రయోజనాలే పరమావధి అని, ఇలాంటి సందర్భంలో ప్రభుత్వ ప్రయోజనాలు వెనక్కి పోతాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ముందస్తు వైద్య నిర్దేశానికి సంబంధించి భారత్‌లో న్యాయ కార్యాచరణ లేకపోయినప్పటికీ రాజ్యాంగంలోని 21వ అధికరణాన్ని సంరక్షించాల్సిన బాధ్యత సుప్రీం కోర్టుపై ఉందని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. రోగికి చికిత్స చేసే సమయంలో తలెత్తే అనేక సందేహాలను ఈ తీర్పు నివృత్తి చేస్తుందని చెప్పారు. చికిత్స చేసే వైద్యులకు స్పష్టతను ఇస్తుందన్నారు. తాము చట్టబద్ధంగా వ్యవహరిస్తున్నామన్న సంతృప్తిని వారికి కలిగిస్తుందని తెలిపారు.

మార్గదర్శకాలు..

ముందస్తు వైద్య నిర్దేశాన్ని ఎవరు రాయాలి? అందులో ఏమి ఉండాలి? దాన్ని ఎలా నమోదు చేసి, పరిరక్షించాలి? దాన్ని ఎవరు అమలు చేయాలి? దీని అమలుకు వైద్య బోర్డు నిరాకరిస్తే ఏం చేయాలి? వంటి అంశాలపై కూడా ధర్మాసనం మార్గదర్శకాలు జారీ చేసింది. ముందస్తు వైద్య నిర్దేశం లేని కేసులకు సంబంధించీ కోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ 2005లో దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. నిజానికి పరోక్ష కారుణ్యమరణాన్ని అనుమతిస్తున్నట్లు 2011 మార్చి 11న ఇప్పటికే అరుణా షాన్‌బాగ్ కేసులో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

పరోక్ష కారుణ్య మరణమంటే..

అచేతనంగా ఉన్న వారు, చికిత్స లేని వ్యాధులతో బాధపడుతూ అవసాన దశకు చేరినవారికి నొప్పి లేకుండా మరణానికి గురిచేయడమే కారుణ్య మరణం. ఇందులో ప్రత్యక్ష, పరోక్ష అనే రెండు రకాలు ఉంటాయి. క్రియాశీల కారుణ్య మరణంలో.. హానికర పదార్థాన్ని ప్రయోగించి కానీ, బలవంతంగా కానీ రోగిని వైద్యులు మరణానికి గురిచేస్తారు. పరోక్ష విధానంలో.. జీవన కొనసాగించడానికి అవసరమైన ప్రాణాధార వైద్య తోడ్పాటు వ్యవస్థను ఉపసంహరిస్తారు.

ఏమిటీ సజీవ వీలునామా?





ఒక రోగి మానసిక పరిస్థితి సక్రమంగా ఉన్నస్థితిలోనే ఈ వీలునామాను రాస్తారు. భవిష్యత్‌లో శాశ్వత కోమా స్థితిలోకి వెళ్లిపోయినప్పుడు తనకు కృత్రిమ ప్రాణాధార వ్యవస్థను కొనసాగించాలా వద్దా అన్నది ముందుగానే స్పష్టంచేసేదే ఈ పత్రం.

ఏమిటీ అరుణాషాన్ బాగ్ కేసు?

సుప్రీం కోర్టు తాజా తీర్పుతో అరుణా షాన్‌బాగ్ కేసు మళ్లీ తెరపైకి వచ్చింది. కారుణ్య మరణాల చట్టాలను మార్పునకు ప్రేరేపించింది ఈ కేసే. అరుణ రామచంద్ర షాన్‌బాగ్.. ముంబయిలోని కింగ్ ఎడ్వర్డ్స్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేసేది. 1973 నవంబర్‌లో సోహన్‌లాల్ భరత వాల్మీకీ అనే వార్డ్‌బాయ్.. ఆమెపై అత్యాచారం చేశాడు. కుక్కను కట్టే గొలుసుతో ఆమె మెడను బిగించాడు. ఫలితంగా.. మెదడుకు ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయింది. ఆమె అచేతనంగా ఉండిపోయింది. 42 ఏళ్ల పాటు ఆ స్థితిలోనే ఉన్న ఆమెకు ఎడ్వర్డ్స్ ఆసుపత్రి నర్సులే సపర్యలు చేశారు.

అరుణకు కారుణ్య మరణం ప్రసాదించాలంటూ పింకీ విరానీ అనే సామాజిక కార్యకర్త సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఆమెకు ఆహారాన్ని నిరాకరించేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. అయితే ఆమె బ్రెయిన్ డెడ్ కాలేదని, కొన్ని సందర్భాల్లో స్పందిస్తోందని సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన వైద్య బోర్డు పేర్కొంది. వారి సూచనకు అనుగుణంగా అరుణకు కారుణ్య మరణానికి వీలు కల్పించడానికి న్యాయస్థానం 2011లో నిరాకరించింది. అయితే దేశంలో పరోక్ష కారుణ్య మరణానికి మాత్రం వీలు కల్పిస్తున్నట్లు పేర్కొంది. 2015 మే 18న అరుణ మరణించింది.

సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పును పింకీ విరానీ స్వాగతించారు. తీర్పులో వచ్చిన వెసులుబాటును దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని కేరళ క్రైస్తవ సంఘాలు ఆందోళన వ్యక్తంచేశాయి.

అశ్విని (పాత చిత్రం), నిందితుడు అళగేశన్

ప్రేమోన్మాదానికి విద్యార్థిని బలి

● కత్తితో దాడిచేయటంతో మృతి

● తమిళనాట దారుణం

చెన్నై, న్యూస్‌టుడే: ప్రేమోన్మాది కత్తితో దాడిచేయటంతో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. శుక్రవారం తమిళనాడు రాష్ట్రంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. నిందితుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. చెన్నై శివారు మదురవాయిల్‌కు చెందిన అశ్విని (20) కేకే నగర్‌లోని మీనాక్షి కళాశాలలో బీకాం మూడో సంవత్సరం చదువుతోంది. మదురవాయిల్‌లోనే ఉంటున్న అళగేశన్ (28) ఈమెను ప్రేమ పేరుతో వేధించేవాడు. బాధితురాలు ఫిర్యాదుతో గతంలో అరెస్టయ్యాడు. ఆ తర్వాత కూడా మార్పురాకపోవడంతో అశ్విని కొన్నాళ్లపాటు కళాశాలకు రావడం మానేసింది. వారం రోజులుగా మళ్లీ కళాశాలకు వస్తోంది. ఈ విషయం తెలుసుకున్న అళగేశన్ శుక్రవారం ఆ కళాశాల ప్రవేశ ద్వారం చేరుకొని అశ్విని రాగానే వేధింపులకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోతున్న అశ్వినిపై నిందితుడు తనతో తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. రక్తపు మడుగులో స్పృహతప్పి పడిపోయిన అశ్వినిని ఆస్పత్రికి తరలిస్తుండగానే ప్రాణాలు విడిచింది. ఊహించని ఘటనతో దిగ్భ్రాంతికి గురైన స్థానికులు నిందితుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల నిర్ణయమే కీలకం!

● కలెక్టర్, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కూ ప్రమేయం

● పరోక్ష కారుణ్య మరణాలపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలు

దిల్లీ: దీర్ఘకాలంగా అచేతనంగా ఉన్న వారు, అవసాన దశలో ఉన్న రోగులు వైద్య చికిత్సను నిరాకరిస్తూ రాసే సజీవ వీలునామా అమలు విషయంలో వైద్యులకే కీలక పాత్రను సుప్రీం కోర్టు అప్పగించింది. ఈ ప్రక్రియలో అనుసరించాల్సిన నిబంధనలను రూపొందించింది.

- మరణానికి చేరువలో ఉన్న ఒక వ్యక్తి ఇక కోలుకుంటాడని, అతడి రుగ్మతకు చికిత్స దొరుకుతుందన్న ఆశ లేనప్పుడు.. సజీవ వీలునామాను రాయవచ్చు. అతడికి చికిత్స చేస్తున్న వైద్యుడికి ఈ విషయాన్ని తెలియజేయాలి. తొలుత వైద్యుడు.. ఈ పత్రం వాస్తవికతను జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ద్వారా నిర్ధారించుకోవాలి.
- సదరు పత్రంలో ఉన్న సూచనలకు వైద్యులు ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే సదరు రోగి జీవిత చరమాంకంలో ఉన్నాడని, దీర్ఘకాలంగా వైద్య చికిత్స పొందుతున్నాడని లేదా జీవనాధార వ్యవస్థ ఆధారంగా మనుగడ సాగిస్తున్నాడని, అతడి రుగ్మతకు చికిత్స లేదని, అతడికి నయమయ్యే ఆశ లేదని పూర్తిగా ధ్రువీకరించుకోవాలి. ఆ తర్వాతే వీలునామా విషయంలో ముందడుగు వేయాలి.
- ఒకవేళ ఆ పత్రంలోని సూచనలతో వైద్యుడు సంతృప్తి చెంది, వాటిపై ముందడుగు వేయవచ్చని భావిస్తే సదరు రోగికి లేదా సంరక్షకుడు, బంధువుకు రుగ్మత గురించి వివరించాలి. అందుబాటులో ఉన్న వైద్య పరిరక్షణ, ప్రత్యామ్నాయ చికిత్సలతో తలెత్తే పరిణామాలను విశదీకరించాలి.
- ఆ రోగి చికిత్స పొందుతున్న ఆసుపత్రి.. ఒక వైద్య బోర్డును ఏర్పాటు చేస్తుంది. అందులో చికిత్స చేస్తున్న విభాగం అధిపతి, జనరల్ మెడిసిన్, హృద్రోగ, నాడీ, మూత్రపిండాలు, మానసిక లేదా కేన్సర్ చికిత్సకు సంబంధించిన విభాగాల నిపుణులు కనీసం ముగ్గురు ఉండాలి. వీరికి 'క్రిటికల్ కేర్'లో కనీసం 20 ఏళ్ల అనుభవం ఉండాలి.
- ఈ బోర్డు సభ్యులు.. బంధువు లేదా సంరక్షకుడి సమక్షంలో రోగిని పరిశీలించాలి. జీవనాధార వ్యవస్థను ఉపసంహరించడం కానీ తదుపరి వైద్య చికిత్సను నిరాకరించడాన్ని కానీ ధ్రువీకరించే అంశంపై ఒక అభిప్రాయానికి రావాలి. అయితే ఇది ప్రాథమిక అభిప్రాయం మాత్రమే.
- రోగి సూచనను అమలు చేయవచ్చని బోర్డు ధ్రువీకరణకు వచ్చాక.. దీనిపై ఆ ప్రాంత కలెక్టర్‌కు సమాచారం ఇవ్వాలి.
- ఈ దశలో.. కలెక్టర్ మరో వైద్య బోర్డును నియమించాలి. ఇది కూడా తొలి బోర్డు అభిప్రాయంతో ఏకీభవిస్తే రోగి పేర్కొన్న సూచనలను అమలు చేయాలన్న ధ్రువీకరణ పత్రంపై సంతకం పెడుతుంది.
- ఒకవేళ రోగి.. నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితిలోకి జారిపోయినప్పుడు అతడు సూచించిన సంరక్షకుడి ఆమోదం మేరకు చికిత్స నిరాకరణపై నిర్ణయం తీసుకోవాలి.
- కలెక్టర్ ఎంపిక చేసిన బోర్డు ఛైర్మన్.. రోగికి వైద్య చికిత్సను ఉపసంహరించాలన్న తన నిర్ణయాన్ని అమల్లోకి తీసుకురావడానికి ముందు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు తెలియజేయాలి. సదరు మేజిస్ట్రేట్.. సాధ్యమైనంత త్వరగా రోగిని సందర్శించి, అన్ని అంశాలనూ పరిశీలించి, వైద్య బోర్డు నిర్ణయాన్ని అమల్లోకి తీసుకొచ్చేలా అనుమతించొచ్చు.
- ఒకవేళ వైద్య బోర్డు.. అనుమతిని నిరాకరిస్తే, రోగి కానీ, అతడి కుటుంబ సభ్యులు కానీ హైకోర్టును ఆశ్రయించే స్వేచ్ఛ ఉంది. దీనిపై వేగంగా నిర్ణయం తీసుకోవడానికి ప్రధాన న్యాయమూర్తి.. ఒక డివిజన్ బెంచీని ఏర్పాటు చేయాలి.
- మరో స్వతంత్ర వైద్య బోర్డును ఏర్పాటు చేసే స్వేచ్ఛ హైకోర్టుకు ఉంటుంది.
- రోగుల సజీవ వీలునామా లేని సందర్భాల్లో.. రోగికి చికిత్స చేస్తున్న వైద్యుడు ఈ విషయాన్ని సదరు ఆసుపత్రికి తెలియజేయాలి. ఆ ఆసుపత్రి వర్గాలు.. వైద్య బోర్డును ఏర్పాటు చేయాలి.

స్వాగతించిన వైద్య నిపుణులు, న్యాయవాదులు

పరోక్ష కారుణ్య మరణాన్ని సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దేశవ్యాప్తంగా వైద్య నిపుణులు, న్యాయవాదులు స్వాగతించారు. ఇది ఎప్పుడో అమల్లోకి రావాల్సిందని భారత వైద్య సంఘం (ఐఎంఏ) పేర్కొంది. హుందాగా చనిపోయే హక్కు ప్రతి ఒక్కరికీ దక్కేలా చూడటంలో ఈ తీర్పు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపింది. కోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో వైద్యులు, రోగులు, వారి బంధువులకు ఒక స్పష్టత వచ్చిందని కోలిన్ గాన్‌సాల్వేస్, ప్రశాంత్ భూషణ్, అరవింద్ దతర్ వంటి సీనియర్ న్యాయవాదులు వ్యాఖ్యానించారు.



విలేకరులతో మాట్లాడుతున్న న్యాయవాది ప్రశాంత్ భూషణ్

రైలు రిజర్వేషన్ టిక్కెట్‌ను బదిలీ చేసుకోవచ్చు!

దిల్లీ: తాము ప్రయాణించేందుకు వీలుపడని పరిస్థితుల్లో ఎవరైనా తమ ధ్రువీకృత (కన్ఫర్మ్‌డ్) రైలు టిక్కెట్‌ను వేరేవారి పేరిట బదిలీ చేసుకునేలా రైల్వేశాఖ తాజాగా వెసులుబాటును కల్పించింది. రైలు ప్రయాణికులకు ఒకింత ఊరటనిచ్చే ఈ సౌకర్యాన్ని పొందేందుకు గాను కొన్ని మార్గదర్శకాలను నిర్దేశించింది. ఈమేరకు తమకు కేటాయించిన సీటు/బెర్తును వేరేవారి పేరు మీదకు మార్చడానికి గాను.. ముఖ్యమైన స్టేషన్లలోని చీఫ్ రిజర్వేషన్ సూపర్‌వైజర్‌ల అనుమతి పొందాల్సి ఉంటుందని రైల్వేశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. రైలు బయల్దేరే సమయానికి 24 గంటల ముందుగా సంబంధిత వ్యక్తులు లేదా అధికారులు లిఖితపూర్వకంగా వినతులు సమర్పించాల్సి ఉంటుంది. వ్యక్తిగతంగా అయితే ఒక్కసారి మాత్రమే మార్చుకునే వీలుంటుంది. అదే బృందంగా అయితే అందులోని 10 శాతం మందికి మించి అనుమతించరు.

- ప్రయాణికులెవరైనా తమ కుటుంబ సభ్యుల్లో (తండ్రి, తల్లి, తోబుట్టువు, పిల్లలు, భార్య) ఎవరిపేరిట అయినా మార్పించుకోవచ్చు.
- పెళ్లి బృందంలో అయితే అందులోని ఎవరిపేరిట అయినా మార్చుకోవచ్చు. అయితే ఆ బృందం పెద్ద దాన్ని ధ్రువీకరించాల్సి ఉంటుంది.
- ప్రభుత్వోద్యోగులైతే లిఖితపూర్వక వినతి ద్వారా వేరేవారి పేరిట మార్పించుకోవచ్చు.
- విద్యార్థులైతే తాము చదువుతున్న విద్యాసంస్థకు చెందిన ఎవరిపేరిట అయినా మార్చుకోవచ్చు. అయితే సంబంధిత అధిపతి అనుమతి తప్పనిసరి. అలాగే ఎన్‌సీసీ బృందంలోని సభ్యులు కూడా తమ అధికారి అనుమతితో సహచరుల పేరిట మార్చుకోవచ్చు.

జనంలోకి వెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

గ్రామస్థాయి వరకు నాయకులు, ప్రజాప్రతినిధులు 15 వేల మందితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒక గంటపాటు ముఖ్యమంత్రి ప్రసంగించాక... కొంత విరామం ఇచ్చి నాయకుల అభిప్రాయం తెలుసుకున్నారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అలాగే ఉదయం పార్టీ ఎంపీలతో సుదీర్ఘంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. చాలా మంచి ప్రజాకర్షక బడ్జెట్ ప్రవేశపెట్టామని, దాని గురించి విస్తృతంగా చర్చ జరగాలన్నారు. "కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికిచ్చిన హామీలు నెరవేర్చలేదు. మనం నిరసన తెలియజేసి ప్రభుత్వం నుంచి బయటకు వచ్చేశాం. గతంలో 29 మంది ఎంపీలు ఉన్నప్పుడు కూడా మనం కేంద్ర ప్రభుత్వంలో చేరలేదు. విభజన తర్వాత రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే కేంద్ర ప్రభుత్వంలో చేరాం. కేంద్రం అన్యాయం చేసినందుకు మంత్రి పదవుల్ని తృణప్రాయంగా వదిలేసి బయటికొచ్చేశాం. న్యాయం కోసం పార్లమెంటులో ఎంపీలు పోరాడుతున్నారు. అది కొనసాగుతుంది. కేంద్రం సాయం లేకుండా కూడా మన స్వశక్తితో రెండంకెల వృద్ధి రేటు సాధించాం. జాతీయ వృద్ధి కంటే మనమే ముందున్నాం. ఆ విజయాలు మరుగున పడకూడదు. అభివృద్ధిని విస్మరించకూడదు. అభివృద్ధి చేస్తామనే ప్రజలు మనల్ని ఎన్నుకున్నారు..." అని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు రావడం మంచి నిర్ణయమేనా? కాదా? అన్న అంశంపై అభిప్రాయాలు కోరగా... అది ముమ్మాటికీ మంచి నిర్ణయమేనని అందరూ తెలిపారు. "రెండు జాతీయ పార్టీలూ రాష్ట్ర ప్రజల మనోభావాల్ని అర్థం చేసుకోలేదు. కాంగ్రెస్ పార్టీ మన కన్ను పొడవాలనుకుని, తన రెండు కళ్లూ పోగొట్టుకుంది. రాష్ట్రానికి న్యాయం చేస్తుందనే భాజపాతో పొత్తు పెట్టుకుంటే... ప్రత్యేక హోదా, ప్రత్యేక సాయం విషయంలో ఆ పార్టీ రాష్ట్రానికి అన్యాయం చేసింది..." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రెండు జాతీయ పార్టీలూ రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరించాలే తప్ప, ఎవరిపైనా వ్యక్తిగత దూషణలు వద్దని పార్టీ నాయకులకు సీఎం స్పష్టం చేశారు. వ్యూహరచన కమిటీ ఇకపై తరచూ సమావేశమవుతుంది. తను వేరే ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నా, కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు సమావేశమై తాజా పరిస్థితుల్ని చర్చించాలని సూచించారు.

మైనార్టీలు దగ్గరవుతారు..!

కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు రావడం వల్ల మైనార్టీలు తెదేపాకి దగ్గరవుతారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ప్రత్యేక హోదా విషయంలో వైకాపా చేస్తున్న విమర్శలకు గట్టిగా బదులివ్వాలని మంత్రి సుజయకృష్ణ రంగారావు తెలిపారు. దళిత వర్గాల నుంచి మంచి స్పందన వస్తోందని మంత్రి జవహర్ అన్నారు.. మేడా మల్లికార్జునరెడ్డి, కొత్తపల్లి సుబ్బారాయుడు, గద్దె బాబూరావు తదితరులు తమ అభిప్రాయాలు తెలియజేశారు. ఎన్‌డీఏలో కొనసాగడం వల్ల విమర్శలు వస్తాయని కొందరనగా... దశలవారీగా కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నదే వ్యూహమని, పరిణామాల్ని బట్టి ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుందామని ముఖ్యమంత్రి తెలిపారు. తాను ఎవరితోనూ విభేదించదలుచుకోలేదని... అలాగే రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. సాయం చేయాల్సింది పోయి కేంద్రం మనపై ఎదురుదాడికి దిగుతోందని వ్యాఖ్యానించారు.

ఏ1, ఏ2లా మాకు అజెండా నిర్ణయించేది?

కేంద్ర ప్రభుత్వంపై తాము ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలని, అందరూ కలసి పోరాడాలని వైకాపా అధ్యక్షుడు జగన్ చేసిన ప్రకటనలు, తెదేపాపై ఆయన చేస్తున్న విమర్శల ప్రస్తావన వచ్చినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్రంగా స్పందించారు. "11 కేసుల్లో ఏ1, ఏ2 ముద్దాయిలుగా ఉన్నవాళ్లా మాకు అజెండా నిర్ణయించేది? వాళ్లను మేం అనుసరించాలా? అవిశ్వాస తీర్మానం పెట్టి ఏం చేస్తారు? ప్రభుత్వం పడిపోతుందా?" అని మండిపడ్డారు. ఇతర పార్టీలతో కలసి అవిశ్వాస తీర్మానం పెట్టినా.... పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం వంటి అంశాలపై వారు చర్చిస్తారని, మన రాష్ట్రానికి జరిగిన అన్యాయం దానిలో ఒక చిన్న అంశంగా మారిపోతుందే తప్ప, ప్రత్యేకంగా ఈ అంశంపై చర్చ జరగదని పేర్కొన్నారు. "పార్లమెంటులో తెదేపా ఎంపీలు పోరాడుతుంటే, వైకాపా ఎంపీలు కూర్చుంటున్నారు. విజయసాయిరెడ్డి వైఖరే దీనికి నిదర్శనం. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంటులోనే ఉండి సోనియాకి కనపడకుండా తిరిగిన జగన్, ఇప్పుడు నరేంద్రమోదీ ప్రాపకం కోసం పాకులాడుతున్నారు..." అని ధ్వజమెత్తారు. ఎంపీలు రాజీనామా చేస్తే పార్లమెంటులో గళం ఎవరు వినిపిస్తారని ఆయన ప్రశ్నించారు. ఎంపీలంతా రాజీనామా చేయడమంటే భాజపాకి మేలు చేయడమే అవుతుందని, వైకాపా వైఖరి అలాగే కనిపిస్తోందని పేర్కొన్నారు.

నియోజకవర్గాలకు వెళ్లండి అన్యాయాన్ని వివరించండి

● తెదేపా ఎంపీలకు చంద్రబాబు ఆదేశం

రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలపై పార్లమెంటులో పోరాటం చేస్తున్న తెదేపా ఎంపీలంతా శని, ఆదివారాల్లో నియోజకవర్గాలకు వెళ్లి ఈ అంశంపై ప్రజల్ని చైతన్యపరచాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. "ప్రత్యేక హోదా ఒక భావోద్వేగ అంశమే కాదు. దాన్ని తమ హక్కుగా ప్రజలు భావిస్తున్నారు. కేంద్రం ఆలస్యం చేసిన కొద్దీ ప్రజల్లో సెంటిమెంట్ బలోపేతమవుతోంది. రాష్ట్ర ప్రయోజనాలకు పోరాడుతున్న మీకు అభినందనలు. ప్రజలూ మిమ్మల్ని ప్రశంసిస్తున్నారు..." అని ఆయన తెదేపా ఎంపీలతో పేర్కొన్నారు. వారితో ఆయన శుక్రవారం టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీతో తన టెలిఫోన్ సంభాషణను వారికి వివరించారు. "కేంద్రంలోని తెదేపా మంత్రుల రాజీనామాలకు కారణాలు ఆయనకు చెప్పాను. ఆంధ్రప్రదేశ్‌కు ఇంత వరకు ఇచ్చిందే తప్ప, కొత్తగా ఇచ్చేదేమీ ఉండదని, దేశ రక్షణకు ఇచ్చే నిధుల్నీ అడుగుతారా? అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అనడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని, నాలుగు బడ్జెట్‌లు వచ్చినా ఫలితం లేనందువల్లే రాష్ట్ర ప్రజల మనోభావాల్ని దృష్టిలో ఉంచుకుని పదవుల నుంచి వైదొలిగామని వివరించాను..." అని తెలిపారు. తనను కలిశాక నిర్ణయం తీసుకుంటే బాగుండేదని ప్రధాని అన్నారని, ఇప్పటికైనా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని తాను కోరానని చెప్పారు. మంత్రుల రాజీనామాలపై జాతీయస్థాయిలో వివిధ పార్టీల స్పందన ఎలా ఉందని ఆయన ఎంపీలను వాకబు చేశారు. తెదేపా నిర్ణయాన్ని అన్ని పార్టీలు ప్రశంసించాయని, రాష్ట్రానికి సహకరించేందుకు ముందుకు వచ్చాయని, సరైన సమయంలో మంచి నిర్ణయం తీసుకున్నారని వివిధ పార్టీల ఎంపీలు అభినందించారని వారు తెలిపారు. తాము రాజీనామా లేఖలు అందించినప్పుడు ప్రధానితో జరిగిన సంభాషణను సుజనాచౌదరి... ముఖ్యమంత్రికి, ఎంపీలకు వివరించారు. జాతీయస్థాయిలో రాజకీయ పరిణామాల్ని ఎప్పటికప్పుడు నిశితంగా గమనించాలని సీఎం చెప్పారు. సకాలంలో సరైన నిర్ణయం తీసుకోవడమే రాజకీయాల్లో కీలకమని, ఆలస్యమైనా నష్టం జరుగుతుందని, తొందరపడ్డా కష్టం వస్తుందని తెలిపారు. వైశ్యులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.30 కోట్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రికి టీజీ వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు. "రాష్ట్రానికి కేంద్రం ఏం న్యాయం చేసింది?..." అన్న పుస్తకాల్ని దిల్లీలో ఎంపీలకు, జాతీయ మీడియాకు అందజేశామని సీఎం రమేష్ చెప్పారు. "మీ ముఖ్యమంత్రి మంచి నిర్ణయం తీసుకున్నారు. తప్పకుండా మా సహకారం ఉంటుంది..." అని శివసేన ఎంపీలు అన్నట్టు తోట నరసింహం పేర్కొన్నారు. టీఎంసీ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ అభినందించారని చెప్పారు.

గ్రహం అనుగ్రహం

10–3–2018 శనివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
అష్టమి: ఉ. 7-01 తదుపరి నవమి
మూల నక్షత్రం: పూర్తి
అమృత ఘడియలు: రా. 12-00 నుంచి 1-45 వరకు
వర్జ్యం: మ. 1-26 నుంచి 3-11 వరకు
తిరిగి తె. 5-17 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 6-15 నుంచి 7-50 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-17; సూర్యాస్తమయం: సా.6-05

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	38.2	22.0
కడప	37.0	21.0
అనంతపురం	36.8	19.5
హైదరాబాద్	36.3	20.7
రాజమహేంద్రవరం	36.0	21.0
గుంటూరు	35.1	19.1
శ్రీకాకుళం	35.0	20.0
తిరుపతి	34.7	20.2
విజయవాడ	34.6	23.0
ఒంగోలు	33.8	23.1
నరసాపురం	32.5	22.4
విశాఖపట్నం	32.0	22.0
నెల్లూరు	32.0	22.0
తాడేపల్లిగూడెం	32.0	20.0

రష్యన్ ఎంబసీకి రాడార్ సరఫరా పేరిట మోసం

- రూ. 28 లక్షలు తీసుకుని ముఖం చాటేసిన వినుకొండ వాసి
- సొమ్ము తిరిగి ఇప్పించిన రాచకొండ పోలీసులకు ప్రశంస

ఈనాడు, హైదరాబాద్: భూ సారాన్ని పరీక్షించే రాడార్ సరఫరా చేస్తానంటూ దిల్లీలోని రష్యన్ దౌత్య కార్యాలయం అధికారులను ముప్పుతిప్పలు పెట్టాడో వ్యాపారి. ఆన్‌లైన్ టెండర్ దక్కించుకోవడంతోపాటు..42,500 అమెరికన్ డాలర్ల(సుమారు రూ.27.6 లక్షలు) తీసుకుని ముఖం చాటేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు..రాచకొండ పోలీసులు సదరు సొమ్మును తిరిగి ఇప్పించి ప్రశంసలందుకున్నారు. రష్యన్ దౌత్య కార్యాలయ అధికారి ఇగోర్ బాల్డిరేవ్‌తో కలిసి రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. దిల్లీ చాణక్యపురి శాంతిపథ్‌లోని రష్యన్ ఫెడరేషన్ ఎంబసీలో 270, 400 మెగాహెర్ట్జ్ సామర్థ్యం గల యాంటెన్నాలతో కూడిన 'ఎస్ఐఆర్ 3000 గ్రౌండ్ పర్టేనింగ్ రాడార్' కోసం 2016 మే నెలలో దౌత్యాధికారులు ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించారు. 'హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని హుడా కాలనీ చిరునామాతో గల మెస్సర్స్ కేఆర్‌బీ- జీఈఐఓ సర్వీసెస్' తరఫున గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన కోరె రంగబాబు టెండరు దాఖలు చేశాడు. దాన్ని దక్కించుకున్నాడు. తర్వాత రంగబాబుతో పలు దఫాలుగా సంప్రదింపులు జరిపిన దౌత్యాధికారులు 42,500 అమెరికన్ డాలర్ల సొమ్మును ఆన్‌లైన్‌లో బదిలీ చేశారు. అయినా పరికరాన్ని ఆయన సకాలంలో సరఫరా చేయలేకపోయాడు. టెండర్ సమయంలో ఉన్న సదరు పరికరం ధర..సరఫరా సమయానికి భారీగా పెరగడంతో చేతులెత్తేశాడు. నెలలు గడుస్తున్నా పరికరాన్ని సరఫరా చేయకపోవడం, కొంత కాలం తర్వాత రంగబాబు వారి సంప్రదింపులకు స్పందించడం మానేయడంతో దౌత్యాధికారులు గత సెప్టెంబరులో రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్‌ను సంప్రదించారు. ఇగోర్ బాల్డిరేవ్ ఫిర్యాదు మేరకు సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి రంగబాబును విచారించారు. సదరు నగదును అతన్నుంచి రాబట్టి..దౌత్యకార్యాలయ అధికారులకు తిరిగి ఇప్పించారు.



సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామిని అభినందిస్తున్న బాల్డిరేవ్, పక్కనే కమిషనర్ మహేశ్‌భగవత్

రాచకొండ పోలీస్ భేష్.. కేసు మూసివేత

ఈ సందర్భంగా బాల్డిరేవ్ మాట్లాడుతూ...రాచకొండ పోలీసుల పనితీరును ప్రశంసించారు. ఈ మేరకు భారత్‌లోని రష్యా దౌత్యాధికారి నికోలాయ్ కుదాషెవ్ తెలంగాణ డీజీపీ మహేందర్‌రెడ్డికి ప్రశంసాపూర్వక లేఖ రాశారు. కమిషనర్ మహేశ్‌భగవత్, సహాయ ఐజీ మస్తిపురం రమేశ్, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి, ఎస్సై జయరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు కేసు వద్దన్న దౌత్యాధికారుల ప్రతిపాదన మేరకు రంగబాబుపై నమోదైన కేసును మూసివేసినట్లు రాచకొండ కమిషనర్ తెలిపారు. శుక్రవారం లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదిరిందని వెల్లడించారు.

ప్రభుత్వానికి ఉద్యోగుల అండ: అశోక్‌బాబు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విభజన చట్టం ప్రకారం కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సినవి రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా ఉంటామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర ఛైర్మన్, ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు తెలిపారు. జిల్లాకు వచ్చిన ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రం విడిపోయి ఆర్థిక లోటులో ఉందని ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా రావాల్సిందేనన్నారు. పైనుంచి నిధులు రాకపోతే ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉంటుందన్నారు. తాజాగా ఏర్పడిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం మొండి వైఖరి ప్రదర్శిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. అందుకే ఈ నెల 13న అన్ని జిల్లా కేంద్రాల్లో నాడు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాలు పంచుకున్న అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, న్యాయవాదులు, తదితర సంఘాలన్నింటినీ జతకట్టి ప్రదర్శన చేస్తామన్నారు. కంట్రిబ్యూటరీ పింఛను విధానాన్ని రద్దు చేయాలన్నారు. మేలో టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సమావేశం జరగనుందని అక్కడ ఏ నిర్ణయాలు తీసుకుంటారో చూడాల్సి ఉంటుందన్నారు.

హతమార్చేందుకే జైలుకు పంపారు

- మంద కృష్ణమాదిగ

హైదరాబాద్, న్యూస్‌టుడే: తనను భౌతికంగా హతమార్చేందుకే ప్రభుత్వంలో కీలక వ్యక్తులు కుట్ర చేసి జైలుకు పంపించారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. సికింద్రాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను దీక్షకు కూర్చొని పది నిమిషాలు కాక ముందే అరెస్టు చేసి జైలుకు పంపారని, కుట్రలో భాగంగానే ఇలా చేశారని, అందుకు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. తన హత్య కుట్రను అమలు చేసే బాధ్యతను ముఖ్యమంత్రి సన్నిహిత మంత్రి, ఒక ఎమ్మెల్యే తీసుకున్నారనే విషయం బయటకు పొక్కడంతోనే తాత్కాలికంగా వాయిదా వేశారని పేర్కొన్నారు.

పాఠశాలల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పాఠశాలలో ఉదయం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రతిజ్ఞకు సంబంధించిన పాఠాన్ని అన్ని బడులకు పంపించారు. ప్రతి విద్యార్థి తనతోపాటు 100మందిని పరిశుభ్రత కోసం 100గంటల సమయాన్ని కేటాయించేటట్లు చేస్తానని ప్రమాణం చేయాల్సి ఉంటుంది. ఈ రోజు పరిశుభ్రత గురించి తాను వేసిన ఈ ముందడుగు ఏపీ రాష్ట్రాన్ని, దేశాన్ని శుభ్రపరిచడంలో సహాయం చేస్తుందని నమ్ముతున్నానంటూ ముగిస్తారు.

ఈనాడు

మోగాలిక నారీభేరి


అమ్మ కడుపులోనే ఆడపిల్లకు అమానుషంగా సమాధి కట్టేయడానికి తెగబడుతున్న సామాజిక దుర్విచక్షణే, దేశంలో స్త్రీ సాధికారత సాధనకు అక్షరాలా గొడ్డలిపెట్టు అవుతోంది. భ్రూణ హత్యలే కాదు- మహిళల్లో ముమ్మరిస్తున్న ఆరోగ్య సమస్యలు, పోషకాహార ఎదుగుదల లోపాలు ఆడపుటక పట్ల వేళ్లూనుకున్న చులకన ధోరణుల్ని కళ్లకు కడుతున్నాయి. వనితలపై హింసను అరికట్టడంతోపాటు అమ్మాయిల హక్కుల్ని పరిరక్షించేందుకంటూ మూడేళ్ల క్రితం 'బేటీ బచావో బేటీ పఢావో' పథకం తెరపైకి వచ్చింది. తొలుత వంద జిల్లాల్లో శ్రీకారం చుట్టి, మలి అంచెలో ఇంకో 61 జిల్లాలకు విస్తరించిన పథకాన్ని కేంద్రప్రభుత్వమిప్పుడు మొత్తం 640 జిల్లాల్లో అమలుపరుస్తామంటోంది. పథకం ఆరంభించిన హరియాణాలో, తాజా విస్తరణకు వేదికైన రాజస్థాన్‌లో సానుకూల మార్పులు నమోదయ్యాయంటున్న ప్రధాని మోదీ- తక్కినచోట్లా ఆడశిశువుల భ్రూణహత్యల్ని నిలువరించి నారీశక్తితో నవభారతం నిర్మిద్దామని రాష్ట్రాలకు పిలుపిస్తున్నారు! ఎనిమిది నెలల క్రితం కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ మంత్రి మేనకాగాంధీ ఈ పథక సాఫల్యాన్ని వివరిస్తూ వెల్లడించిన గణాంకాలు ఎందరినో విస్మయపరచాయి. గతంలో వెయ్యిమంది అబ్బాయిలకు 758మంది అమ్మాయిలే నమోదైన కర్నాల్ జిల్లా(హరియాణా)లో బేటీ పథకం ప్రవేశపెట్టాక ఆ సంఖ్య 884కి పెరిగిందట! కడలూరు (తమిళనాడు) 856 నుంచి 957, ఘజియాబాద్ (యూపీ) 899 నుంచి 977 వరకు మెరుగుపడ్డాయని- పథకానికి మోకాలడ్డిన పశ్చిమ్ బంగలో మాత్రం ఆ సంఖ్య 1022 నుంచి 898కి పడిపోయిందన్న అధికారిక వివరణపై నాడు ఎన్నో సందేహాలు వ్యక్తమయ్యాయి. క్షేత్రస్థాయిలో అనేక ప్రసవాలు రికార్డులకు ఎక్కని దృష్ట్యా లింగ నిష్పత్తిలో మార్పుల్ని ఇదమిత్థంగా నిర్ధారించగల వీల్లేదు. బాలికా సంరక్షణను ఉద్యమంలా చేపట్టాలని రాష్ట్రాలకు దిశానిర్దేశం చేస్తున్న కేంద్రం, జాతీయ స్థాయిలో ఏకోన్ముఖ కార్యాచరణకు ఎంతమేర దోహదపడుతున్నట్లు?

కేంద్రస్థాయిలో రూపుదిద్దుకొని, రాష్ట్రాలతో అర్థవంతమైన సమన్వయం కొరవడిన కారణంగా చతికిలపడ్డ పథకాల జాబితాలో పట్టణ పునరుద్ధరణ మిషన్ (జేఎన్ఎన్‌యూఆర్ఎమ్)ది ముందంజ. ఏడేళ్ల వ్యవధిలో అరవై నగరాల ముఖచిత్రాల్ని గణనీయంగా మార్చేస్తామంటూ వేలకోట్ల రూపాయలు గుమ్మరించిన తరవాతా ఎక్కడి గొంగడి అక్కడే కావడం- యూపీఏ విఫలగాథ. మునుపటి ఏలుబడిలో మొదలై ఎన్‌డీఏ జమానాలోనూ భూరి నిధులు వ్యయీకరించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానిదీ అదే పద్దు. అటువంటి చేదు అనుభవాలతో 'బేటీ బచావో...' విషయంలో ఇప్పటికే అన్ని జాగ్రత్తలూ తీసుకుని ఉండాల్సింది. కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ సారథ్యంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ, మహిళాభివృద్ధి, విద్యా ఆరోగ్య విభాగాలు కలిసికట్టుగా పట్టాలకు ఎక్కించాల్సిన విశిష్ట పథకమిది. వాస్తవంలో దేశవ్యాప్తంగా ప్రధాన రాష్ట్రాలు 21లో 17 లింగనిష్పత్తిలో ఆందోళనకర తరుగుదలను నమోదు చేసినట్లు 'నీతి ఆయోగ్' అధ్యయనమే వెల్లడిస్తోంది. ఆ వరసలో గుజరాత్, హరియాణా, రాజస్థాన్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర ముందున్నాయన్నది 'స్వస్థ రాష్ట్రాలు- పురోగామి భారత్' నివేదిక సారాంశం. మధ్యప్రదేశ్, గోవా, ఛత్తీస్‌గఢ్ వంటివి బాలికా సంరక్షణ పథకాలను లోగడే పట్టాలకు ఎక్కించాయి. 29 రాష్ట్రాల్లో రూ.300 కోట్లు వెచ్చించిన 'బేటీ బచావో...'తో పోలిస్తే రూ.5,000 కోట్ల వ్యయంతో తాము అమలుపరుస్తున్న కన్యాశ్రీ పథకం ఎన్నో విధాల మిన్న అని పశ్చిమ్ బంగ సర్కారు చాటుకుంటోంది. ఆడబిడ్డ జన్మించగానే ఆధార్ తరహా ప్రత్యేక సంఖ్యనొకదాన్ని కేటాయించి, పదిహేనేళ్ల వయసు నిండేదాకా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలన్నీ చేకూరుతున్నాయో లేదో పర్యవేక్షించాలని రెండేళ్ల క్రితం ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడి హైకోర్టు సూచించింది. మేలిమి యోచనలు, అనుభవ పాఠాల్ని స్వీకరించి రాష్ట్రాలకు సరైన భాగస్వామ్యం కల్పిస్తేనే- 'బేటీ బచావో...' మౌలిక లక్ష్యం నెరవేరుతుంది!

రాజ్యాంగ పీఠిక దగ్గర నుంచి ఆదేశిక సూత్రాల వరకు అన్నీ స్త్రీ పురుష సమానత్వానికే ఓటేస్తున్నా, పార్టీలన్నీ ఆ స్ఫూర్తికి కట్టుబాటు చాటుతున్నామంటున్నా- మహిళా సాధికారత నేటికీ ఎండమావినే తలపిస్తోంది. చట్టసభల్లో వారికి మూడోవంతు కోటాకు ఏ పక్షానికాపక్షం పైకి సై అంటున్నా, లోలోపల నెరపుతున్న రాజకీయం వేరు. పదహారో లోక్‌సభకు ఎన్నికైన 543 మందిలో పురుషులు 89 శాతం. కాంగ్రెస్, భాజపా, ఆమ్‌ఆద్మీ పార్టీ టికెట్లు దక్కిన మహిళలు- వాటి తరఫున మొత్తం ఎంపీ అభ్యర్థుల్లో 12 శాతంలోపు. కొద్దిపాటి తేడాలతో, తక్కిన పార్టీలూ ఆ తానులో ముక్కలే. రువాండా (63.8 శాతం), బొలీవియా (53.1) వంటి దేశాల్లో మహిళా ప్రాతినిధ్యంతో పోలిస్తే భారత్ వెలాతెలా పోవడానికి తరతమ భేదాలతో ఇక్కడి రాజకీయ పార్టీల దొంగాటకాలే పుణ్యం కట్టుకుంటున్నాయి! స్త్రీశక్తి అనేది వట్టి ప్రకటనలతో ఇనుమడించదు. మహిళల సామాజికార్థిక దుస్థితిగతులపై వెలుగుచూసిన నిపుణుల విశ్లేషణలు- హింస, వేధింపులు, లింగ నిష్పత్తి క్షీణత, ఆర్థిక స్వావలంబన లేమిని ప్రధానంగా వేలెత్తిచూపాయి. ఆ కంతల్ని పూడ్చటానికి ఆడపిల్లల ఆరోగ్యం, చదువు, ఉపాధి, భద్రతలకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి. పాలన నిర్ణయాల్లో సమధిక భాగస్వామ్యం దఖలు పడితేనే, స్త్రీల శక్తిసామర్థ్యాలు గరిష్ఠ స్థాయిలో జాతికి ఉపయుక్తమయ్యే వాతావరణం నెలకొంటుంది. ఈ యథార్థాన్ని కప్పిపుచ్చి, ఎన్నికల దృష్టితో ఎవరేమి యోజనలు వండివార్చినా- అవి పరిమితుల చట్రంలో బందీలవుతాయి. లింగ విచక్షణకు భరతవాక్యం పలకడమే ధ్యేయమైతే- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీ కార్యాచరణకు సన్నద్ధం కావాలి. చట్టసభల్లో మూడోవంతు కోటాపై పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తేనే- అన్నిందాలా మహిళాభ్యున్నతి సాకారమవుతుంది!

కల్లోలంలో పల్లెసీమలు

దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గతి తప్పుతోంది. వ్యవసాయ అనుబంధ రంగాలతో ముడివడిన వృత్తులు, సేవలు క్రమంగా బలహీనపడుతున్నాయి. పల్లె ఆర్థికం పట్టు తప్పడానికి కారణాలనేకం. నగర ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధిపైనే మోదీ ప్రభుత్వం పూర్తిగా దృష్టి కేంద్రీకరించింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమం ఏ దశలోనూ సరిగ్గా అమలు కావడం లేదు. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) రూపకల్పనలో కొన్ని మౌలిక లోపాలతోపాటు, క్షేత్రస్థాయిలో దాని అమలు అస్తవ్యస్తంగా ఉండటంతో గ్రామీణ వస్తు పంపిణీ వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పెద్దనోట్ల రద్దు ప్రభావం వల్ల పల్లెపట్టుల చేతుల్లో ఇప్పటికీ డబ్బు ఆడటం లేదు. బ్యాంకింగ్ రంగం కుదుపుల్లోనే కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక పునరుజ్జీవం సాధించేశామంటూ ప్రభుత్వం చేసే ఏ ప్రకటనకూ హేతుబద్ధత లేదనే చెప్పాలి. ఆర్థిక వ్యవస్థ ప్రస్థానిస్తున్న తీరుతెన్నులు మార్చకపోతే గ్రామీణుల జీవన ప్రమాణాలు కొడిగడుతూనే ఉంటాయి. గ్రామీణ కుటుంబాలమీద ఆర్థిక భారం ఇనుమడిస్తూ ఉంటుంది. ఒకవైపు నిరుద్యోగిత పెరుగుతుంటే- మరోవంక వృద్ధి రేటు పైకి ఎగబాకే వైపరీత్యం అలాగే కొనసాగుతుంది! ఇదే పరిస్థితి కొనసాగితే స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు ఎంత పెరిగినా ఉపయోగం లేదు. ఒకవైపు అసమానతలు భయపెడుతూ విస్తరిస్తున్న పరిస్థితుల్లో- వృద్ధిరేట్లు దేశాన్ని కాపాడలేవు!



వ్యవసాయం వెలుగులీనాలి

భారత ఆర్థిక వ్యవస్థకు ఇప్పటికీ పల్లెలే ప్రాణాధారాలు. ఆరో దశకం(1960లు)నుంచీ పల్లెల ద్వారా దేశ ఆర్థికానికి నికరంగా దఖలు పడుతున్న మొత్తం తగ్గుతున్నప్పటికీ- వ్యవసాయ ఆధారిత రంగాల ప్రభావం మాత్రం క్రమంగా పెరుగుతోంది. జాతీయ నమూనా సర్వే సంస్థ అంచనాల ప్రకారం భారత్‌లో 57.8శాతం గ్రామీణ కుటుంబాలు వ్యవసాయ, సంబంధిత రంగాల్లో పనిచేస్తున్నారు. వ్యవసాయేతర కార్యకలాపాలవైపు అనేకుల దృష్టి మరలుతున్న మాట నిజమే. అయితే ఈ కార్యకలాపాలు విజయవంతంగా అమలు కావాలంటే గ్రామాల్లో సేద్యం బాగుండాలి. వ్యవసాయం నుంచి చక్కటి ఆదాయం పొందుతూ వస్తు, సేవలను ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయగల వాతావరణం ఏర్పడాలి. జాతీయ ఆదాయంలో గ్రామీణ ఆర్థికం వాటా 46 శాతమే. కాగా దేశంలోని 68.8 శాతం మందికి పల్లెలే ఆధారభూతంగా నిలుస్తుండటం గమనార్హం. దేశంలో 2011-12 మధ్యకాలంలో తయారీ రంగంలో జరిగిన ఉత్పత్తిలో 51.3 శాతం గ్రామాలనుంచే వచ్చినట్లు 'నీతి ఆయోగ్' అధ్యయన పత్రం ఒకటి ఇటీవల వెల్లడించింది. భారత కార్మిక శక్తిలో 72.4 శాతం గ్రామాల్లోనే నివసిస్తున్నారు. 1970-71 మధ్యకాలంలో జాతీయ ఆదాయంలో వ్యవసాయం వాటా 62.4 శాతం కాగా, 84.1 శాతం కార్మికశక్తి అప్పట్లో పల్లెల్లో నివసించింది. జీఎస్‌టీ లోపాల కారణంగా సంఘటిత రంగం సమస్యల పాలైంది. లావాదేవీల ఖర్చు ఉన్నపళంగా పెరిగిపోయింది. చిన్న కంపెనీలకు సంబంధించినంతవరకూ వ్యాపార, వాణిజ్యాల నిర్వహణ వ్యయమూ ఇనుమడించింది. జీఎస్‌టీ అమలు గ్రామీణ కుటుంబాల జీవికను ఒడుదొడుకుల పాలు చేసింది. మరోవంక అసంఘటిత రంగానికి తలెత్తిన సమస్యల గురించి ఎంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిది. జీఎస్‌టీ పెంచడంవల్ల టెలిఫోన్ బిల్లులు, బీమా చెల్లింపులు, డీటీహెచ్ రీఛార్జీలు, టికెట్ల కొనుగోళ్లు వంటి వందలాది నిత్యావసర సేవలు భారమయ్యాయి. మధ్యతరగతి, పేద ప్రజానీకంపై ఒత్తిడి తీవ్రమైంది. గడచిన రెండేళ్లుగా గ్రామీణ భారతం వివిధ సమస్యల బారినపడి కుములుతోంది. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఒక్కసారిగా కుప్పకూలిపోవడం, రైతన్నలకు ప్రభుత్వ మద్దతు కొరవడటం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న అత్యంత ప్రధానమైన సమస్య. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు తగిన ధర రాక రైతన్న పూర్తిగా డీలాపడిపోయిన సమయాల్లో- తీరిగ్గా రంగంలోకి దిగి ప్రభుత్వ సంస్థలు కంటితుడుపు మద్దతుధరలు ప్రకటించి వారిని ఆదుకునేందుకు చేసిన ప్రయత్నాలు కొరగానివిగా మిగిలిపోయాయి. ఉత్పత్తి వ్యయాలు ఏమాత్రం తగ్గడం లేదు. కానీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మాత్రం దారుణంగా కోసుకుపోతున్నాయి. దీనివల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రైతులకు ఖర్చుపెట్టడానికి రూపాయి కూడా దొరకని దురవస్థ తలెత్తుతుంది. గడచిన రెండేళ్లుగా దేశంలో కొనుగోలు శక్తి కొరవడి రైతన్నలు నానా బాధలూ అనుభవిస్తున్నారు. అభద్ర వాతావరణంలో వారు కొట్టుమిట్టాడుతున్నారు. వస్తుసేవల కొనుగోలుకు అవసరమైన సంపాదన కొరవడితే రైతులు చేతులు ముడుచుకుని ఇంట్లో కూర్చుంటారు. ఏమీ కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో కలో గంజో తాగి బతుకులు ఈడుస్తారు. దానివల్ల ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత ఏర్పడుతుంది. ఇందుకు ఓ ఉదాహరణ చూద్దాం. దేశంలో వ్యవసాయ ట్రాక్టర్లలో సమస్యలు తలెత్తితే వాటిని బాగుచేసే దుకాణాలు, ట్రాక్టర్లకు సంబంధించిన విడిభాగాలను విక్రయించే వ్యవస్థలు కొంతకాలంగా మూతపడుతున్నాయి. వ్యవసాయ వస్తూత్పత్తుల ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులు దాదాపుగా అన్ని రకాల అదనపు కొనుగోళ్లూ నిలిపివేశారు. పులిమీద పుట్రలా జీఎస్‌టీ రావడంతో వాణిజ్య లావాదేవీల్లో గందరగోళం తలెత్తింది. ఈ రెండు సమస్యలూ వ్యవసాయ ట్రాక్టర్ల విడిభాగాల విక్రేతలను, వాటి మరమ్మతులు చేసుకొంటూ పొట్టపోసుకొనే వర్గాన్నీ బాగా దెబ్బతీశాయి. తరచి చూస్తే ఇలాంటి దాఖలాలు అనేకం దర్శనమిస్తాయి. నేడు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోవడానికి ఇవన్నీ కారణాలే.

పెట్రోలు, డీజిల్‌లపై రాయితీ తొలగించడంతో గడచిన రెండేళ్లుగా పల్లెపట్టుల ఆర్థిక వ్యవస్థ కొత్త సమస్యల్లో కూరుకుపోతోంది. సబ్సిడీ తీసేయడంతో డీజిల్ ధరలు ఏమాత్రం పెరిగినా అసంఘటిత రంగానికి చెందిన వినియోగదారులపైనా, చిన్న వ్యాపారాలు చేసుకునేవారిపైనా భారం పడుతోంది. పెట్రోలు, కూరగాయల ధరలు పెరిగితే వారానికి, నెలకు ఓసారి వినియోగదారులపై పన్నుల మోత మోపినట్లుగా అవుతోంది. పెట్రో ధరల పెరుగుదల ప్రభుత్వానికి, పెట్రోలియం కంపెనీలకు తప్ప ప్రజలకు మేలు చేసే వ్యవహారం కాదు. 2017 అక్టోబరు నుంచి డీజిల్ ధర లీటరుకు సగటున నాలుగు నుంచి అయిదు రూపాయల మేర పెరిగింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(ఎమ్‌జీఎన్ఆర్ఈజీ) కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలన్న ఆలోచనే ప్రభుత్వానికి లేకుండా పోయింది. దాంతో ఎంజీఎన్ఆర్ఈజీ కార్డులు ఉన్న 44శాతం గ్రామీణుల ఆదాయాలపై ప్రతికూల ప్రభావం పడింది.

పన్ను రాయితీలతో సాంత్వన

ఆర్థిక వ్యవస్థ అతలాకుతలమై పల్లెపట్టులు తల్లడిల్లుతుంటే వాటిని ఆదుకునేందుకు, రైతులకు సాంత్వన చేకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి క్రియాశీల చర్యలూ చేపట్టలేదు. ఎంతసేపటికీ నగరాల్లో మౌలిక సౌకర్యాలు వృద్ధి చేయడంమీదే మోదీ సర్కారు దృష్టిపెట్టి పనిచేసింది. ఆకర్షణీయ నగరాల కోసం నిధులు కేటాయించింది. నూతన నౌకాశ్రయాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించింది. కానీ దేశంలో అత్యధిక ప్రజానీకం నివసించే పల్లెసీమలను మాత్రం పట్టనట్లుగా వదిలేసింది. ప్రస్తుతం రగులుతున్న సమస్య పరిష్కారంపై శ్రద్ధపెట్టాల్సిన ప్రభుత్వం- భవిష్యత్తులో ఆశల స్వర్గాలు నిర్మిస్తానంటూ వాగ్దానాలు చేయడం మొదలుపెట్టింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏ కార్యక్రమమూ గ్రామీణుల ఆదాయాలను పెంచలేకపోయింది. ఈ ఏడాది ఖరీఫ్‌నుంచి కనీస మద్దతు ధర చెల్లించి పంటలను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. తాజా నివేదికల ప్రకారం ఈ వాగ్దానాన్ని నెరవేర్చేందుకు ప్రభుత్వం రూ.80వేల కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. ఆ స్థాయిలో నిధుల సమీకరణకు కేంద్ర సర్కారు ఏ మేరకు సంసిద్ధంగా ఉందన్నది వెల్లడి కావాల్సి ఉంది. 2022లోగా దేశంలో రైతుల ఆదాయాలను రెట్టింపు చేసే విషయంలో అధ్యయనం కోసం నియమించిన కమిటీ అంచనాల ప్రకారం- ఆ లక్ష్య సాధనకు ప్రభుత్వం ఆరు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు గుమ్మరించాల్సి ఉంటుంది. రైతులు పండించిన ఖరీఫ్ పంటను కనీస మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తామన్న ప్రతిపాదనను ప్రభుత్వం 2017 అక్టోబరు నుంచి అమలు చేసి ఉంటే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు జరిగి ఉండేది. రైతుల ఆదాయాలు పెరిగి, కొనుగోళ్లకు చురుకుపుట్టి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కొత్తపుంతలు తొక్కేది. వస్తుసేవల పన్నును ప్రభుత్వం మరింత సరళీకరించాల్సి ఉంది. సేవలపై జీఎస్‌టీ రేట్లను 12శాతానికి కోత కోయడం తక్షణావసరం. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి కొంతమేర కోతపడవచ్చు. కానీ, ఒకవైపు పరిశ్రమలకు వేర్వేరు పన్ను రాయితీలు ప్రకటిస్తూ ప్రభుత్వం- మధ్యతరగతి కుటుంబాల జీవనాన్ని ఇబ్బందుల్లోకి నెడుతోంది. జీఎస్‌టీలో సేవలపై పన్ను తగ్గించి మధ్య తరగతికి, ముఖ్యంగా గ్రామీణవాసులకు ఊతంగా నిలిస్తే- కొనుగోళ్ల పెరుగుదలకు, ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవానికి, తద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో మరింత ఆదాయం సమకూర్చుకోవడానికి వీలు దొరుకుతుంది. పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు తగ్గించడం- ప్రభుత్వం దృష్టిసారించాల్సిన మరో ముఖ్యాంశం. పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల్లో తన వాటాను తగ్గించుకోవడానికి బదులు కేంద్ర ప్రభుత్వం- జీఎస్‌టీ కింద వాటిని కొనుగోలు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకురావడం ఆశ్చర్యకరం! పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల్లో కేంద్రం తన వాటాను వదులుకుంటే దానివల్ల దేశంలోని మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజానీకానికి ఎనలేని ఊరట దక్కుతుంది. ఇప్పటికైనా తక్షణ దిద్దుబాటు చర్యలపై ప్రభుత్వం శ్రద్ధపెట్టకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ మరిన్ని సమస్యల్లోకి కూరుకుపోయే ప్రమాదం ఉంది. దేశ ఆర్థికం కుంగితే తిరిగి అది కోలుకోవడానికి దీర్ఘకాలం పడుతుందన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి!

- సాయి ప్రకృత్

కూలి పనులే ప్రధాన ఉపాధి



స్వాతంత్ర్యానంతరం కాలం గడిచేకొద్దీ భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థ సమీకరణల్లో ఆసక్తికర మార్పులు చోటు చేసుకున్నాయి. మొత్తం కార్మిక శక్తిలో 1951తో పోలిస్తే వ్యవసాయ కూలీలు ప్రస్తుతం 30శాతం మేర పెరిగారు. మరోవంక రైతుల సంఖ్య సగానికి సగం కోసుకుపోయింది. 1951లో 9.72 కోట్లుగా ఉన్న వ్యవసాయ కార్మికుల సంఖ్య 2011నాటికి 26.31 కోట్లకు పెరిగింది (11.88 కోట్లమంది రైతులు, 14.43 కోట్ల మంది కార్మికులు). వ్యవసాయ, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల శాతం పల్లెల్లో అత్యధికంగా ఉంది.

అఫ్గాన్‌లో శాంతివీచిక

సుదీర్ఘ కాలం అంతర్యుద్ధాల వల్ల అఫ్గానిస్థాన్‌కు జరిగిన నష్టం అంతాఇంతా కాదు. ఒకప్పుడు సోవియట్ యూనియన్, ఇప్పుడు అమెరికా జోక్యాల ఫలితంగా ఆ దేశ పరిస్థితులు కుదుటపడలేదు సరికదా మరింత క్లిష్టమయ్యాయి. ఈ నేపథ్యంలో రాజధాని కాబూల్ నగరంలో జరిగిన కాబూల్ ప్రక్రియ-2 (కాబూల్ ప్రాసెస్) సమావేశంలో తాలిబన్లతో శాంతిచర్చలకు అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ పిలుపివ్వడం పెద్ద ముందడుగే. ఈ ప్రక్రియను ఎంత సమర్థంగా ముందుకు తీసుకువెళ్లగలరన్నదానిపై శాంతిస్థాపన ఆధారపడి ఉంటుంది. గత నెలాఖరులో జరిగిన ఈ సమావేశంలో భారత్, అమెరికా, చైనా, ఆస్ట్రేలియా, పాకిస్థాన్ సహా 26 దేశాలు హాజరయ్యాయి. పదిహేడేళ్లుగా కొనసాగుతున్న అంతర్యుద్ధానికి చర్చల ద్వారా ఇప్పటికైనా అర్థవంతమైన ముగింపు పలికితే ఉగ్రవాద నిర్మూలనలో అంతర్జాతీయ సమాజం గణనీయమైన విజయం సాధించినట్లవుతుంది!

శాంతిచర్చలకు అఫ్గాన్ ప్రభుత్వం, విదేశాలు, తాలిబన్లు సిద్ధపడటానికి బలమైన కారణాలే ఉన్నాయి. 2004 నుంచి 2014 వరకు పదేళ్లు పాలించిన హమీద్ కర్జాయ్ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఎదుర్కోలేకపోయింది. తరవాత వచ్చిన అష్రఫ్ ఘనీ ప్రభుత్వానిదీ అదే పరిస్థితి. రెండు ప్రభుత్వాలకు అమెరికా అండదండలు ఉన్నప్పటికీ అవి ఉత్సవ విగ్రహాల మాదిరిగా మిగిలిపోయాయి. దేశంలో మూడోవంతు భూభాగంపై, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాలిబన్లు పట్టు సంపాదించారు. సైన్యం, పోలీసులు సైతం వారిని నిలువరించే పరిస్థితిలో లేరు.

అఫ్గాన్ తలనొప్పిని వీలైనంత త్వరగా వదిలించుకోవాలని అమెరికా భావిస్తోంది. 2015 జనవరిలోనే అప్పటి ఒబామా ప్రభుత్వం అఫ్గాన్ నుంచి తమ సేనలను వెనక్కి రప్పించింది. అంతర్గతంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్న ట్రంప్ అఫ్గాన్‌పై పూరిస్థాయిలో దృష్టి పెట్టడం కష్టమే. అఫ్గాన్‌లో పరిమితంగానే ఇప్పుడు అమెరికా సేనలు ఉన్నాయి. వియత్నాం తరవాత అమెరికాకు అంతర్జాతీయంగా ఎక్కువ చికాకు కలిగించిన అంశం అఫ్గాన్. 2001 నుంచి ఇప్పటివరకు అఫ్గాన్‌లో అమెరికా పెట్టిన ఖర్చు 10,000 కోట్ల డాలర్లని అంచనా. అందువల్లే కాబూల్ ప్రక్రియ-2 సమావేశంలో పాల్గొన్న అమెరికా చర్చల ప్రతిపాదనకు వెన్వెంటనే సరేనంది. ఇతర దేశాలూ అందుకు సరేనన్నాయి. ఉగ్రవాదంతో సతమతమవుతున్న అఫ్గాన్‌కు ఈ దేశాలు ఉదారంగా సాయమందిస్తున్నాయి. పొరుగు దేశంగా, మిత్రదేశంగా భారత్ కూడా చర్చల ప్రతిపాదనను స్వాగతించింది. అఫ్గాన్ అభివృద్ధికి, అక్కడ శాంతిస్థాపనకు భారత్ చేస్తున్న కృషి మరే దేశం కూడా చేయడం లేదు. అనేక అభివృద్ధి పనులు, సాగునీటి ప్రాజెక్టుల పనులు చేపట్టింది. ఏకంగా పార్లమెంట్ భవనాన్నే నిర్మించి ఇచ్చింది.

చర్చల ప్రతిపాదనపై తాలిబన్లు విముఖంగా లేకపోవడానికి బలమైన కారణాలు లేకపోలేదు. తమకు



చర్చల బాటలో తాలిబన్లు?

అండగా నిలుస్తున్న పాకిస్థాన్ ఇటీవల కాలంలో ఒకింత బలహీన పడుతోంది. ఉగ్రవాదానికి పాక్ చేయూతపై అమెరికా తీవ్ర ఆగ్రహాన్నే వ్యక్తంచేసింది. సహాయాన్ని దాదాపుగా నిలిపివేసింది. తమ దేశంలో పాక్ చిచ్చు పెడుతోందని అఫ్గాన్ ప్రజలు బలంగా భావిస్తున్నారు. అధ్యక్షుడు ఘనీ, మాజీ అధ్యక్షుడు కర్జాయ్ పలుమార్లు ఈ విషయమై పాక్‌పై ధ్వజమెత్తారు. ఇటీవల కాలంలో ఐఎస్ఐఎస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) కదలికలు అఫ్గాన్‌లో కనబడటమూ తాలిబన్ల వైఖరిలో మార్పునకు మరో కారణం. జనవరి ఆఖరులో ఈ సంస్థ కాబూల్‌లో జరిపిన దాడుల్లో 11మంది సైనికులు మృతి చెందారు. సైనిక శిక్షణ కేంద్రం మార్షల్ ఫాహిమ్ అకాడమీలో ఆత్మాహుతి దళ సభ్యుడు తనను తాను పేల్చేసుకున్న ఘటనలో సైనికులతోపాటు మరో 16మంది గాయపడ్డారు. గత నెల 24న దేశంలోని ముఖ్య నగరమైన జలాలాబాద్‌లో బ్రిటన్ సాయంతో నిర్వహిస్తున్న 'సేవ్ ది చిల్డ్రన్' కార్యాలయం లక్ష్యంగా సాయుధులైన ఐఎస్ఐఎస్ ముష్కరులు దాడికి తెగబడ్డారు.

తాజా ప్రతిపాదనల ప్రకారం ఉగ్రవాద తాలిబన్ సంస్థ ముందుగా ఆయుధాలను విడనాడాలి. రాజ్యాంగానికి బద్ధులై ఉండాలి. ప్రభుత్వాన్ని గుర్తించాలి. ఈ క్రమంలో ఉగ్రవాద ముద్ర చెరిపేసుకుని తాలిబన్ రాజకీయ పార్టీగా అవతరించి, ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. ముందు శాంతిచర్చల విధివిధానాలను ఖరారు చేసుకోవడం కీలకం. చర్చల పట్ల తమ వైఖరిని తాలిబన్లు స్పష్టీకరించలేదు. వారు పెడుతున్న కొన్ని షరతులు అర్థవంతంగా లేవన్న వాదన వినబడుతోంది. ప్రస్తుత కీలుబొమ్మ ప్రభుత్వంతో కాక, నేరుగా అమెరికాతోనే చర్చలు జరుపుతామని ఆ సంస్థ చెబుతోంది. ఖతార్‌లో ఉన్న తమ కార్యాలయం ద్వారా అగ్రరాజ్యంతో చర్చలకు సిద్ధమన్న సంకేతాలు ఇస్తోంది. చర్చలకు సిద్ధపడినంత మాత్రాన తాము బలహీనపడినట్లు భావించరాదనీ హెచ్చరిస్తోంది. ముందుగా అమెరికా సేనలు వైదొలగాలన్నది దాని ప్రధాన డిమాండ్. మరోవైపు ముందుగా తమతో మాట్లాడితే తరవాత అమెరికాతో చర్చలు జరపవచ్చని అఫ్గాన్ ప్రభుత్వం అంటోంది. 2015 జులైలో తాలిబన్లు, అఫ్గాన్ ప్రభుత్వం మధ్య పాకిస్థాన్‌లో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. తాలిబన్ల వైఖరిలో ఇటీవల ఒకింత మార్పు కనబడుతోంది. అఫ్గాన్ ప్రజల ప్రయోజనాల విషయంలో ముందుంటామని అంటోంది. తుర్క్‌మెనిస్థాన్, పాకిస్థాన్, భారత్ సహజవాయువు పైప్‌లైన్‌కు భద్రత కల్పిస్తామంటున్నారు. ఈ పథకం వల్ల అఫ్గాన్‌కు లబ్ధి చేకూరుతోంది కనుక భారత్‌ను వ్యతిరేకించబోమని తాలిబన్లు చెబుతున్నారు.

అంతర్జాతీయంగా రాజకీయ సమీకరణలు మారుతున్న నేపథ్యంలో అఫ్గాన్ సంక్షోభంపై అందివచ్చిన చర్చల అవకాశాన్ని తాలిబన్లు సద్వినియోగం చేసుకోవాలి. మొండి పట్టుదలలకు పోకుండా ముందడుగు వేయాలి. గతంలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పోరాడిన ఉగ్రవాద సంస్థ 'హమస్' అనంతర కాలంలో ఆయుధాలు విడనాడి జనజీవన స్రవంతిలో కలిసిన అంశాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకోవాలి!

- గోపరాజు మల్లపరాజు

ఈనాడు లేఖలు

జాతీయ పార్టీల నయవంచన

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తాము అధికారంలోకి రాగానే ప్రత్యేక వెనకబడిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను గుర్తిస్తూ చట్టం చేస్తామని ప్రకటించారు. తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ సంబంధిత ప్రైవేటు బిల్లును పార్లమెంటులో ఇప్పుడైనా ప్రవేశపెట్టవచ్చు. ఇప్పటికే జాతీయ పార్టీలపై రాష్ట్రప్రజలు విశ్వాసం కోల్పోయారు. కాంగ్రెస్ ప్రైవేటు బిల్లు ప్రవేశపెడితే ఏ పార్టీ వైఖరి ఏమిటో స్పష్టమవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంటే ఉన్నతమైంది. 14వ ఆర్థిక సంఘం అడ్డుచెప్పినందువల్ల ప్రత్యేక హోదా ఇవ్వలేకపోతున్నామంటూ పార్లమెంటును తప్పుదోవ పట్టించడం ప్రజావంచనే! భాషాప్రయుక్త రాష్ట్రాల విధానాన్నే పక్కనపెట్టి, పార్లమెంటు తలుపులు మూసి అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజించిన జాతీయ పార్టీలు, ఏదో ఆర్థిక సంఘం చెప్పిందంటూ ప్రత్యేకహోదా ఇవ్వలేమనడం- తెలుగు ప్రజలను దగా చేయడమే అవుతుంది.

- గరిమెళ్ళ రామకృష్ణ, ఏలూరు, పశ్చిమగోదావరిజిల్లా

నడకదారి మాయం

నగరాలు, పట్టణాల్లో ఆక్రమణలకు గురవుతున్న పాదచారుల బాట(ఫుట్‌పాత్)ల సమస్యపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించాలి. ఈ మార్గాలను చిరువ్యాపారులు, తోపుడు బండ్లవారు ఆక్రమించుకుంటున్నారు. వారిని ఉన్నపళంగా అక్కడి నుంచి తొలగించడం ఈ సమస్యకు పరిష్కారం కాబోదు. కొన్ని రోజుల తరవాత పరిస్థితి మళ్ళీ అదే స్థితికి చేరుకుంటోంది. పాదచారుల బాటలను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నవారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి. ఇక భవనాలు, దుకాణాల యజమానుల ఆక్రమణల వల్లా పాదచారుల బాటలు కుదించుకుపోతున్నాయి. నివాస ప్రాంతాల్లో అయితే రోడ్డు పక్క స్థలాలను వాహనాల నిలుపుదలకు యథేచ్ఛగా వినియోగించుకుంటున్నారు. ప్రజల రాకపోకలకు అంతరాయాలు సృష్టిస్తున్న ఈ అవ్యవస్థను సరిదిద్దడానికి అధికారులు స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేయాలి. వాటిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- పి.వినోద్‌కుమార్, అనకాపల్లి, విశాఖజిల్లా

సకలం మధురం

'మధురాధిపతి' అనే పదంలో తీయదనం ఉంది. అది తీయలేని తేనె ధనం! ఆ మాట వింటే పులకింత, పలికితే గిలిగింత కలుగుతాయి. చక్కెరలో అద్దినట్లు, మక్కువతో దిద్దినట్లు ఆపాతమధురంగా ఉంటుంది ఆ పదబంధం. ఆలోచనామృతంగా, అద్వైతానంద భాసురంగా ఉండే అది ఆధ్యాత్మిక పరిభాషలో- ఓ జీవ నదం!

మధురాధిపతి అంటే, మధురా నగరానికి అధిపతి. ఆ నగరం పేరులోనూ మాధుర్యం నిండి ఉంటుంది. అచ్యుతుడి పేరే దానికి ఆ ఘనత తెచ్చింది. ఆ పేరు, ఉనికి, ఆ కేశవుడి ధ్యాస, నారాయణుడి ఆశ్వాస- సమస్తం మాధురీభరితం. కృష్ణ శబ్ద మణిపూస అది. శంకర భగవత్పాదుల ముఖపంజరంలో నుంచి వెలువడిన పలుకుల రామచిలుకా అదే! అది- అచ్యుతాష్టకమ్.

'అష్టకం' అంటే, ఎనిమిది శ్లోకాల సమాహారం. సమస్త భూలోకాన్నీ తరింపజేసే పుణ్యనామావళీపూరం. ఇందులోని ఒక్కో నామ విశిష్టత మానవ జన్మను తరింపజేస్తుంది.

'చ్యుతి' అంటే పతనం, నాశనం. అవేమీ లేనివాడు అచ్యుతుడు. మనుషులకు చ్యుతి ఉంటుంది కాబట్టి, వారు అచ్యుత స్థితిని పొందాలంటే నిత్యమూ అచ్యుత నామస్మరణ చేయాలి. కేశవుడు అంటే, కేశి అనే రాక్షసుణ్ని చంపినవాడు. మానవుడు తనలోని దానవుణ్ని సంహరించాలంటే, స్వామి నామజపమే ఏకైక మార్గం.

రాముడు అంటే, అందర్నీ అలరింపజేసే గుణాలు కలిగినవాడు. నారాయణుడు అంటే, సృష్టికి ఆధారంగా భావించే నీటికి మూలమైనవాడు. కృష్ణుడు అంటే, కృషి చేసే స్వభావం ఉన్నవాడు. దామోదరుడు అంటే, నాభిలో కమలం కలిగి ఉన్నవాడు. నాభి నుంచే వాక్కు పుడుతుందంటారు. ఆ వాక్కులు పద్మంలా వికసించాలంటే, దామోదరుడి స్మరణ తప్పనిసరి.

వాసుదేవుడు అంటే, సంపదలకు నిలయమైనవాడు. వసుదేవుడి సుతుడు. 'వసు' శబ్దం సంపద అనే అర్థమిస్తుంది. స్వామి సంపన్నుడి పుత్రుడనే రమణీయ భావంలో దీన్ని వాడతారు. హరించేవాడు హరి. అంటే, పాపాల్ని హరించే భగవానుడు. సింహం అనే అర్థమూ 'హరి'కి ఉంది. ఎటుచూసినా ఇది సమున్నత భావన.

శ్రీధరుడు అంటే, లక్ష్మీదేవిని హృదయంలో నిలిపినవాడని అర్థం. ఆమె సర్వ సంపదలకూ అధిదేవత. ఆ దేవిని హృదయ పద్మంలో నిలిపి ఆరాధించేవాడే శ్రీధరుడు. ఆయనే భక్తుల పాలిట కొంగుబంగారం! మాధవుడు అంటే, లక్ష్మీపతి. మాధవం అంటే వసంత కాలం. ఆ కాలంలా, ఎప్పుడూ వికసించి నేత్రానందం కలిగించేవాడే



అంతర్యామి

స్వామి! మరో రూపంలో- జానకీనాయకుడు, రామచంద్రుడు. ఆయనను సదా స్మరించేవారికి ఈ సంపదలన్నీ కరతలామలకాలు.

స్వామి 'సత్యభామాధవుడు'. అంటే, సత్యం అనే స్త్రీ రత్నానికి భర్త. ఆయనను ధ్యానిస్తే, సత్యాన్ని వశం చేసుకొని జీవితమంతా సత్యమయంగా గడపవచ్చు. ఇందిరా మందిరుడు ఆయన. అన్ని సంపదలకూ నిలయమైనవాడని అర్థం. తానూ సంపదలకు నెలవు కావాలంటే, సాధకుడు సదా స్వామి నామాన్నే స్మరించాలి. అది అన్నివిధాలా ఫలదాయకం.

స్వామి- విష్ణువు. అంటే, సర్వాంతర్యామి. స్వామి జిష్ణువు. జయించే స్వభావం ఆయన సొంతం. ఆ చేతిలోని శంఖం భువనాల్ని రక్షిస్తుంది. చక్రం దుష్టసంహారాన్ని సాగిస్తుంది. సుకుమారమైన చేతివేళ్లతో భగవంతుడు మురళీనాదం చేస్తుంటే, భువనాలన్నీ ఆ మధుర వాహినిలో ఓలలాడాల్సిందే!

స్వామి స్వరూపం జగన్మోహనకరం. ఆ ముఖారవిందం అత్యంత మనోహరం. ఆ మధురాధిపతి నామ, రూప, అలంకార, గాన, వీక్షణ మధురిమలు అనిర్వచనీయాలు.

అష్టకాలు మానవుల్ని కష్టకాలాల నుంచి కాపాడి, ఇష్టసౌఖ్యాలు అందించి, అష్టైశ్వర్యాల్ని ప్రసాదిస్తాయి. మనోహర నామాలతో అలరారే 'అచ్యుతాష్టకం' స్తోత్ర సాహిత్యంలో మేలిమి రత్నం. దీన్ని మనసారా పఠిస్తే కృష్ణుడే భక్తుడి వశమవుతాడంటూ, శంకర భగవత్పాదులు ఫలశ్రుతిని అనుగ్రహించారు. మధుర నాద లహరిలో ఓలలాడించే కృష్ణతత్వం ఒక్క భువన మోహనమే కాదు- కవన సమ్మోహనమైనా, జీవనానంద వనమైనా అదే!

- డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ



కాణిపాకం వరసిద్ధుని ఆలయంలో సత్యప్రమాణం చేసి బయటకు వస్తున్న మాజీ మంత్రి కామినేని

బెట్ట రైతుకు 'జీబా' భరోసా

- భారీగా నీటిని నిల్వ చేసుకునే ఉత్పత్తి
- వర్షాభావ సమయంలో మొక్కలకు సరఫరా
- వచ్చే ఖరీఫ్‌లో అనంతపురంలో 2 లక్షల ఎకరాలకు పంపిణీ
- పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్న ప్రభుత్వం

ఈనాడు - అమరావతి

వాన కురిసిన రోజుల్లోనే మొక్కలు కళకళలాడతాయి. వారం పాటు జల్లు జాడలేకపోతే చాలు.. బెట్టకొస్తాయి. క్రమంగా ఎండుముఖం పడతాయి. ఈ పరిస్థితుల నుంచి పంటను కొన్నాళ్లపాటు కాపాడుకునేలా ప్రభుత్వం 'జీబా' అనే ఉత్పత్తిని రైతులకు అందజేయాలని నిర్ణయించింది. వచ్చే ఖరీఫ్‌లో అనంతపురం జిల్లాలోని రెండు లక్షల ఎకరాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించనుంది. యునైటెడ్ ఫాస్ఫరస్ లిమిటెడ్ (యూపీఎల్) సంస్థ ఈ ఉత్పత్తిని ప్రభుత్వానికి ఇస్తోంది.

ఏంటి ఉపయోగం?: బెట్ట పరిస్థితుల్లో నీరందకపోతే మొక్క ఎదుగుదల తగ్గిపోవడంతోపాటు పూతరాలడం, ఎండిపోవడం ఆరంభమంగా దిగుబడులపై ప్రభావం పడుతుంది. ఇక్కడ మాత్రం మొదళ్ల వద్ద ఉండే జీబా తాను సంగ్రహించిన నీటిని మొక్కకు విడుదల చేస్తుంది. దీంతో పంట ఉత్పత్తి ఒకే పరిమాణంలో వస్తుంది. దిగుబడి కూడా పెరుగుతుంది. నీటితడులకు పెట్టే ఖర్చు తగ్గుతుంది. పోషకాల వృథాను నివారించడం వల్ల ఆ మేరకు కూడా ఖర్చు ఆదా అవుతుంది. బావి, బోర్లలో నీరున్నా విద్యుత్తు సరఫరా ఉంటేనే పొలానికి నీరు పెట్టే వీలుంటుంది. ఈ అవకాశం లేని ప్రాంతాల్లో స్వల్పకాలిక పంటలు వేసుకుని జీబా వాడటం ద్వారా దిగుబడులు తీసుకోవచ్చు.

ఎలా పనిచేస్తుంది?: ఎకరాకు 5 కిలోల జీబా అవసరం అవుతుంది. కల్లు ఉప్పులా ఉండే దీన్ని నేరుగా భూమిపై చల్లడమో, ఎరువుతోపాటు కలిపి భూమిలోకి ఎడపెట్టడమో చేయాలి. ఇది వర్షం పడగానే భూమిలోకి ఇంకే నీటిని గ్రహిస్తుంది. తన పరిమాణానికి 400 రెట్ల స్థాయిలో నీటిని నిల్వ చేసుకుంటుంది. పోషకాల వృథాను నివారించి వాటిని తనలోకి తీసుకుంటుంది. వర్షాభావ సమయంలో మొక్క వేళ్లకు అవసరమైన నీటితోపాటు పోషకాలను అందిస్తుంది. నాలుగైదు నెలల పాటు భూమిలో నిల్వ ఉండే ఇది ఒక పంట కాలం తర్వాత భూమిలో కలిసిపోతుంది. ఐదుకేజీల ధర రూ. 2,500 నుంచి రూ. 2,700 మధ్య ఉండే అవకాశం ఉంది.

రైతుల సానుకూలం: గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో మిర్చి, నారాకోడూరులో కూరగాయలకు దీన్ని ఉపయోగించారు. కృష్ణా జిల్లాలో వేరుశనగ, మార్కాపురంలో మిర్చి, అనంతపురం జిల్లాలో తర్బూజా, పుచ్చ, అరటి రైతులు ఈ ఉత్పత్తిని వాడారు. 'బోర్లపాయింకి ఎంత నీరు పెట్టినా మూడు నాలుగు రోజులకు మళ్లీ పెట్టాల్సి వచ్చేది. ఇది చల్లాక మొక్క 15 రోజుల దాకా వాడ కుండా ఉందని' ముప్పాళ్లవారిపాలెం రైతు అంజిరెడ్డి వివరించారు. మిర్చిలో వినియోగం వల్ల రెండు తడులు తగ్గించుకునే వీలుందని జీబాను ఉపయోగించిన రైతులు వివరించారు.

లక్ష ఎకరాలకు కొంతం..: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన సమయంలో ఈ ఉత్పత్తిని పరిశీలించారు. మంగళవారం సంస్థ గ్లోబల్ సీఈఓ జైషాఫ్‌తో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారి ఉత్పత్తి పనితీరు, రాష్ట్రంలో వినియోగంపై చర్చలు జరిగాయి. లక్ష ఎకరాలకు సరిపడా ఉత్పత్తిని తాము కొనుగోలు చేస్తామని.. అంతే స్థాయిలో ఉచితంగా అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనికి సంస్థ సీఈఓ అంగీకరించారు. తమ ఉత్పత్తి పర్యావరణ అనుకూలమైనదని వివరించారు. ఇది మొక్కజొన్న పిండి పదార్థం నుంచి తయారు చేసిందని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద వచ్చే ఏడాది 2 లక్షల ఎకరాల్లో అనంతపురం రైతులకు జీబాను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ విజయవంతమైతే పెద్ద ఎత్తున ముందుకెళ్తామని అసెంబ్లీలో సీఎం ప్రకటించారు.

ముక్త్యాల రాణి వాసిరెడ్డి రాజ్యలక్ష్మి అస్తమయం



వాసిరెడ్డి రాజ్యలక్ష్మి (పాతచిత్రం)

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే, ఈనాడు డిజిటల్, అమరావతి: కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల సంస్థానానికి చివరి రాణిగా వ్యవహరించిన వాసిరెడ్డి రాజ్యలక్ష్మి (97) గురువారం రాత్రి చెన్నైలో కన్నుమూశారు. కొద్దికాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. 1974-78 వరకు జగ్గయ్యపేట ఎమ్మెల్యే (కాంగ్రెస్)గానూ రాజ్యలక్ష్మి సేవలందించారు. ఆమె ముక్త్యాల రాజా, మాజీ ఎమ్మెల్యే దివంగత రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర (వీఆర్‌జీకేఎం) ప్రసాద్ సతీమణి. చల్లపల్లి జమిందారు యార్లగడ్డ శివరామప్రసాద్ సోదరి. కేసీపీ సంస్థల సీఎండీ వెలగపూడి ఇందిరాదత్తు మాతృమూర్తి. రాజ్యలక్ష్మి 1921 జనవరి 27న జన్మించారు. రాజకీయ ప్రవేశంతో పాటు సాహిత్య పోషణ, సేవా నిరతి, పాలనా దక్షత కలిగిన పరిపూర్ణ మహిళగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా జీవన ప్రస్థానం సాగించారు. ఆమె అంత్యక్రియలను ఆదివారం ముక్త్యాల వద్ద కృష్ణా నది తీరంలో నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు.

రాజ్యలక్ష్మి సేవలు మరువలేనివి: సీఎం

వాసిరెడ్డి రాజ్యలక్ష్మి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యేగా జగ్గయ్యపేట ప్రాంత అభివృద్ధికి ఆమె విశేష కృషి చేశారని గుర్తుచేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఆమె మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా సంతాపం తెలిపారు.

మంత్రిగా అవినీతికి పాల్పడలేదు

మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్

కాణిపాకం, న్యూస్‌టుడే: తాను మంత్రిగా పనిచేసిన సమయంలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడలేదని కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం చిత్తూరు జిల్లా కాణిపాకంలో వెలసిన స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఎదుట సత్యప్రమాణం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని టీవీ చానళ్లు, పత్రికల్లో తాను మంత్రిగా ఉన్న శాఖలో అవినీతికి, అక్రమాలకు పాల్పడినట్లు వచ్చిన వార్తలపై స్పందించినట్లు తెలిపారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో విధి నిర్వహణలో పక్షపాతం లేకుండా పారదర్శక పాలన అందించినట్లు వివరించారు. కాణిపాకం వినాయకుని వద్ద అసత్య ప్రమాణం చేస్తే వారికి శిక్ష తప్పదన్నారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడకపోవడంతో ధైర్యంగా స్వామివారి ఎదుట సత్యప్రమాణం చేసినట్లు తెలిపారు.

మార్క్‌ఫెడ్ ద్వారా పప్పుధాన్యాల కొనుగోలు

ఈనాడు డిజిటల్, అమరావతి: కందులు, మినుములు, శెనగలు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని మార్కెటింగ్ శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 15 వరకు ప్రతి రైతు నుంచి 25 క్వింటాళ్లు కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. ఇ- పంటకు సంబంధం లేకుండా ఇ-కొనుగోళ్లు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అవసరాన్ని బట్టి ఈ గడువును పొడిగిస్తామని తెలిపారు. రైతు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

వడగాలులు... అధిక ఉష్ణోగ్రతలు

- ఈ వేసవిలో ఊహిస్తున్న ప్రమాద ఘంటికలివి
- వెల్లడించిన భారత వాతావరణ శాఖ

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో గతంతో పోలిస్తే ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు 0.5 నుంచి 1 డిగ్రీ అధికంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. మార్చి నుంచి మే మధ్య కాలంలో ఈ తీవ్రత ఉండనుంది. ముఖ్యంగా కోస్తాంధ్ర ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలతో పాటు, వడగాలులూ వీచే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం విజయవాడలోని ఏపీ విపత్తు నిర్వహణ శాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భారత వాతావరణ కేంద్రం సంచాలకులు వై.కే రెడ్డి ఈ మేరకు వెల్లడించారు. తీవ్రత ఉండే మండలాలను ముందుగానే గుర్తించి, అక్కడి రెవెన్యూ అధికారులను, స్థానికులను అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నేరుగా చరవాణిలకు సందేశాలు పంపేలా ప్రత్యేక వ్యవస్థ అందుబాటులో ఉందని వివరించారు. ఏపీ ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేసుకొనేలా హీట్ యాక్షన్ ప్లాన్ రూపొందించిందని తెలిపారు. వడగాలుల తీవ్రతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విభాగం ఇప్పటికే ఏర్పాటయిందన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తుందన్నారు. వెబ్‌సైట్, యాప్‌ను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ అధికారులు పాల్గొన్నారు.



నౌకలోని కంటైనర్లో దొరికిన ఎర్రచందనం దుంగలు

నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

ఈనాడు డిజిటల్, అమరావతి: స్వయం ఉపాధి పొందేందుకు నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో 6 వారాలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బ్యాంకర్ల గ్రామీణ, ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ(బైరెడ్) తెలిపింది. శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పిస్తామని, 19-30 సంవత్సరాల వయసు గల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు అర్హులని వెల్లడించింది. ఏప్రిల్ 4 నుంచి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ కార్యాలయంలో శిక్షణ మొదలవుతుందని బైరెడ్ సంచాలకులు యేసేపు శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. పూర్తి వివరాలు www.bired.org వెబ్‌సైట్‌లో ఉంటాయని తెలిపారు.

నాగార్జున వర్సిటీలో అంతర్జాతీయ కార్యశాల

- పురావస్తు శాఖ కమిషనర్ వాణిమోహన్ వెల్లడి

సూర్యారావుపేట(విజయవాడ), న్యూస్‌టుడే: సంస్కృతి, వారసత్వ సంపదను భావితరాలకు అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర పురావస్తు శాఖ పనిచేస్తోందని ఆ శాఖ కమిషనర్ డాక్టర్ వాణిమోహన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో అంతర్జాతీయ కార్యశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం విజయవాడలో ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యశాలకు దక్షిణ కొరియా, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, శ్రీలంక, కంబోడియా దేశాల నుంచి 30 మంది ఆచార్యులు, సహాయ ఆచార్యులు హాజరవుతారని వెల్లడించారు. వీరు సమర్పించిన పరిశోధన పత్రాలను పుస్తక రూపంలోకి తీసుకువస్తామన్నారు. మొదటి రెండు రోజుల పాటు వివిధ అంశాలపై చర్చిస్తారని మూడో రోజు క్షేత్రపర్యటనలో భాగంగా పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళతామన్నారు. ముంపు ప్రాంతాల్లోని పురాతన వస్తువుల సంరక్షణకు చేపడుతున్న విధానాన్ని ఈ సందర్భంగా వివరించారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రాయునిపేట, రుద్రంకోటలో చేపట్టిన తవ్వకాల్లో ఆది మానవులు ఉపయోగించిన వస్తువులు లభించాయని.. వీటిని ఏలూరు ప్రదర్శనశాలకు, రాజమహేంద్రవరంలోని సర్ అర్థర్‌కాటన్ నివాసానికి తరలిస్తున్నట్లు తెలిపారు.

నాణ్యమైన శిక్షణ అందించాలి

నైపుణ్యాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాద్

ఈనాడు, అమరావతి: విద్యార్థులు, నిరుద్యోగులకు నాణ్యమైన నైపుణ్య శిక్షణను అందించాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాద్ కోరారు. విజయవాడలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) భాగస్వామ్య శిక్షణ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. శిక్షణ సంస్థలు పటిష్ఠమైన మౌలికవసతులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) సీఈవో, ఎండీ కె.సాంబశివరావు మాట్లాడుతూ.. చాలా సంస్థలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రాజెక్టులు తెచ్చుకున్న తర్వాత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నాయని, ఇలా చేయడం వల్ల తరగతుల ప్రారంభంలో జాప్యం జరుగుతోందన్నారు. వచ్చే సంవత్సరం 10లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో 6 లక్షల మంది విద్యార్థులు, నాలుగు లక్షలు నిరుద్యోగ యువతకు శిక్షణ అందించనున్నామని వివరించారు. గిరిజన నిరుద్యోగ యువతకు వచ్చే నెలలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నౌకలో ఎర్రచందనం అక్రమ రవాణా

- రూ.4 కోట్ల విలువుంటుందని వెల్లడి
- స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ

ఈనాడు, విశాఖపట్నం: విశాఖలోని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డి.ఆర్.ఐ.) అధికారులు ఈ నెల 7న విశాఖలోని కంటైనర్ టెర్మినల్లోని నౌకపై దాడులు నిర్వహించి రూ.4 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు. చెన్నై నుంచి చైనా వెళ్తున్న నౌక విశాఖలో కంటైనర్లు లోడ్ చేసుకోవడానికి విశాఖ కంటైనర్ టెర్మినల్‌కు వచ్చింది. దీనిలో సోదాలు నిర్వహించి ఎర్రచందనం అక్రమ రవాణాను గుట్టురట్టు చేశారు. రెండు కంటైనర్లలో ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం చెన్నైలోని డీఆర్ఐ అధికారుల సాయంతో ఆయా కంటైనర్లను చైనాకు పంపుతున్న సంస్థకు సంబంధించిన పలువురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. బెంటొనైట్ పౌడర్‌ను ఎగుమతి చేస్తున్నట్లు చూపి ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్టు వచ్చిన సమాచారంతో ఈ గుట్టు బయటపడిందని డీఆర్ఐ అధికారులు ప్రకటించారు.

గ్రంథాలయ సంస్థల్లో ఖాళీలను భర్తీ చేయాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం డిమాండ్

మంగళగిరి, న్యూస్‌టుడే: గ్రంథాలయ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను సత్వరమే భర్తీ చేయాలని, దిగువశ్రేణిలో అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతులు కల్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలనూ పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశానికి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన దేవదాసు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, పుస్తక పంపిణీ కేంద్ర నిర్వాహకులకు రూ.వెయ్యి నుంచి రూ.4 వేలకు పెంచాలని, పొరుగుసేవల ఉద్యోగులకు పెంచిన వేతనాలన్నీ తమకూ వర్తింపచేసి బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు. సమావేశంలో చేసిన తీర్మానాలను అనంతరం గ్రంథాలయ సంస్థ రాష్ట్ర సంచాలకులు పార్వతికి అందజేసి.. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు సహా 13 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.



ఏపీ గ్రంథాలయ సంస్థ సంచాలకులు పార్వతికి వినతి పత్రం అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

ఏప్రిల్‌లో సహాయ ఆచార్యుల పోస్టుల ప్రాథమిక పరీక్ష..?

ఈనాడు, అమరావతి: కొంతకాలంగా వాయిదాపడుతూ వస్తున్న విశ్వవిద్యాలయాల సహాయ ఆచార్యుల పోస్టుల భర్తీ ప్రాథమిక పరీక్షను వచ్చే నెల 9 నుంచి 14 వరకు నిర్వహించేందుకు ఉన్నత విద్యామండలి సన్నద్ధమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 14వర్సిటీల్లో 1,110పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు అన్ని వర్సిటీలు ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేశాయి. రిజర్వేషన్ల వివాదంతో పాటు.. ప్రస్తుతం పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ప్రాథమిక పరీక్ష నిర్వహణకు అంతరాయం ఏర్పడింది. మొదటిసారిగా పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఏపీపీఎస్సీకి అప్పగించారు.

కేంద్ర పథకాలు కనిపిస్తున్నాయిగా..

- రాష్ట్రాభివృద్ధికి భాజపా కట్టుబడి ఉంది: పురందేశ్వరి

ఈనాడు, అమరావతి: కేంద్ర పథకాల ద్వారానే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, గృహాల నిర్మాణాలు, చంద్రన్న బీమా వంటి కార్యక్రమాలు అమలవుతుండగా.. కేంద్రం నుంచి సహకారం లేదనడం తగదని భాజపా మహిళా మోర్చా జాతీయ నాయకురాలు, మాజీ కేంద్ర మంత్రి పురందేశ్వరి అన్నారు. విజయవాడలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. తెదేపా, భాజపా మధ్య సయోధ్య విషయాన్ని ఇరుపార్టీల అధ్యక్షులు చూసుకుంటారన్నారు. "రాష్ట్రాభివృద్ధికి భాజపా కట్టుబడి ఉంది. ప్రత్యేక హోదాలో పారిశ్రామిక పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు కూడా ఉంటాయని భావిస్తుండడం పొరబాటు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లోనే పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు కొన్ని రాష్ట్రాలకు అదనంగా ఇచ్చారు. హోదాను పొడిగించారని పేర్కొనడం వాస్తవం కాదు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాలు కేంద్రం ఇచ్చింది. ఈ అవకాశాన్ని కియా లాంటి సంస్థలు అందిపుచ్చుకోవాలి. రాష్ట్రంలో జాతీయ విద్యా సంస్థల ఏర్పాటు చర్యలు, ఎయిమ్స్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని' ఆమె పేర్కొన్నారు. గుంటూరు, విజయవాడలో అభివృద్ధి పనుల కోసం రూ.1000 కోట్లు ఇవ్వగా.. ప్రారంభమైన పనులు మధ్యలో ఎందుకు ఆగాయని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రానికి ఏ విషయంలో అన్యాయం జరిగిందో తెదేపా నేతలు చెబితే వాటిని కేంద్రం ద్వారా మంజూరు చేయించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల మూసివేతకు కుట్ర

- యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్ శర్మ

హైదరాబాద్, న్యూస్‌టుడే: దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్ని ఓ పథకం ప్రకారం దివాలా తీయించి మూసి వేయించేందుకు కుట్ర జరుగుతోందని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఏపీ, తెలంగాణ రాష్ట్ర శాఖల కన్వీనర్ వీవీఎస్ఆర్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో రూ. 12,600 కోట్ల అవినీతి వెలుగుచూడటంతో బ్యాంకింగ్ పరిశ్రమలో అనేక రకాల ప్రచారాలు జరుగుతున్నాయన్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని కొందరు పబ్లిక్ రంగ బ్యాంకులపై బురద జల్లే ప్రయత్నం చేస్తూ వాటిని ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నారని శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో విమర్శించారు. బ్యాంకింగ్ వ్యవస్థను, పబ్లిక్ సెక్టార్ ఉనికిని కాపాడుకునేందుకు ఈ నెల 21న దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద అన్ని బ్యాంకు సంఘాల నాయకులు, ఉద్యోగులతో ధర్నా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆ తర్వాత పబ్లిక్ సెక్టార్ బ్యాంకులపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలతో సంతకాల సేకరణ చేసి లోక్‌సభ స్పీకర్‌కు పంపతామని తెలిపారు. వేతన సవరణపై ఈ నెల 18న తలపెట్టిన బ్యాంకుల బంద్ నిర్ణయాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో వివిధ బ్యాంకు సంఘాలకు చెందిన యునైటెడ్ ఫోరం ఫర్ బ్యాంక్ యూనియన్స్ ప్రతినిధులు హర్షవర్ధన్, సుబ్రహ్మణ్యం, వెంకట్రామయ్య, రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

శ్రీవారి సేవకులకూ ఉగాది శుభాకాంక్షల పత్రికలు

ఈ ఏడాది నుంచి కొత్తగా అమలుచేయనున్న తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ట్రస్టులకు విరాళాలిచ్చే దాతలతో పాటు ఈ సారి కొత్తగా శ్రీవారి సేవకుల బృందాల ప్రతినిధులకూ శ్రీవిళంబినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ తితిదే పత్రికలు పంపనుంది. గత ఆరేళ్లుగా దాతలకు పత్రికలు పంపే సంప్రదాయాన్ని తితిదే పాటిస్తోంది. తితిదే ఆధ్వర్యంలో ప్రస్తుతం 9 ట్రస్టులు, 2 పథకాలు కొనసాగుతున్నాయి. వీటిలో అన్నప్రసాదం, ప్రాణదానం, విద్యాదానం, బర్డ్, సర్వశ్రేయ, పురాతన ఆలయాల పరిరక్షణ, శంకర నేత్రాలయ, గో సంరక్షణ, వేద పరిరక్షణ ట్రస్టులు, ఆరోగ్య వరప్రసాదిని, కాటేజీ డొనేషన్ స్కీములు ఉన్నాయి. వీటికి రూ. లక్ష పైచిలుకు విరాళాలు ఇచ్చిన దాతలు 56 వేల మంది ఉన్నారు. వీరితో పాటు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 8 వేల మంది శ్రీవారి సేవకుల బృందాల ప్రతినిధులు ఉన్నారు. తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆదేశాల మేరకు వీరందరికీ శుభాకాంక్షల పత్రికలు పంపనున్నారు.

హైకోర్టు స్థలంపై రాష్ట్రానిదే నిర్ణయం

● కేంద్రం ప్రకటన

ఈనాడు – దిల్లీ

ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఎక్కడ ఏర్పాటుచేయాలన్న నిర్ణయం ఆ రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్రం స్పష్టం చేసింది. శుక్రవారం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి పీపీ చౌదరి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన ధర్మాసనం రాయలసీమలో ఏర్పాటుకు అనువైన ప్రాంతమనే డిమాండ్ ఉన్నట్లు కేంద్రానికి అవగాహన ఉందన్నారు. అయితే.. ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది ఉమ్మడి హైకోర్టుతో సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర మంత్రి తెలిపారు.

ఏపీలో నాలుగు లక్షలు, తెలంగాణలో ఐదు లక్షలు: దేశవ్యాప్తంగా గతేడాది నవంబరు 15వతేదీ నాటికి 1,27,74,475 రేషన్ కార్డులు రద్దు చేశామని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాల శాఖ మంత్రి సీఆర్ చౌదరి రాజ్యసభలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 4,80,472, తెలంగాణలో 5,221,790 కార్డులు రద్దు చేసినట్లు తెలిపారు.

తిరుపతి, నెల్లూరు రైల్వేస్టేషన్ల పునరభివృద్ధి: ఆదర్శణీయ నగరాలు, అమృత్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 600 పెద్ద రైల్వేస్టేషన్లను పునరభివృద్ధి చేయనున్నట్లు రైల్వే శాఖ సహాయమంత్రి రాజెన్ గోహైన్ తెలిపారు. తిరుపతి, నెల్లూరు ఈ పథకంలో ఉన్నాయన్నారు. సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాల్సి ఉందని, స్థానిక సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు రావాల్సి ఉన్నందున ఈ రైల్వేస్టేషన్ల పునరభివృద్ధికి ఎలాంటి కాలపరిమితి లేదని తెలిపారు.

తుని-కొత్తవలస పూర్తి: తూర్పుగోదావరి జిల్లా తుని నుంచి విజయనగరం జిల్లా కొత్తవలసకు సింగిల్‌లైన్ బ్రాడ్‌గేజ్ రైల్వేలైను నిర్మాణానికి సర్వే పూర్తయిందని రైల్వే శాఖ సహాయమంత్రి రాజెన్ గోహైన్ తెలిపారు. ఈ లైను నిర్మాణానికి రూ. 3771.21 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా, రాబడి -4.14 శాతంగా తేలిందని వివరించారు.

ఆధార్ ప్రైవేటు ఏజెన్సీలు దశలవారీగా మూసివేత: దేశవ్యాప్తంగా ప్రైవేటు ఏజెన్సీల ఆధ్వర్యంలో నడుస్తున్న ఆధార్ నమోదు కేంద్రాలను దశలవారీగా మూసివేస్తామని కేంద్రం తెలిపింది. రాజ్యసభలో తెదేపా సభ్యుడు సీఎం రమేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఐటీ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. నియమిత తపాలా కార్యాలయాలు, ప్రతి పది బ్యాంకులకుగానూ ఒకదానిలో ఆధార్ నమోదు, నవీకరణ సదుపాయాన్ని తప్పకుండా అందించాలని ఆధార్ రెగ్యులేషన్- 2016లోని 12ఏ చెబుతోందని వివరించారు.

ఎడ్లబండిని ఢీకొన్న లారీ

కర్ణాటకలో ఏడుగురు దుర్మరణం

బాగల్‌కోట, న్యూస్‌టుడే: పగలంతా పొలం పనులు చేసి ఇంటికొస్తున్న రైతుల్ని లారీ రూపంలో మృత్యువు కబళించింది. కర్ణాటకలోని బాగల్‌కోట జిల్లా హునగుంద తాలూకాకు చెందిన రక్కసగి గ్రామం వద్ద గురువారం- బెళగావి రహదారిలో శుక్రవారం రాత్రి ఎడ్లబండిని ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఏడుగురు దుర్మరణం చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని సమీపంలోని హునగుంద వైద్యాలయానికి తరలించారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందినవారిగా గుర్తించారు. ఎడ్లబండిలో ఎంతమంది ప్రయాణిస్తున్నదీ తెలియలేదు. లారీ ఢీకొనడంతో ఎడ్ల బండి తుత్తునియలైంది. శవాలు రహదారిపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఆ రహదారిపై వాహన సంచారం నిలిచిపోయింది.

జులై 1న ఏపీ సెట్

- 18న నోటిఫికేషన్ విడుదల
- 26 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఏయూ వీసీ నాగేశ్వరరావు తదితరులు

ఎంవీపీకాలనీ (విశాఖపట్నం), న్యూస్‌టుడే: డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, వర్సిటీల్లో అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాలకు అవసరమైన అర్హత పరీక్ష ఏపీసెట్(ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్టు)-2018 జులై 1వ తేదీన జరగనుంది. ఈ పరీక్షను ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించనుంది. ఈ మేరకు వర్సిటీ వీసీ ఆచార్య నాగేశ్వరరావు వెల్లడించారు. శుక్రవారం ఉదయం ఏయూ సెనెట్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న ఏపీసెట్-2018 నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. మొదటి పరీక్ష 100 మార్కులకు టీచింగ్/ రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌పై ఉంటుందని, రెండో పరీక్ష 200 మార్కులకు అభ్యర్థి ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై ఉంటుందన్నారు. నెగెటివ్ మార్కులు లేవని పేర్కొన్నారు. ఏపీసెట్ నోటిఫికేషన్, ఇతర సమాచారం కోసం ఏయూ దూరవిద్య కేంద్రం వద్ద ఏపీసెట్-18 కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇతర సమాచారం కోసం andhrauniversity.edu.in, apset.net.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. apsetau@gmail.com ఈ మెయిల్ ద్వారా, 0891-2730148, 2730147 ఫోన్ నెంబర్లలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

ఏపీ సెట్ స్థూలంగా..

- ★ ఏపీ సెట్-2018 నోటిఫికేషన్ విడుదల: మార్చి 18
- ★ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ : మార్చి 26 నుంచి మే 2వ తేదీ వరకు
- ★ రూ.1000 అపరాధ రుసుముతో : మే 10 వరకు
- ★ రూ.2000 అపరాధ రుసుముతో : మే 21 వరకు
- ★ రూ.5వేలు అపరాధ రుసుముతో : జూన్ 6 వరకు
- ★ ఏపీసెట్-2018 అర్హతపరీక్ష : జులై 1
- ★ పరీక్షా కేంద్రాలు : విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, తిరుపతి
- ★ సిలబస్ : యూజీసీ- సీఎస్ఐఆర్, యూజీసీ-నెట్

అర్చక పిచ్చుకలపై ప్రభుత్వ బ్రహ్మాస్త్రమా?

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఐవైఆర్ లేఖ

ఈనాడు-అమరావతి: అర్చకులపై గ్రాట్యుటీ రద్దు వంటి బ్రహ్మాస్త్రాన్ని ప్రభుత్వం ప్రయోగించడం సరికాదని ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అభిప్రాయపడ్డారు. సర్వీసు ఇనాం భూములు అనుభవిస్తున్న అర్చకులకు గ్రాట్యుటీ సౌకర్యం రద్దు చేసే దిశగా దేవాదాయశాఖ కమిషనర్ ఇచ్చిన మెమోను ఆయన తప్పు పట్టారు. ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాతే కమిషనర్ ఈ ఉత్తర్వులు ఇచ్చి ఉంటారని తాను భావించడం లేదని అభిప్రాయపడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన ఒక లేఖ రాశారు. ఈ మెమోకు సంబంధించి తదుపరి చర్యలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రిని కోరారు. చిన్న ఆలయాలకు చెందిన అర్చకులు, ధార్మిక సంస్థల కోసం సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు అర్చక సంక్షేమ నిధి నుంచి గ్రాట్యుటీ ఇచ్చేలా ఉత్తర్వులు గతంలో ఇచ్చారని, ఇది సంక్షేమ చర్య తప్ప ఇతర ప్రయోజనంగా చూడరాదని ఐవైఆర్ పేర్కొన్నారు. అర్చకుల సర్వీసు నిబంధనలకు సంబంధించిన తుది నోటిఫికేషన్ కూడా విడుదల చేయాలని విన్నవించారు.

19న ఐఆర్‌సీటీసీ భారత్‌దర్శన్ ప్రత్యేక రైలు

విజయవాడ, న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఈ నెల 19న భారత్‌దర్శన్ ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు సంస్థ విజయవాడ ప్రాంతీయ అధికారి మధుసూదనరావు తెలిపారు. శుక్రవారమిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో సంబంధిత ప్యాకేజీ వివరాలను వెల్లడించారు. 19వ తేదీన చిత్తూరు జిల్లా రేణిగుంటలో భారత్‌దర్శన్ రైలు బయలుదేరుతుంది టికెట్లకొనుగోలు తదితర వివరాలకు ఫోన్ నంబర్లు 0866-2572280, 9701360632, 9701360675లలో సంప్రదించవచ్చన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించేందుకు నిర్ణయం

ఈనాడు డిజిటల్, అమరావతి: కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఉపాధి కూలీల వేతన బకాయిలను..స్వయంగా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్రం నుంచి నిధులు రావడంలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో కూలీలకు ఉపశమనం కలిగించేందుకు ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వేతన బకాయిల విషయమై గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం సీఎం చంద్రబాబును కలిసి వివరించారు. క్షేత్రస్థాయిలో కూలీల ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం బకాయిలను రాష్ట్ర నిధుల నుంచే చెల్లించేందుకు ముఖ్యమంత్రి ఆమోదించినట్లు తెలిసింది. ఇప్పటికే ఉన్న 242.89 కోట్ల బకాయిలను చెల్లించాలని ఆదేశించారు. తక్షణమే వేతనాల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ శాఖాధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ. 600 కోట్లను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయం తీసుకుంది.

తెలుగుగంగకు రూ.6,671 కోట్లతో అంచనాల పెంపు

ఈనాడు-అమరావతి: తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ. 6,671.625 కోట్లకు అంచనాలు పెంచుతూ జలవనరులశాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. 1996లో రూ. 1,805 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. 2007లో రూ. 4,431.96 కోట్లకు పెంచారు. ఇప్పుడు రూ. 6,671.625 కోట్లకు సవరిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రతిపాదిత ధరలు, పని పరిమాణానికి సంబంధిత సాంకేతిక అనుమతి మంజూరు అధికారి బాధ్యత వహించాల్సి ఉంటుందని అందులో నిబంధన విధించారు. ప్రస్తుత అంచనాల పెంపునకు మించి ఎలాంటి అనుమతి ఉండబోదని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలకు మించి ఈ ప్రాజెక్టు నిర్మాణం సాగుతోందని, ఇక మీదట ఈ ప్రాజెక్టు కోసం ఎలాంటి అంచనాలు పెంచబోమని కరాఖండీగా చెప్పారు. తదుపరి ఎలాంటి నిధుల మంజూరు కోరకుండానే ఈ ప్రాజెక్టులో పనులన్నీ పూర్తి చేయాలని చీఫ్ ఇంజినీరుకు సూచించారు.

విద్యుత్ ఉద్యోగులకు వైద్యసేవలు, బీమా సౌకర్యాలు

ఈనాడు అమరావతి: విద్యుత్ శాఖలోని పొరుగుసేవల ఉద్యోగుల క్రమబద్ధీకరణ అనేది ప్రభుత్వ స్థాయిలో తీసుకోవాల్సిన విధాన నిర్ణయమని ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు ఉద్యోగుల సంఘాల ప్రతినిధులకు స్పష్టం చేశారు. ఆ సమస్యపై తప్ప ఇతర డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ రెండువారాల పాటు సమ్మెలో ఉన్న ఉద్యోగులు..ఉన్నతాధికారుల చేసిన సూచన మేరకు విరమించారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో ఉన్నతాధికారుల బృందంతో చర్చలకు హాజరయ్యారు. ట్రాన్స్‌కో సంయుక్త నిర్వాహక సంచాలకుడు(జేఎండీ) దినేష్ పరుచూరి, డిస్కంల సీఎండీలతో చర్చల్లో పాల్గొన్నారు. ఈ ఉద్యోగులకు నష్టపరిహారం చెల్లించడం. వైద్య సదుపాయాల కల్పన. గ్రూప్ బీమా సౌకర్యం అందించడం తదితర సమస్యల పరిష్కారానికి అంగీకరించారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణతోపాటు మరికొన్ని సమస్యలు ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నందున..ఆ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని అధికారులు తెలిపారు.

23 కిలోల బంగారం స్వాధీనం

రామేశ్వరం నుంచి రైలులో తెస్తుండగా చెన్నైలో పట్టివేత

చెన్నై, న్యూస్‌టుడే: శ్రీలంక నుంచి సముద్ర మార్గంలో అక్రమంగా తీసుకొస్తున్న 23 కిలోల బంగారాన్ని చెన్నై ఎగ్మూరు రైల్వేస్టేషన్‌లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అధికారుల కథనం ప్రకారం...శ్రీలంక నుంచి పడవ ద్వారా ఓ ముఠా బంగారాన్ని చెన్నైకి తీసుకొస్తున్నట్లు కేంద్ర నిఘా అధికారులకు సమాచారం అందింది. ఈలోగానే ముఠా రామేశ్వరం చేరుకుంది. తర్వాత ఆ ముఠా తీసుకొచ్చిన బంగారాన్ని రామేశ్వరానికి చెందిన నలుగురికి ఇచ్చింది. చెన్నైలోని ఒక వ్యక్తికి అప్పగించి కమీషన్ డబ్బులు తీసుకోమని చెప్పింది. ఆ నలుగురు అందుకు అంగీకరించి.. పోలీసులకు అనుమానం రాకుండా బంగారాన్ని బెల్టు తరహాలో ధరించి ప్రత్యేక దుస్తుల్లో చెన్నైకి రైలులో బయలు దేరారు. ఆ మేరకు సమాచారం అందడంతో గురువారం ఎగ్మూరు రైల్వేస్టేషన్‌లో అధికారులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి 23 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

గౌరిలంకేశ్ హత్య కేసులో కీలక మలుపు

- 'సిట్' కస్టడీకి నిందితుడు నవీన్
- 'లై డిటెక్టర్' పరీక్షలు నిర్వహించేందుకు అంగీకరించాలని అభ్యర్థన

బెంగళూరు, న్యూస్‌టుడే: సంచలనం సృష్టించిన సీనియర్ పాత్రికేయురాలు గౌరీ లంకేశ్ హత్యకు ఆయుధాలను సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నవీన్ కుమార్ అలియాస్ హొట్టె మంజను కేంద్రంగా చేసుకుని కేసు దర్యాప్తు శరవేగంగా సాగుతోంది. నవీన్‌ను ఐదు రోజుల పాటు విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు దళాని(సిట్)కి బెంగళూరులోని మూడో ఏసీఎంఎం న్యాయస్థానం అవకాశం కల్పించడంతో దర్యాప్తు ముమ్మరమైంది. తానే గౌరీ లంకేశ్‌ను హత్య చేశానని నిందితుడు ఇచ్చిన వాంగ్మూలాన్ని రికార్డు చేశాక- ఇప్పుడు మాట మార్చుతున్నాడని సిట్ తరుపు న్యాయవాది లత శుక్రవారం న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. నిందితుడికి 'లై డిటెక్టర్' పరీక్షలను నిర్వహించేందుకు అనుమతించాలని అభ్యర్థించారు. కోర్టు బోనులో ఉన్న నవీన్ స్పందిస్తూ- 'ఆ పరీక్షలు చేసేందుకు నేను అంగీకరించను' అంటూ న్యాయమూర్తి వెంకణ్ణ హొసమనికి విన్నవించాడు. విచారణ కోసం అతడ్ని బెళగావి, కొడైకెనాల్, గోవా తదితర ప్రాంతాలకు తీసుకు వెళ్లేందుకు న్యాయమూర్తి సిట్‌కు అవకాశం కల్పించారు. ఇప్పటికే విచారణ సమయంలో సిట్ అధికారులు తనను శారీరకంగా, మానసికంగా హింసించారని న్యాయమూర్తి ముందు నిందితుడు ఆక్రోశించాడు. అతనికి లై డిటెక్టర్ పరీక్షలను నిర్వహించే అంశమై 15న నిర్ణయాన్ని ప్రకటిస్తానని న్యాయమూర్తి వెల్లడించారు. నవీన్‌ను ఇప్పటికే 20 రోజుల పాటు విచారించారని, బలవంతంగా నిందమోపే ప్రమాదం ఉందని నవీన్ తరపు న్యాయవాది అభ్యంతరం తెలిపారు.

ఈ కేసులో ఇది..తొలి అరెస్టు: గౌరీ లంకేశ్ కేసులో కె.టి.నవీన్‌కుమార్‌ను అరెస్టు చేశామని ప్రత్యేక దర్యాప్తు దళం (సిట్) అధికారి ఎం.ఎన్. అనుచేత్ అధికారికంగా శుక్రవారం ప్రకటించారు. ఈ కేసులో ఇదే మొదటి అరెస్టు అని తెలిపారు. 'ఎటువంటి అనుమతి లేకుండా తుపాకులు దగ్గర ఉంచుకున్న నేరారోపణపై ఫిబ్రవరి 19న బెంగళూరు నగర ఉప్పారపేట ఠాణా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలు ఆధారాలను పరిశీలించాక విచారణ బాధ్యతల్ని సిట్‌కు అప్పగించారు. వారం పాటు నిర్వహించిన విచారణలో అతడే కీలక నిందితుడిగా గుర్తించామని' అనుచేత్ వివరించారు.

ఎస్సీ కులాలపై అధ్యయనానికి కమిషన్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎస్సీ జాబితాలో ఉన్న కులాలపైన అధ్యయనం చేసేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి జేసి శర్మ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీంతో పాటు బేడ, బుడగజంగాల స్థితిగతులపైన కూడా అధ్యయనం చేసే బాధ్యతలను కూడా ఈ కమిషన్‌కు అప్పగించింది. అలాగే ఎస్సీల జాబితాలో లేని కులాలు వారు కూడా కొందరు నకిలీ ఎస్సీ ధ్రువీకరణపత్రాలు పొందడంపైన కూడా అధ్యయనం చేయాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

దినకరన్ వర్గానికి 'కుక్కర్' గుర్తు కేటాయించండి

చెన్నై, న్యూస్‌టుడే: ఆర్కేనగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ వర్గానికి ప్రెషర్ కుక్కర్ గుర్తుతో పాటు పార్టీ పేరు కేటాయించాలని ఎన్నికల కమిషన్‌ను దిల్లీ హైకోర్టు ఆదేశించింది. తమ వర్గానికి గుర్తింపు ఇచ్చేలా పార్టీ పేరు, స్థానిక సంస్థలు సహా అన్ని ఎన్నికల్లోనూ ప్రెషర్ కుక్కర్ గుర్తు కేటాయించాలని కోరుతూ దిల్లీ హైకోర్టులో దినకరన్ వర్గం గతంలో మధ్యంతర పిటిషన్ దాఖలు చేసింది.

'ఈఎన్‌ఏ'ను వ్యాట్ పరిధిలోనే ఉంచాలి

ఈనాడు, అమరావతి: మద్యం తయారీలో కీలక ముడిసరకుగా ఉన్న అదనపు తటస్థ మద్యం (ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్- ఈఎన్‌ఏ)ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావొద్దని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరుతోంది. చక్కెర కర్మాగారాలు, గింజల ద్వారా ఈఎన్‌ఏ తయారవుతోంది. మద్యంలోనే కాకుండా ఔషధ పరిశ్రమలోనూ దీనిని ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం దీనిపై ఐదుశాతం వ్యాట్ విధిస్తున్నారు. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్‌లో దీని వినియోగం ఎక్కువగా ఉంది. వినియోగంలో దేశవ్యాప్తంగా ఆరో స్థానంలోపే ఆంధ్రప్రదేశ్ ఉంది. వ్యాట్ పరిధిలో ఉన్న ఈఎన్‌ఏను జీఎస్టీలోకి తీసుకువచ్చే ప్రయత్నాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం చెబుతోంది. దీన్ని జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే 18శాతం వరకు పన్ను విధించే అవకాశం ఉంది. స్వల్పంగా మద్యం ధరలు పెరుగుతాయి. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేదు. ధరల పెరుగుదల వల్ల రాష్ట్ర ఖజానాకు ఇబ్బంది లేకున్నా, వ్యతిరేకత వస్తుందన్న భావనలో ప్రభుత్వం ఉంది. మరోవైపు మద్యం ఉత్పత్తిపై క్రమేణా రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ తగ్గేందుకు ఇది దోహదపడుతుందని సంబంధిత వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దిల్లీలో శనివారం జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పవన్ అభిమానులమంటూ మోసం

- యువతి నుంచి 3.5 కిలోల బంగారు ఆభరణాలు తీసుకున్న యువకులు
- ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రవిప్రకాష్, వెనుక నిందితులు


ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జనసేన పార్టీ నాయకులమని.. పవన్‌కల్యాణ్ అభిమానులమని చెప్పుకొంటూ యువతి నుంచి సుమారు మూడున్నర కిలోల బంగారు ఆభరణాలను తీసుకొని మోసగించిన ఏడుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో ఈ ఘటన జరిగింది. శుక్రవారం ఎస్పీ రవిప్రకాష్ వివరాలను వెల్లడించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ఓ బంగారు వ్యాపారి కుమార్తెతో కొందరు యువకులు ఫేస్‌బుక్‌లో పరిచయం పెంచుకొని తాము జనసేన పార్టీలో పనిచేస్తున్నామని. . పవన్‌కల్యాణ్‌కు పరిచయం చేస్తామని నమ్మబలికారు. డబ్బులు అవసరమని బంగారు నగలు ఇస్తే.. తరువాత తిరిగి ఇచ్చేస్తామన్నారు. కొన్ని నగలు తీసుకున్నాక ఆమెను బెదిరించి మరికొన్ని ఆభరణాలను తీసుకున్నారు. బంగారాన్ని తాకట్టు పెట్టి జల్సాలు చేసేవారు. చివరకు మోసపోయానని గ్రహించిన యువతి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఏలూరుకు చెందిన దత్తి బాలాజీ, సింహాద్రి బాలచందర్ అలియాస్ బాలు, పిల్లా సాయిదేవేంద్ర నాయుడు, విప్పర్తి ఫ్రాన్సిస్, కొండి రాజేష్, గుజ్జుల రాజీవ్, తుమ్మలపల్లి అశోక్‌కుమార్‌లను శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి 3,424 గ్రాముల బంగారు నగలు, కారు, రెండు మోటారు సైకిళ్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 1.23 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు.

షీలా బిడే కమిటీ గడువు మూడు నెలలు పెంపు

ఈనాడు అమరావతి: రాష్ట్ర విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్ల ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి చేసేందుకు ఏర్పాటు చేసిన షీలా బిడే కమిటీ కాలపరిమితిని మరో మూడు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత కమిటీ నిర్వహించే సమావేశాలకు హాజరవ్వాలని, పూర్తి సహకారం అందించాలని తొమ్మిదో షెడ్యూల్‌లోని, ఇంకా విభజన పూర్తవని సంస్థల ఎండీలు, సీఈవోలు, సంస్థల అధిపతులకు ఈ మేరకు విజ్ఞప్తి చేసింది.

పరిశోధనలు అందరికీ అందుబాటులోకి రావాలి

కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభు



సురేశ్‌ప్రభును సత్కరిస్తున్న పల్సస్ సంస్థ సీఈవో శ్రీనుబాబు

ఈనాడు, దిల్లీ: శాస్త్ర పరిశోధనలు అందరికీ అందుబాటులోకి రావాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేశ్‌ప్రభు ఆకాంక్షించారు. హైదరాబాద్‌కు చెందిన సైంటిఫిక్ జర్నల్స్, ఫార్మాకోవిజిలెన్స్ సంస్థ పల్సస్ చెన్నై శాఖను శుక్రవారం ఇక్కడినుంచి కేంద్ర మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో తమిళనాడుకు ఘన చరిత్ర ఉందని, పల్సస్ సంస్థ ద్వారా రాష్ట్రంలోని యువతకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ.. స్థానిక భాషల్లో శాస్త్ర, ఆరోగ్య రంగాలకు చెందిన రచనలకు డిమాండ్ ఉందని, వీటిని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్, గురుగ్రామ్‌లలో ఇప్పటికే వేలాది మందికి ఉపాధి కల్పించామని తెలిపారు.

గ్రామీణ 'పది' పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు

● పట్టణాల ఊసెత్తక పోవడంపై విమర్శలు

ఈనాడు, అమరావతి: పదో తరగతి పరీక్షల సందర్భంగా గ్రామాల్లోని కేటగిరి-సి కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. అద్దె ప్రాతిపదిక తీసుకున్న వాటిని గ్రామాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. చూచిరాతలపై ఇటీవల న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. కానీ పట్టణ ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాల ఏర్పాటుపై దృష్టి సారించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తున్నాయి. పట్టణాల్లోని దాదాపు అన్ని ప్రైవేటు పాఠశాలల్లోనూ సీసీకెమెరాలున్నాయి. వీటిని వినియోగించుకోవాల్సిన అధికారులు.. సాంకేతిక సమస్య చూపుతూ వాటిని మూసేయాలని ఆదేశిస్తున్నారు. గ్రామాల్లోని పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేవారు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలలకు చెందినవారే ఉంటారని, ప్రైవేటు పాఠశాలలు అధికంగా ఉండే పట్టణాలను వదిలేయడమేంటని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు భార్గవ్ మాట్లాడుతూ.. కేటగిరి-సి పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, పట్టణాల్లోనూ సమస్యాత్మక కేంద్రాల్లో బిగిస్తారని వెల్లడించారు.

ఆగని ఆందోళనలు.. సాగని సభలు

- అయిదోరోజూ స్తంభించిన కార్యకలాపాలు
- విశ్రమించని తెదేపా
- ఏపీని బిహార్‌తో కాకుండా తెలంగాణతో పోల్చి చూడాలని హితవు
- ఆందోళనల్లో పాల్గొన్న అశోక్‌గజపతిరాజు

బీజేపీ అంటే... బ్రేకింగ్ జనతా ప్రామిసెస్
– తెదేపా విమర్శ

ఈనాడు – దిల్లీ

వరుసగా అయిదోరోజూ పార్లమెంటు సమావేశాలు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వాయిదాపడ్డాయి. లోక్‌సభలో తెదేపా, తెరాస, వైకాపా, ఏఐఏడీఎంకె...... రాజ్యసభలో తెదేపా, కాంగ్రెస్, ఏఐఏడీఎంకె సభ్యులు ఆందోళనలు కొనసాగించడంతో సభాపతులు సమావేశాలను ఈనెల 12వ తేదీకి వాయిదా వేశారు. పార్లమెంటు ప్రారంభానికి ముందు తెలుగుదేశం ఎంపీలంతా గాంధీ విగ్రహం ముందు, వైకాపా సభ్యులు ప్రధాన ద్వారం వద్ద నిరసనలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ డిమాండ్లు ముద్రించిన టీ షర్టులు ధరించి, ప్లకార్డులు పట్టుకొని తెదేపా సభ్యులు నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి... ప్రత్యేకహోదా ఇవ్వాలి... రాష్ట్రానికి న్యాయం చేయండి... ఇచ్చిన మాట నిలబెట్టుకోండి అంటూ ఆందోళన కొనసాగించారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, తెదేపా లోక్‌సభ పక్షనేత తోటనరసింహం నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను అర్థంచేసుకొని ప్రత్యేకహోదా ప్రకటించాలని తోట నరసింహం పేర్కొన్నారు. రాజీనామాల ద్వారా ప్రభుత్వానికి ఒక సంకేతం ఇచ్చాం... కేంద్రమంత్రులు పదవుల నుంచి వైదొలగే పరిస్థితి వచ్చిందంటే ప్రజల ఆవేదన ఏ స్థాయిలో అర్థం చేసుకోవాలన్నారు.

ఏలూరు ఎంపీ మాగంటి బాబు మాట్లాడుతూ పార్లమెంటు సమావేశాలు కొనసాగినంతకాలం తమ ఆందోళనను కొనసాగిస్తామనీ... ఎట్టిపరిస్థితుల్లోనూ వెనక్కు తగ్గబోమనీ స్పష్టం చేశారు. ఇప్పుడు తమను చూసి నితీష్‌కుమార్‌లాంటి వారు హోదా కావాలంటున్నారన్నారు. తమకు మరొకరితో సంబంధంలేదని, ఇచ్చిన మాట ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు సాయం చేయాలన్నదే ప్రధాన డిమాండ్ అనీ చెప్పారు.

రాజీనామాల ద్వారా ప్రజల ఆవేదనను ప్రధాన మంత్రికి చెప్పామని ఎంపీ రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని ప్రధానికి ఎన్నో సార్లు చెప్పిన మీదటే రాజీనామాలు చేసి బయటికొచ్చామన్నారు.

బీజేపీ అంటే 'బ్రేకింగ్ జనతా ప్రామిసెస్' అని అర్థమని అమలాపురం ఎంపీ పి.రవీంద్రబాబు ధ్వజమెత్తారు. దేశంలో రామరాజ్యం తెస్తామంటూ అధికారంలోకి వచ్చారని... రాముడు ఎప్పుడూ అబద్ధం చెప్పరని, కానీ మోదీ అన్నీ అబద్ధాలు చెబుతున్నారన్నారు. మోదీ తిరుపతిలో ఇచ్చిన హామీలను గాలికొదిలేశారన్నారు. తాము పార్టీ తరపునో.... వ్యక్తిగతంగానో ఇక్కడ మాట్లాడటం లేదని, అయిదుకోట్ల ఆంధ్రుల పక్షాన మాట్లాడుతున్నామన్నారు. ప్రజలు గొంతు విప్పి అడుగుతున్న విషయాన్నే అమలుచేయాలని ముఖ్యమంత్రి కూడా కోరుతున్నారన్నారు.





శుక్రవారం పార్లమెంట్ వద్ద తెదేపా, వైకాపా ఎంపీల నిరసన

మచిలీపట్నం ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ మిత్రపక్షంగా కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న వారు ఎందుకు వైదొలిగారో అర్థంచేసుకోవాలన్నారు. విభజన బిల్లులో పెట్టిన అన్ని అంశాలనూ అమలు చేయాలని కోరారు. ముమ్ముందు తమ పోరాటాన్ని మరింత తీవ్రం చేసి ప్రజల డిమాండ్లను సాధించుకుంటామని చెప్పారు.

ఇక కేంద్రంతో చర్చలు జరిపే స్థితి దాటిపోయిందని, డిమాండ్ల సాధన కోసం దశల వారీగా పోరాటాన్ని ఉద్ధృతం చేయడమే మిగిలిందనీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అన్నారు. పరిస్థితి మూడో దశకు వచ్చేప్పటికి ఎన్డీయేక్కూడా రాంరాం చెబుతామన్నారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ....ఏపీని బిహార్‌తో పోల్చి చూడటం వల్లే చంద్రబాబు అవమానానికి గురైనట్లు పేర్కొన్నారు. నవ్యాంధ్రను బిహార్‌తో కాకుండా తెలంగాణతో పోల్చి చూస్తే ఏం తక్కువైందో తెలుస్తుందన్నారు.

కోయదొర వేషంలో శివప్రసాద్ జోస్యం

రోజుకో వేషంతో నిరసనలో పాల్గొంటున్న చిత్తూరు ఎంపీ శివప్రసాద్ శుక్రవారం కోయదొర వేషంలో వచ్చారు. ఆంధ్రులతో పెట్టుకుంటే పోతారని ఇదివరకు ఇందిరకు, సోనియాగాంధీకి అదే చెప్పానని, వాళ్లిద్దరూ వినలేదని, చివరకు తాను చెప్పినట్లే జరిగిందన్నారు. ఇప్పుడు మోదీకీ అదే విన్నవిస్తున్నానన్నారు. చంద్రబాబుతో వైరం మోదీకి మంచిదికాదని, తన జోస్యం వింటే అందరికీ బాగుంటుందన్నారు. ఆ సమయంలో అటుగా వచ్చిన జైరాం రమేష్ చేయి చూసి... విభజన బిల్లంతా ఈయనే రాశారని, కాంగ్రెస్ పోయినట్లుగానే ఈయనా పోతారంటూ చురకలంటించారు. ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాలి తప్పితే వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయవద్దంటూ తాను కోయదొర వేషంలో ప్రధానికి చెప్పదలుచుకున్నట్లు పేర్కొన్నారు.

వెంకటేశ్వరుడి ప్రతిమలు అందరికీ ఇస్తా

గత నాలుగురోజులుగా భగవద్గీత, ఖురాన్, బైబిల్, వెంకటేశ్వరుడి ప్రతిమ పట్టుకొని ఆందోళనల్లో పాల్గొంటున్న ఏలూరు ఎంపీ మాగంటి బాబు లోక్‌సభ లోపల ప్రధాన ఆకర్షణగా మారారు. ఆయన చేతుల్లో ఉన్న వెంకటేశ్వరుడి ప్రతిమను చూసి ప్రతి ఒక్కరూ దగ్గరికొచ్చి కళ్లకు అద్దుకొని వెళ్లడం మొదలుపెట్టారు. శుక్రవారం కేంద్రమంత్రి జేపీనడ్డా, అనుప్రియ పటేల్, అశ్వనీ కుమార్ చౌబేలు వెంకటేశ్వరుని ప్రతిమకు దండం పెట్టుకున్నారు. కొందరు ఎంపీలు తమకూ అలాంటి ప్రతిమ ఇవ్వాలని కోరడంతో సోమవారం అందరికీ ఇస్తానని మాగంటి బాబు హామీ ఇచ్చారు. 'తిరుపతిలో మోదీ ఇచ్చిన హామీలను గుర్తుచేయడానికే తాను రోజూ వెంకటేశ్వరుని ప్రతిమను తీసుకొస్తున్నాననీ, దాన్ని మీకందరికీ ఇస్తే ఆంధ్రప్రదేశ్ డిమాండ్ల గురించి మీకూ గుర్తుంటుందనీ' ఆయన వారితో చెప్పారు.

రాజీనామాలు దురదృష్టకరం: పొన్‌రాధాకృష్ణన్

కేంద్రమంత్రి పదవులకు రాజీనామాలు చేసిన అశోక్‌గజపతిరాజు, సుజనా చౌదరిలతో కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పొన్‌రాధాకృష్ణన్ మాట్లాడారు. వారు రాజీనామాలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

నిన్నటివరకూ కేబినెట్ మంత్రిగా.. ఇప్పుడు వెల్‌లో

అశోక్‌గజపతి రాజు శుక్రవారం పార్లమెంటు వెలుపల, లోపల తెదేపా ఎంపీలు చేసిన ఆందోళనల్లో పాల్గొన్నారు. గాంధీ విగ్రహం ముందు అందరితో కలిసి.. పార్టీ కండువా వేసుకుని, ప్లకార్డు పట్టుకొని నిరసన కొనసాగించారు. ఉదయం 11గంటలకు సభ ప్రారంభమైన తర్వాత అందరు సభ్యులతోపాటే వెల్‌లోకి వచ్చి నిల్చొన్నారు. నిన్నటివరకూ కేబినెట్‌మంత్రిగా ఉన్న ఆయన వెల్‌లోకి వచ్చి నిలబడటాన్ని కేంద్రమంత్రులు కొంత ఆశ్చర్యకరంగా చూశారు.

'అవిశ్వాసంతో ప్రయోజనమేంటి?'

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైకాపా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలనుకోవడం తెలివైన చర్య కాదని అశోక్‌గజపతి వ్యాఖ్యానించారు. "లోక్‌సభలో పూర్తిఆధిక్యం ఉన్న మోదీ ప్రభుత్వానికి దానివల్ల ఏమీకాదు. వివిధ పక్షాల మద్దతుతో తీర్మానం ప్రవేశపెట్టినా చర్చలో ఎక్కువసేపు మాట్లాడే అవకాశం భాజపా, కాంగ్రెస్‌లకే లభిస్తుంది. దీంతో ఆ రెండు పార్టీలు రాజకీయ లబ్ధికి పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ చర్చను వేరే దారిలోకి తీసుకెళ్తాయి. ఆ తర్వాత తృణమూల్, ఏఐఏడీఎంకె, శివసేన వంటి పార్టీలకు అవకాశం వస్తుంది.. అవి తమ రాష్ట్రాల గురించి తప్ప, ఏపీ అంశాన్ని ప్రస్తావించవు. సంఖ్యాపరంగా తక్కువగా ఉన్న తెలుగుదేశం, వైకాపాలకు మాట్లాడే అవకాశం పెద్దగా రాదు.. దీంతో ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనమేమీ ఉండదు. అందువల్ల అవిశ్వాసానికి బదులు వేరేరూపంలో చర్చ వచ్చేలా చేసుకోవడం మేలు.." అని పేర్కొన్నారు.



జనసేనలోకి మాదాసు గంగాధరం

పార్టీలోకి తొలి రాజకీయ చేరిక

ఈనాడు, అమరావతి: జనసేనలోకి తొలి సారిగా ఒక పార్టీ నాయకుడు చేరారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆహ్వానంతో ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పవన్‌కల్యాణ్.. మాదాసుకు పుష్పగుచ్ఛం అందించి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 14న గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ సమీపంలో నిర్వహిస్తున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ మహాసభ పర్యవేక్షణ బాధ్యతలను మాదాసుకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. "మాదాసు గంగాధరం మా కుటుంబ మిత్రుడు. 30 ఏళ్ల ముందు నుంచే వారితో పరిచయం ఉంది. ఎమ్మెల్సీగా, ఏపీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేసిన అనుభవం ఆయనకుంది. అందుకే జనసేనలోకి ఆహ్వానించాను. ఆయన అనుభవం, సలహాలు, సూచనలు పార్టీకి అవసరం'' అని పవన్‌కల్యాణ్ చెప్పారు. మాదాసు మాట్లాడుతూ ఏడాదిన్నరగా రాజకీయాలకు దూరంగా ఉన్నానని, పవన్‌కల్యాణ్ నిబద్ధత తనకు తెలుసని, ఆయన ఆహ్వానం మేరకే జనసేనలో చేరానని చెప్పారు.

విజయవాడలో పార్టీ సమన్వయ కార్యాలయం: విజయవాడలో జనసేన పార్టీ సమన్వయ కార్యాలయం ఏర్పాటు చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో ఈ కార్యాలయం ఏర్పాటైంది.

ఆవిర్భావ సభకు వీడియో ఆహ్వానం

ఈ నెల 14వ తేదీన జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ మహాసభ కోసం ఆ పార్టీ వీడియో ఆహ్వానాన్ని రూపొందించింది. "మిత్రమా అసలే చీకటి..ఇల్లేమో దూరం. దారంతా గోతులు, చేతిలో దీపం లేదు. కానీ గుండెల నిండా ధైర్యం ఉంది'' అంటూ పవన్‌కల్యాణ్ నేపథ్య వ్యాఖ్యలు ఈ వీడియోలో పొందుపరిచారు. గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో ఈ ఆవిర్భావ మహాసభను నిర్వహించనున్నట్లు అందులో పేర్కొన్నారు. 14వ తేదీ సాయంత్రం 3 గంటలకు సభ ప్రారంభం కానుంది.

రాజీనామాలకు రాష్ట్రపతి ఆమోదం

ప్రధానివద్దే పౌర విమానయాన శాఖ

ఈనాడు, దిల్లీ: కేంద్రమంత్రి పదవులకు తెదేపా నేతలు పి.అశోక్‌గజపతి రాజు, సుజనాచౌదరిలు చేసిన రాజీనామాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(2) ప్రకారం ప్రధాని సూచన మేరకు రాష్ట్రపతి వీరిద్దరి రాజీనామాలకు ఆమోదముద్ర వేసినట్లు రాష్ట్రపతి కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. అశోక్‌గజపతి రాజీనామాతో ఖాళీ అయిన పౌరవిమానయాన శాఖ బాధ్యతలను ప్రధానమంత్రే చూసుకోవాలని రాష్ట్రపతి నిర్దేశించినట్లు పేర్కొంది. కాగా ఈ విషయం తెలిసిన వెంటనే అశోక్‌గజపతి, సుజనాచౌదరిలు పరస్పరం అభినందించుకున్నారు. తమకు మరింత స్వేచ్ఛ లభించిందన్నారు.

అయినా సాయం ఆగదు

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు

ఈనాడు, అమరావతి: కేంద్రం నుంచి తెదేపా మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి భాజపా మంత్రులు వైదొలగినప్పటికీ రాష్ట్రానికి కేంద్ర సహకారం కొనసాగుతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు తెలిపారు. కేంద్ర సహకారంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో జాతీయ విద్యా సంస్థల ఏర్పాటు, నిధుల విడుదల, నిర్మాణాల పురోగతిని స్వయంగా సమీక్షించి ప్రజలకు వివరించేందుకు పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మంగళగిరిలో అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్ర సంస్థ (ఎయిమ్స్) నిర్మాణ పనులను పార్టీ ప్రతినిధుల బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ "ఇక్కడ విద్యుత్తు తీగలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికిపైగా సమయం పట్టింది. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి సమయం పట్టొచ్చు. కానీ కేంద్రం ఏమీ చేయడంలేదని చెప్పడం సరికాదు. కేంద్రం ఆధ్వర్యంలో జరిగే కత్తిపూడి-కాకినాడ, విజయవాడ-మచిలీపట్నం రహదారుల విస్తరణ; విజయవాడ బెంజిసర్కిల్, కనకదుర్గ గుడి వద్ద జరుగుతోన్న ఫ్లైఓవర్ల నిర్మాణ పనులు అందరికీ కనిపిస్తున్నాయి. కేంద్ర హామీల్లో 85% వరకు పూర్తయ్యాయి. మిగిలిన పనులు ఏడాదిన్నరలో పూర్తవుతాయి'' అని వివరించారు. భాజపా కోర్ కమిటీ సమావేశం ఆదివారం విజయవాడలో జరగబోతుంది. ఇందులో కేంద్ర ప్రతినిధి సతీష్‌తో పాటు రాష్ట్ర భాజపా నేతలు పాల్గొనబోతున్నారు. తాజా రాజకీయ పరిణామాలను ఈ సమావేశంలో చర్చించబోతున్నామని రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు చెప్పారు.

ఊపందుకున్న 'రాజ్యసభ' యత్నాలు!

- సీఎంని కలుస్తున్న నేతలు
- గట్టి ప్రయత్నాల్లో పది మంది

ఈనాడు, అమరావతి: తెదేపా తరపున రాజ్యసభకు ఎంపికయ్యేందుకు సీనియర్ నేతల యత్నాలు ఊపందుకున్నాయి. సోమవారం నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావటంతో పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుని మరోసారి కలిసి విజ్ఞప్తి చేసుకునేందుకు ఆశావహులు ప్రయత్నిస్తున్నారు. వీరు స్వయంగా కలవటమే కాకుండా చంద్రబాబుకి చొరవగా చెప్పగల నాయకుల తోడ్పాటు తీసుకుంటున్నారు. కనీసం పది మంది గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. తెదేపాకి దక్కేవి రెండు స్థానాలే కావటంతో ఒకటి రాయలసీమకి, మరొకటి కోస్తా జిల్లాలకు ఇచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మూడో అభ్యర్థిని బరిలో దించకపోవచ్చు. పదవులు ఏవైనా... వాటి ఎంపికలో సామాజిక సమతూకం పాటించేందుకు ప్రయత్నించే ముఖ్యమంత్రి ఈవిడత కూడా బీసీ, ఎస్సీ వర్గాలకు కనీసం ఒకటైనా ఇస్తారన్న అభిప్రాయముంది. ఆ వర్గాలకు చెందిన నాయకులు నాలుగైదు రోజులుగా ఆయన్ను కలిసి విజ్ఞప్తి చేసుకుంటున్నారు. రాజ్యసభ పదవీ కాలం పూర్తవుతున్న సీఎం రమేష్ ఇప్పటికే ఒకసారి ముఖ్యమంత్రిని కలిసి తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. తాజాగా తనకు సన్నిహితులైన మంత్రులు, ఇతర సీనియర్ నేతల్ని సమీకరించి చంద్రబాబు వద్దకు తీసుకెళుతున్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు, దిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా గతంలో వ్యవహరించిన కంభంపాటి రామ్మోహన్‌రావు కొద్దిరోజుల కిందటే సీఎంని కలిసి తన పేరును పరిశీలించాలని కోరారు. నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావుకు మద్దతుగా ఆ జిల్లాకు చెందిన మంత్రి సహా పలువురు నాయకులు, ఎమ్మెల్యేలు చంద్రబాబుని కలిశారు. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు, గృహనిర్మాణ సంస్థ అధ్యక్షుడు వర్ల రామయ్య, శాసనమండలి మాజీ సభ్యురాలు మసాల పద్మజ సహా మరికొందరు ఆశావహుల జాబితాలో ఉన్నారు.

పరస్పర అపనమ్మకం...

- తెదేపా-భాజపా సంబంధాలపై చూపిన ప్రభావం

ఈనాడు, అమరావతి: ఉభయ పక్షాల మధ్య పరస్పరం నెలకొన్న అపనమ్మకం కూడా కేంద్ర మంత్రివర్గం నుంచి తెదేపా, రాష్ట్ర మంత్రివర్గం నుంచి భాజపా వైదొలగటానికున్న ప్రధాన కారణాల్లో ఒకటిగా కనిపిస్తోంది. విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, బిల్లు ఆమోదించే సమయంలో రాజ్యసభలో ఇచ్చిన హామీల అమలే తాజా పరిణామాలకు కీలకమైనప్పటికీ... అంతర్గతంగా రెండు పార్టీల మధ్య నమ్మకం లేకపోవటం కూడా ఒక ప్రధాన సమస్యేనని విశ్లేషకులు అంటున్నారు. వీటిని తొలగించుకోటానికి ఏపక్షం నుంచి సరైన ప్రయత్నం జరగలేదన్న భావన ఉంది. పొత్తు కుదిరినప్పుడే భాజపాకి కేటాయించిన కొన్ని స్థానాల్లో తెదేపా రెబల్ అభ్యర్థులు బరిలో నిలవటం కొన్ని చోట్ల సమస్యలకు దారితీసింది. తరువాత కేంద్ర మంత్రివర్గంలో కీలక శాఖ దక్కకపోవటం తెదేపాకి అంతగా రుచించలేదు. ఏ కీలక విధాన నిర్ణయంలోనూ అధికార ఎన్‌డీఏలో భాగస్వామ్య పక్షమైన తమను విశ్వాసంలోకి తీసుకోలేదన్న భావన తెదేపా వర్గాల్లో ఉంది. 'ప్రత్యేక సాయానికి అంగీకరించినా... ఏడాదిన్నర తరువాత కూడా ఏమాత్రం ప్రయోజనం లేకపోయింది. ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టుల (ఈఏపీ) పనులకోసం ఏ ప్రతిపాదన పంపినా కొర్రీలు పడేవి. కష్టంమీద అంగీకరించినా, ఆ నిధులు రాష్ట్రానికొచ్చి పనులకు వెచ్చించే పరిస్థితి వచ్చేందుకు మరో మూడు, నాలుగేళ్లు పట్టేలా ఉంది. దీనికి బదులుగా హడ్కో, నాబార్డు వంటి సంస్థల నుంచి నిధులు కోరినా స్పందన లేకపోయింది' అని తెదేపా సీనియర్ నేత ఒకరు పేర్కొన్నారు. ప్రధానితో అపాయింట్‌మెంట్ కోసం నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి తమకుంటే... వైకాపా ఎంపీ సులువుగా ఆయన్ను కలుస్తున్నారన్న భావన తెదేపా వర్గాల్లో బలంగా ఉంది. తమని ఇబ్బంది పెట్టేందుకు వైకాపాని ఉపయోగించుకుంటుందేమోనన్న సందేహం ఉందని, దీనిని నివృత్తి చేసుకునే అవకాశమూ లేకపోయిందని తెదేపా నేతలు అంటున్నారు. ప్రత్యేక హోదా సున్నిత రాజకీయాంశంగా మారిన నేపథ్యంలో... అరుణ్ జైట్లీ ప్రకటన చేశాక కూడా వేచి చూస్తే ప్రజల్లోకి ఇబ్బందికర సంకేతాలు వెళతాయని, అది రాజకీయంగా ఆత్మహత్యాసదృశ్యమని, అందుకే మంత్రివర్గం నుంచి బయటికి రావాల్సి వచ్చిందని విశ్లేషిస్తున్నారు. భాజపా నేతలు సైతం గత కొంత కాలంగా తెదేపా వైఖరిని సందేహాస్పదంగానే చూస్తున్నారన్న ప్రచారముంది. ప్రత్యేక హోదా భావోద్వేగానికి సంబంధించిన అంశమైనప్పటికీ.. ఇతర రూపాల్లో సాయం చేసేందుకు ద్వారాలు మూసుకోలేదని, కేవలం రాజకీయ కారణాలతోనే తెదేపా మంత్రివర్గం నుంచి బయటికి వచ్చిందని ఈ పార్టీ నాయకులు భావిస్తున్నారు. పార్లమెంటు తొలిదశ బడ్జెట్ సమావేశాల చివరి రోజు.. రెండు పార్టీల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు భాజపా అధ్యక్షుడు అమిత్‌షా సమక్షంలో జరిగిన సమావేశం సానుకూలంగా సాగింది. ఆపై దాన్ని ముందుకు తీసుకెళ్లే దశలో పార్టీ అగ్రనేతలు తెదేపా వైఖరిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారన్న ప్రచారముంది. ఇలా రెండు పక్షాలూ పరస్పరం అపనమ్మకంతోనే చివరిదాకా వ్యవహరించినట్లు కనిపిస్తోంది.



'జీఎస్‌టీ కింద మరికొంత పరిహారం రావాలి'

ఈనాడు, దిల్లీ: జీఎస్‌టీ అమలు కారణంగా ఎదురయ్యే ఆదాయ నష్టాన్ని భర్తీ చేసేందుకు కేంద్రం ఇచ్చే పరిహారంలో ఆంధ్రప్రదేశ్‌కు మరింత వాటా రావాల్సి ఉందని ఏపీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి లేఖ రాశారు. 2015-16 ఆధారిత సంవత్సరం(బేస్ ఇయర్)లో ఆంధ్రప్రదేశ్ ఆదాయాన్ని రూ.13,876.38 కోట్లుగా కాకుండా కేవలం రూ.13,449.62 కోట్లుగా పరిగణనలోకి తీసుకోవడం వల్ల తాము నష్టపోతున్నామని పేర్కొన్నారు. తమకు సగటున ప్రతి నెలా రూ.1,502.81 కోట్ల ఆదాయానికి రక్షణ ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు.

ఆర్యవైశ్యులు ఉన్నత స్థాయికి ఎదగాలి: చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన నిధులతో మరింత అభివృద్ధిని సాధించాలని సీఎం చంద్రబాబు ఆర్యవైశ్యులకు సూచించారు. చిన్న చిన్న వ్యాపారాలతో సరిపెట్టుకోకుండా తదుపరి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పేద ఆర్యవైశ్య కుటుంబాలు ఎదిగేలా ఉన్నత వర్గాలు ప్రోత్సహించాలన్నారు. బడ్జెట్‌లో ఆర్యవైశ్యుల సంక్షేమానికి రూ.30 కోట్లు కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి సహకరించకపోవడం దురదృష్టకరమన్నారు. ఆర్థికలోటు, విభజన హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజా సంక్షేమానికి అధిక నిధులు కేటాయించడం సాధ్యం కావడంలేదన్నారు.


కేంద్రమా.. ఇది న్యాయమా?

- విభజన హామీలపై నిలదీస్తూ తెలుగుదేశం పార్టీ పుస్తకం
- ఇప్పటికే 50 పేజీలతో సిద్ధం, మరిన్ని సవరణలతో నవీకరణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని హామీలు, విభజన సందర్భంగా పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయో సవివరంగా వివరిస్తూ ఒకరకంగా కేంద్రాన్ని నిగ్గదీస్తూ తెలుగుదేశం పార్టీ ఒక పుస్తకం తెస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఏం న్యాయం చేసింది? అన్న ముఖపత్ర శీర్షికతో దాదాపు 50 పేజీలున్న ఈ పుస్తకంలో 19 అంశాలపై దృష్టి పెట్టి విశదీకరించింది. పార్టీ వాదనను తెలియజేసింది. ఈ పుస్తకాన్ని తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో ప్రచురించి జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి తెలుగుదేశం కార్యకర్తకు చేర్చి, ప్రజలకు దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించనుంది. ఈ 50 పేజీల పుస్తకానికి మరింత సమగ్రత తీసుకువచ్చి విస్తృత స్థాయిలో ప్రచారంలో పెట్టబోతున్నట్లు వివరించారు.

ఆ పుస్తకంలో విశ్లేషించిన ముఖ్యాంశాలు..

- విభజన సమయంలో వేర్వేరు విభాగాలకు వేర్వేరు ప్రాతిపదికలను ప్రమాణాలుగా తీసుకోవడంతో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగింది. 58 శాతం జనాభా ఉన్న ఏపీకి 46శాతం రెవెన్యూ అన్నారు. భౌగోళిక ప్రాతిపదికన ఆస్తులు అని చెప్పారు. ఇలా చూస్తే విలువైన ఆస్తులన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన అప్పులు పంపిణీ అని పేర్కొన్నారు. వినియోగం ప్రాతిపదికన విద్యుత్తు అన్నారు. ఇలా అన్ని రకాలా నష్టపోయాం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రతిపత్తి ఇవ్వాలని సూచిస్తూ 2014 మార్చిలో కేంద్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కేంద్రం దీనిపై ఉత్తర్వులు ఇవ్వలేదు.
- కొత్తగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రైల్వేజోన్ ఇస్తామన్నారు. విశాఖ కేంద్రంగా ఇవ్వాలని రాష్ట్రం కోరింది. దీనిపై కేంద్రం కమిటీ వేసింది, వారు నివేదికా ఇచ్చారు. ఇప్పటికీ కేంద్రం రైల్వేజోన్‌పై నిర్ణయం తీసుకోలేదు.
- పెట్రో కెమికల్ కాంప్లెక్సు, గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ అన్నది ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీ. దీన్ని వాణిజ్య దృష్టితో చూడకూడదు. వీటి ఏర్పాటులో ప్రాథమికంగా ఉండే కష్టనష్టాలను తాము భరిస్తామని కేంద్రం చెప్పింది. ఈ హామీ నెరవేర్చాలి.
- ఆంధ్రప్రదేశ్‌లో 2014-15 సంవత్సరానికి ఆర్థిక లోటు, రాజధాని అమరావతి నిర్మాణానికి రాబోయే 5 ఏళ్లలో రూ.42,935 కోట్ల నిధులు, రాష్ట్రంలో 11 జాతీయస్థాయి విద్యా సంస్థలను నెలకొల్పడానికి ఇస్తున్న అరకొర నిధులు, పోలవరం ప్రాజెక్టుకు 2014-15 లెక్కలతో సమర్పించిన సవరించిన అంచనాల ఆమోదం తదితర అంశాలను కూడా పుస్తకంలో సవివరంగా ప్రస్తావించారు.



నాలుగేళ్లలో వృద్ధిరేటు ఇలా!

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్, జాతీయస్థాయిలో గత నాలుగేళ్లలో వివిధ రంగాలకు సంబంధించిన వృద్ధిరేటు గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. విభాగాధిపతులు, వివిధ శాఖల కార్యదర్శులతో నిర్వహించిన దృశ్యశ్రవణ సమావేశంలో భాగంగా ఈ గణాంకాలను ప్రకటించింది. 2014-15, 2015-16, 2016-17, 2017-18 సంవత్సరాలకు సంబంధించి వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో, తలసరి ఆదాయంలో మన రాష్ట్రం సాధించిన ప్రగతి, అదే కాల వ్యవధిలో జాతీయస్థాయిలో ఆయా రంగాలు, తలసరిఆదాయంలో నమోదైన వృద్ధిరేటును పేర్కొంది. ఆ గణాంకాలు ఇలా ఉన్నాయి.

రంగాల వృద్ధిరేటు	ఆంధ్రప్రదేశ్				జాతీయస్థాయి			
	2014–15	2015–16	2016–17	2017–18	2014–15	2015–16	2016–17	2017–18
వ్యవసాయ రంగం	3.55	7.78	14.91	17.76	-0.2	0.6	6.3	3.0
పారిశ్రామిక	12.58	9.61	7.4	8.49	7.0	9.8	6.8	4.8
సేవలు	8.98	10.78	9.41	9.11	9.8	9.6	7.5	8.2
జీఎస్‌డీపీ/జీడీపీ	9.20	10.60	11.07	11.22	7.4	8.2	7.1	6.6
తలసరిఆదాయం(రూ.ల్లో)	93903	107276	123664	142054	86647	94731	103870	112764
సగటు పెరుగుదల (రూ.ల్లో)	11033	13373	16388	18390	7529	8084	9139	8894
వృద్ధిరేటు	13.31	14.24	15.28	14.87	9.52	9.33	9.65	8.56

తెదేపా, భాజపాల గుర్తింపు రద్దు చేయాలి

ఈనాడు, దిల్లీ: ఎన్నికల హామీలు నెరవేర్చని తెదేపా, భాజపాల గుర్తింపు రద్దు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి(సీఈసీ) ఏపీ కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారమిక్కడ ఏపీపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో కేవీపీ రామచంద్రరావు, గిడుగు రుద్రరాజు, సుంకర పద్మశ్రీ, రాజీవ్‌రతన్, సూర్యనాయక్ తదితరులు సీఈసీ ఓం ప్రకాశ్ రావత్‌ను కలిశారు. భాజపా, తెదేపాలు ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అంశాలతో కూడిన ఏడు పేజీల వినతిపత్రం అందజేశారు. అనంతరం రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల చట్టంలోని సెక్షన్ 16(ఏ) కింద రెండు పార్టీల గుర్తింపు రద్దు చేయాలని కోరామన్నారు.

ఎన్డీఏ కూటమి నుంచీ తెదేపా వైదొలగాలి: సీపీఐ

ఈనాడు, దిల్లీ: కేంద్రమంత్రివర్గం నుంచి తెదేపా మంత్రులు వైదొలిగినా ప్రధాని నరేంద్ర మోదీ ఏ మాత్రం చలించలేదని, ఈ నేపథ్యంలో ఎన్డీఏ కూటమి నుంచి కూడా తెలుగు దేశం పార్టీ తక్షణమే బయటకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండు చేశారు. శుక్రవారమిక్కడ ఏపీ భవన్‌లో సీపీఐ, విభజన హామీల సాధన సమితి, ఏపీ పాత్రికేయుల ఆధ్వర్యంలో విభజన హామీలు నెరవేర్చాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. వైకాపా ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానానికి తెదేపా మద్దతు ఇవ్వాలని కోరారు. అవసరమైతే ఏపీకి చెందిన ఎంపీలందరూ రాజీనామా చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకహోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉత్తర భారత్‌లోని రాష్ట్రాలను ఒకవిధంగా ఏపీని మరో తరహాలో కేంద్రం చూస్తోందని ఆరోపించారు.

ఏడాదిలో మూడో స్థానానికి



భారత విమానయాన మార్కెట్‌పై అంచనాలను వెల్లడిస్తున్న ఎయిర్‌బస్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ (ఆసియా, ఉత్తర అమెరికా) జూస్ట్ హెజ్‌డెన్, భారత్‌లో ఎయిర్‌బస్ ప్రెసిడెంట్ శ్రీనివాసన్ ద్వారకానాథ్

● 20 ఏళ్లలో 1,750 విమానాల కొనుగోలు ● విలువ రూ.16.57 లక్షల కోట్లు
● ప్రయాణికులు అయిదింతలు ● 24,000 పైలట్లు, నిర్వహణ ఇంజినీర్ల ఉద్యోగాలు
● భారత విమానయాన రంగంపై ఎయిర్‌బస్ అంచనా

ఈనాడు - హైదరాబాద్

వచ్చే ఇరవైఏళ్లలో భారత విమానయాన రంగం ప్రపంచ పరిశ్రమ వృద్ధి రేటు కన్నా దాదాపు రెట్టింపు వృద్ధిరేటును నమోదు చేయనుంది. ఆర్థిక వృద్ధిరేటు, పెరుగుతున్న ఆదాయాలు, ప్రాంతీయ అనుసంధానత, దేశీయ విమానయాన సంస్థలు విదేశాలకు విస్తరించడం, విమానాశ్రయాల అభివృద్ధి, నవీకరణ తదితర సానుకూల అంశాలు దేశీయ విమానయాన పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేయనున్నాయి. 2017-36 మధ్య కాలంలో భారత్‌లో ప్రయాణికుల రద్దీ ఏడాదికి సగటున 8.1 శాతం వృద్ధి చెందగలదని ఎయిర్‌బస్ అంచనా వేస్తోంది. దీని ప్రకారం వచ్చే 20 ఏళ్లలో దేశంలో విమాన ప్రయాణికుల రద్దీ అయిదింతలవుతుంది. ఇదే కాలంలో ప్రపంచ పరిశ్రమ సగటున 4.4 శాతం వృద్ధిరేటును నమోదు చేసే అవకాశం ఉందని ఎయిర్‌బస్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఆసియా అండ్ అమెరికా) జూస్ట్ వ్యాన్ డెర్ హెజ్‌డెన్ తెలిపారు. 'భారత విమానయాన విపణి ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. అమెరికా, చైనా తర్వాత 2019/20 నాటికి భారత విమానయాన మార్కెట్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద విపణిగా అవతరించనుందని ఎయిర్‌బస్ తాజాగా అంచనా వేసింది. వచ్చే ఇరవైఏళ్లలో దేశీయ విమానయాన కంపెనీలు కొత్తగా 1,750 విమానాలను కొనుగోలు చేయగలవు. వీటి విలువ 255 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 16.57 లక్షల కోట్లు) ఉండగలదన్నా'రు. కొత్తగా కొనుగోలు చేసే విమానాల్లో 1,320 విమానాలు 100-210 సీట్ల సామర్థ్యం కలిగిన సింగిల్ ఎయిల్ విమానాలు, 430 వైడ్ బాడీ (250 కంటే ఎక్కువ సీట్లు) విమానాలు ఉండగలవని భారత్‌లో ఎయిర్‌బస్ విభాగం ప్రెసిడెంట్ శ్రీనివాసన్ ద్వారకానాథ్ తెలిపారు. భవిష్యత్తులో భారత్‌లోని మొత్తం విమానాల్లో వైడ్ బాడీ విమానాల (పెద్ద విమానాలు) శాతం పెరగనుంది. దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో పెరిగే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కంపెనీలు పెద్ద విమానాలతో సేవలను అందించే వీలుందని, ఇందుకు అనుగుణంగా విమానాశ్రయాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ద్వారకానాథ్ అన్నారు. వచ్చే పదేళ్లు భారత్‌లో ప్రతి వారం ఒక విమానం చొప్పున ఎయిర్‌బస్ బట్వాడా చేయనుందని చెప్పారు.



భారీగా ఉద్యోగావకాశాలు..: ప్రపంచంలోనే భారత విమానయాన విపణి అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నందున పెరిగే విమానాలకు అనుగుణంగా పైలట్లు, కంట్రోల్ టవర్ నిపుణులు, గ్రౌండ్ హ్యాండిలింగ్ సిబ్బంది వంటి అనేక విభాగాల్లో భారీగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. వచ్చే 20 ఏళ్లలో భారత్‌కు 24,000 మంది కొత్త పైలట్లు, మెయింటెనెన్స్ ఇంజినీర్ల అవసరం ఉందని ఎయిర్‌బస్ వెల్లడించింది. పొరుగు దేశాల నుంచి కూడా భారత పైలట్లు, మద్దతు సిబ్బందికి ఉద్యోగావకాశాలు లభించగలవని శ్రీనివాసన్ 'ఈనాడు'కు తెలిపారు.

రూ.250 కోట్లతో పైలట్ శిక్షణ కేంద్రం

40 మిలియన్ డాలర్లతో (దాదాపు రూ.250 కోట్లు) పైలట్ శిక్షణ కేంద్రాన్ని భారత్‌లో ఏర్పాటు చేయాలని ఎయిర్‌బస్ యోచిస్తోంది. ఈ శిక్షణ కేంద్రంలో ప్రారంభంలో 4 సిమ్యులేటర్లు ఉంటాయి. వీటి సంఖ్యను భవిష్యత్తులో ఎనిమిదికి పెంచాలని భావిస్తున్నాం. ఏడాదికి 800 మందికి ఇందులో శిక్షణ ఇవ్వవచ్చు. మెయింటెనెన్స్ ఇంజినీర్లకు కూడా శిక్షణ ఇవ్వడానికి ఇందులో తగిన సదుపాయాలను కల్పించనున్నామని ద్వారకానాథ్ తెలిపారు. 2018, ఏప్రిల్‌లో దీని నిర్మాణాన్ని చేపట్టనున్నాం. వచ్చే ఏడాది ఇది సిద్ధమవుతుంది. దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

ఎయిర్ కార్గో పరిశ్రమలో అపార అవకాశాలు:జయంత్ సిన్హా

దేశంలో ఎయిర్ కార్గో పరిశ్రమ ప్రధాన పరిశ్రమగా అభివృద్ధి చెందడానికి అపార అవకాశాలు ఉన్నాయని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా అన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు రంగంలోని కార్గో, లాజిస్టిక్ పరిశ్రమలు కలిసి పని చేయాలన్నారు. సహకార, సంప్రదింపులు, సమగ్ర విధానాలతో కలిసి అడుగులు వేయాలని సూచించారు. 'వింగ్స్ ఇండియా 2018'లో కార్గో, లాజిస్టిక్స్ పరిశ్రమలపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎయిర్ కార్గో ప్రతి ఏడాది 20 శాతం చొప్పున వృద్ధి చెందుతోందని, 3.7 లక్షల టన్నుల సరకును రవాణా చేస్తోందని మంత్రి వివరించారు.

జులై నుంచి హైదరాబాద్‌లో హెలికాప్టర్ అంబులెన్స్ సేవలు!

హైదరాబాద్‌కు చెందిన టర్బో రెస్క్యూ సర్వీసెస్ 'ట్రూఎయిడ్' పేరుతో హెలికాప్టర్ ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ (హెచ్ఈఎంఎస్) సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం హెలికాప్టరులో రోగిని ఆసుపత్రికి తరలించే సదుపాయం మాత్రమే ఉందని, దేశంలోనే తొలిసారిగా డాక్టరు, పారా మెడికల్ సిబ్బంది, ఐసీయూలో ఉండే సదుపాయాలతో ట్రూఎయిడ్ హెలికాప్టరు ఉంటుందని, ముందుగా తెలంగాణ పట్టణాలు, ప్రాంతాలను అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించడానికి సేవలను ప్రారంభిస్తామని కంపెనీ ప్రతినిధి తెలిపారు. 2018 చివరి నాటికి ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఈ సేవలను విస్తరించనున్నట్లు చెప్పారు. విమానయాన రంగం, ఐక్యాట్ ((ఇంటర్నేషనల్ క్రిటికల్ కేర్ ఎయిర్ ట్రాన్స్‌ఫర్ టీమ్) నిపుణులు కలిసి ఈ సేవలను ఆవిష్కరిస్తున్నారు. ట్రూఎయిడ్ ప్రస్తుతం సాధారణ అంబులెన్స్ సేవలను అందిస్తోంది. హెచ్ఈఎంఎస్ సేవలకు రెండు హెలికాప్టర్లను వినియోగించనున్నారు. చందాదారు ప్రాతిపదికన 'ట్రూఎయిడ్' హెచ్ఈఎంఎస్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తుంది. రూ.10-12 వేలు చెల్లించి చందాదారుగా చేరాల్సి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో రోగిని తరలించడానికి ఆయా ప్రాంతాన్ని బట్టి రూ.2-4 లక్షల వసూలు చేస్తారు. ఇప్పటికే 50 మంది చందాదారులుగా చేరినట్లు ట్రూఎయిడ్ ప్రతినిధి తెలిపారు.

ఎఫ్ఎస్‌టీసీ పైలట్ శిక్షణ కేంద్రం

గుడ్‌గావ్‌కు చెందిన ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టీసీ) శంషాబాద్ విమానాశ్రయం ప్రాంగణంలో సిమ్యులేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఆగస్టు నాటికి ఈ కేంద్రం అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ విమానాశ్రయంలో విమానాల పార్కింగ్‌కు స్థలం ఉండడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇక్కడ సిమ్యులేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఎఫ్ఎస్‌టీసీ సీఈఓ దిల్వార్ సింగ్ బస్రాన్ తెలిపారు. ముందుగా క్యూ400 విమానానికి సంబంధించిన సిమ్యులేటరును ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత ఏటీఆర్, బోయింగ్ విమానాల సిమ్యులేటర్లను కూడా నెలకొల్పుతారు. ఒక్కో సిమ్యులేటరును ఏర్పాటు చేయడానికి కోటి డాలర్లు అవుతుంది. ఉత్తరాది, దక్షిణాదుల్లో ఒక్కొక్కటి చొప్పున రెండు శిక్షణ స్కూళ్లను కూడా ఏర్పాటు చేయాలని ఎఫ్ఎస్‌టీసీ యోచిస్తోంది. దక్షిణాదిలో ఏర్పాటు చేసే ఫ్లైయింగ్ స్కూల్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి అవకాశాలు ఉన్నాయని, మౌలిక సదుపాయాలు, వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుని ఫ్లైయింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తారని, ఈ రెండు హైదరాబాద్‌లో సానుకూలంగా ఉన్నాయని కంపెనీ ప్రతినిధి చెప్పారు. శిక్షణకు వినియోగించే చిన్న విమానాల ధర రూ. 2-4 కోట్ల వరకూ ఉంటుందన్నారు. సిమ్యులేటర్లపై శిక్షణకు రూ.15 లక్షల నుంచి రుసుము ఉంటుంది. పైలట్ లైసెన్సు కలిగిన వారు కొత్త విమానాలను నడపడంలో శిక్షణ పొందడానికి సిమ్యులేటర్లపై నేర్చుకుంటారు. పైలట్ విద్యార్థులకు కూడా సిమ్యులేటర్లపై శిక్షణ ఇస్తారు. కమర్షియల్ పైలట్ లైసెన్స్ కోసం శిక్షణ ఇచ్చేందుకు రూ.30 లక్షల ఖర్చవుతుందన్నారు.

భారత్‌లో ఇ-175 విమానాలకు గిరాకీ: ఎంబ్రార్

భారత్‌లో ప్రాంతీయ అనుసంధానాన్ని పెంచడానికి ప్రాంతీయ అనుసంధానత కార్యక్రమం (ఆర్‌సీఎస్) ఇ-175 రకం విమానాలకు గిరాకీ పెంచగలదని విమానాల తయారీ కంపెనీ ఎంబ్రార్ భావిస్తోంది. భారత్‌లో 70 సీట్లు, 180 సీట్ల విమానాలు మాత్రమే ఉన్నాయని.. ప్రాంతీయ అనుసంధానత కారణంగా ఈ రెండు శ్రేణుల మధ్యలో సీట్లు ఉండే విమానాలకు గిరాకీ రానుందని, 88 సీట్ల సామర్థ్యం కలిగిన ఇ-175 మోడల్ విమానం ప్రాంతీయ ప్రయాణానికి ఎంతో అనుకూలమైనదని ఎంబ్రార్ కమర్షియల్ ఏవియేషన్ వైస్ ప్రెసిడెంట్ (ఆసియా పసిఫిక్) సెసర్ పెరిరా తెలిపారు. 150 సీట్ల వరకూ ఉండే విమానాల మార్కెట్‌లో కంపెనీకి 29 శాతం వాటా ఉందని, గత అయిదారేళ్లలో భారత్‌లో దాదాపు 140 విమానాలను ఎంబ్రార్ విక్రయించిందని వివరించారు. 'వింగ్స్ ఇండియా 2018'లో పాల్గొనేందుకు ఎంబ్రార్ ఉన్నత స్థాయి వర్గాలు ఇక్కడకు వచ్చాయి. 2014, ఫిబ్రవరిలో 25 ఇ-190-ఈ2, 25 ఇ-195-ఈ2 విమానాలను కొనుగోలు చేయడానికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎయిర్‌కోస్టా ఎంబ్రార్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అయితే.. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్న ఎయిర్‌కోస్టా కార్యకలాపాలను నిలిపివేసింది. ఎయిర్‌కోస్టా ఇచ్చిన 300 కోట్ల డాలర్ల విలువైన 50 విమానాల ఆర్డరు విలువైనదిగానే భావిస్తున్నామని, కంపెనీ ఆర్డర్ల పుస్తకంలో ఈ ఆర్డర్ ఇంకా ఉందన్నారు. ఎయిర్‌కోస్టా కష్టాల నుంచి మళ్లీ కోలుకోగలదని భావిస్తున్నామని పెరిరా అన్నారు. ఆర్డరు రద్దుకు ఎటువంటి కాలపరిమితి లేదన్నారు.

చార్టర్ విమాన సేవలకు ఆదరణ

క్లబ్ వన్ ఎయిర్ సీఈఓ మెహ్రా వెల్లడి

దేశంలో బిజినెస్ ఏవియేషన్ వృద్ధి చెందడానికి అపార అవకాశాలు ఉన్నాయని, చార్టర్డ్ సేవలు దాదాపు 20 శాతం చొప్పున వృద్ధి చెందుతున్నాయని దేశంలోని అతిపెద్ద చార్టర్ ఆపరేటరు క్లబ్ వన్ ఎయిర్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాజన్ మెహ్రా తెలిపారు. దేశ, విదేశాల్లో అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు (భారతీయులు) పెరుగుతున్నారని, సొంత పనులను చక్కబెట్టుకోవడానికి చార్టర్ విమానాలను వినియోగిస్తున్నారని చెప్పారు. సమయాన్ని ఆదా చేసుకోవడానికి చిన్న స్థాయి కంపెనీల యజమానులు సైతం దేశంలోని వివిధ ప్రాంతాలకు చార్టర్ విమానాల ద్వారా వెళ్లేందుకు ఇష్టపడుతున్నారని, కొద్దిగా ఎక్కువ మొత్తాన్ని చెల్లించడానికి వెనుకాడడం లేదన్నారు. బిజినెస్ ఏవియేషన్ సంపన్నులకు మాత్రమే పరిమితమన్న భావన పోవాలని.. కేవలం కార్పొరేట్ యజమానులే కాక రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు మొదలైన వారు కూడా చార్డర్ విమానాల సేవలను వినియోగించుకుంటున్నారని వివరించారు. మూడు ఫాల్కాన్ విమానాలతో సహా మొత్తం తొమ్మిది విమానాలతో క్లబ్ వన్ ఎయిర్ చార్టర్ సేవలను అందిస్తోంది. తాజాగా మరో ఫాల్కాన్ విమానాన్ని సొంతం చేసుకున్న సందర్భంగా రాజన్ మెహ్రా మాట్లాడారు. లండన్ నుంచి దిల్లీకి చార్టర్ సేవలను అందించడానికి వైడ్ బాడీ విమానాన్ని కొనుగోలు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. దేశంలో బిజినెస్ ఏవియేషన్ మార్కెట్ విలువను కచ్చితంగా అంచనా వేయడానికి సరైన డేటా లేదని, అయితే.. ఈ విభాగం వేగంగా వృద్ధి చెందుతోందని తెలిపారు.



ఏమాత్రం తగ్గం

● మీరు ఎంత పన్ను విధిస్తే.. మేమూ అంతే వేస్తాం
● భారత్, చైనాలకు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: భారత్, చైనాలు తమ వస్తువులపై ఎంత దిగుమతి సుంకం విధిస్తున్నారో అంతే సుంకాన్ని వాటికి కూడా వర్తింపజేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. 'చైనా 25% లేదా భారత్ 75% పన్ను వేసినా మేం మాత్రం ఎటువంటి పన్ను విధించడం లేదు. ఇప్పుడు 50 లేదా 75 లేదా 25 సంఖ్య ఏదేనా మేమూ అదే వర్తింపజేస్తాం. దీనినే రెసిప్రోకల్ విధానం అంటార'ని అన్నారు. అల్యూమినియం, ఉక్కు దిగుమతులపై 25%, 10% చొప్పున సుంకం విధించే ఆదేశాలపై సంతకాలు చేయడానికి ముందు ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికాలో తయారయ్యే హార్లే డేవిడ్‌సన్ మోటర్‌సైకిళ్లపై భారత్ అధిక సుంకం విధిస్తోందని ఇటీవల ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అయితే ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకం పెంపు ప్రభావం దేశీయ కంపెనీలపై ఏవిధంగా ఉండనుందో అనే అంశాన్ని పరిశీలించేందుకు అమెరికా నోటిఫికేషన్ కోసం వేచి చూస్తున్నామని భారత్ పేర్కొంది.

కెనడా, మెక్సికోలకు మినహాయింపు..

అల్యూమినియం, ఉక్కు దిగుమతి సుంకం పెంపు ఆదేశాలు రానున్న 15 రోజుల్లో ఇది అమల్లోకి రానున్నాయి. అయితే పొరుగు దేశాలపైన కెనడా, మెక్సికోలకు టారీఫ్ పెంపుల నుంచి అమెరికా మినహాయింపును ఇచ్చింది. మిగిలిన దేశాలు కూడా మినహాయింపు పొందాలంటే అమెరికా వాణిజ్య ప్రతినిధులతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. 'అమెరికా జాతీయ పరిరక్షణకు ఉక్కు, అల్యూమినియం పరిశ్రమల బలోపేతం ముఖ్యం. మన ఓడలను విమానాలను, ఇతరత్రా రక్షణ సామగ్రిని మన దేశంలో తయారైన అల్యూమినియం, ఉక్కుతోనే తయారు చేయాలన్నదే ఆకాంక్ష. ఎన్నో ఏళ్లుగా ఇది అలాగే ఉండిపోయింద'ని ట్రంప్ అన్నారు.

కొనసాగిన దేశాల వ్యతిరేకత..

అమెరికా సుంకం పెంపు అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి దారి తీస్తుందని ఇప్పటికే ఐరోపా, చైనా దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇప్పటివరకు కొనసాగుతున్న సంబంధాలు చెడిపోయే ప్రమాదముందని కూడా మరికొన్ని దేశాలు హెచ్చరించాయి. ద్వైపాక్షిక సత్సంబంధాలపై ట్రంప్ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందని జపాన్ అభిప్రాయపడగా.. ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు చేస్తామని దక్షిణ కొరియా తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థపై అతిపెద్ద దాడిగా చైనా అభివర్ణించింది. మరోవైపు అమెరికాతో స్నేహ సంబంధంతో మెలుగుతున్న తమకు టారీఫ్‌ల నుంచి మినహాయింపు ఇవ్వాల్సిందిగా ఈయూ ట్రేడ్ కమిషనర్ సెసిలా మామ్‌స్ట్రోమ్ ట్వీట్ చేశారు. మినహాయింపులకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు ఈయూ భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేస్తామని బ్రిటన్ ప్రభుత్వం తెలిపింది. సుంకం పెంపు నుంచి తమకు మినహాయింపు ఇవ్వకుంటే 90 రోజుల్లో తమ చర్యలను ప్రకటిస్తామని ఐరోపా కూటమి హెచ్చరించింది. అమెరికా చర్యకు ప్రతిచర్యలో భాగంగా ఆ దేశం నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తులపై టారీఫ్ పెంపు అంశాన్ని బ్రజెల్స్ పరిశలిస్తోంది. ఈ వాణిజ్య యుద్ధంలో కేవలం నష్టపోయిన వాళ్లే ఉంటారని ఫ్రాన్స్ ఆర్థిక మంత్రి బ్రూనో లె మైర్ తెలిపారు.

డిసెంబరుకు బ్యాంకుల ఎన్‌పీఏలు రూ.8.41 లక్షల కోట్లు

పారిశ్రామిక రుణాల వాటాయే అధికం

దిల్లీ: దేశంలోని అన్ని బ్యాంకుల్లోని స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏలు) డిసెంబరు నాటికి రూ.8,40,958 కోట్లుగా నమోదయ్యాయి. వీటిలో ఎక్కువగా పరిశ్రమలకిచ్చిన రుణాలే ఉన్నాయి. ఆ తర్వాత మొండి బకాయిలు ఎక్కువగా ఉన్న రంగాల్లో సేవలు, వ్యవసాయాలున్నాయి. డిసెంబరు 31, 2017 నాటికి పరిశ్రమకిచ్చిన రుణాల్లో మొండి బకాయిలు రూ. 6,09,222 కోట్లుగా ఉన్నాయి. స్థూల అడ్వాన్సుల్లో ఇవి 20.41 శాతంగా ఉన్నాయి. ఇక సేవల రంగం (రూ.1,10,520 కోట్లు-5.77%); వ్యవసాయ, అనుబంధ రంగాలు (రూ.69,000 కోట్లు-6.53%); రిటైల్ విభాగం (రూ.36,630 కోట్లు-2.01%)లలో కూడా మొండి బకాయిలు నమోదైనట్లు ఆర్థిక సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక్‌సభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో తెలిపారు. డిసెంబరు 31, 2017 నాటికి నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) వద్ద 8457 కేసులు; నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ 264 కేసులు పరిష్కారం కాకుండా(పెండింగ్‌లో) ఉన్నాయి.

ఏ బ్యాంకుకు ఎన్ని మొండి బకాయిలు

బ్యాంకు	స్థూల నిరర్థక ఆస్తులు (రూ.కోట్లలో)
ఎస్‌బీఐ	2,01,560
పీఎన్‌బీ	55,200
ఐడీబీఐ బ్యాంక్	44,542
బ్యాంక్ ఆఫ్ ఇండియా	43,474
బ్యాంక్ ఆఫ్ బరోడా	41,649
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	38,047
కెనరా బ్యాంక్	37,794
ఐసీఐసీఐ బ్యాంక్	33,849
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	31,724
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	32,491
యూకో బ్యాంక్	24,308
అలహాబాద్ బ్యాంక్	23,120
ఆంధ్రా బ్యాంక్	21,599
కార్పొరేషన్ బ్యాంక్	21,818

ఉద్దేశపూర్వక ఎగవేతదార్లు 9,063

బకాయిలు రూ.1,10,050 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- డిసెంబరులో ఉద్దేశపూర్వక ఎగవేతదార్ల సంఖ్య 1.66 శాతం పెరిగి 9,063కి చేరింది. వీళ్లందరూ చెల్లించాల్సిన బకాయి విలువ రూ. 1,10,050 కోట్లు. లోక్‌సభలో అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా పైవిధంగా సమాధానమిచ్చారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగ్గొట్టిన వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు వీలుంది. '2017 డిసెంబరు 31 నాటికి ఉద్దేశపూర్వక ఎగవేతదార్లపై ప్రభుత్వ రంగ బ్యాంకులు 2,108 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాయి. బకాయిల వసూలు నిమిత్తం 8,462 కేసులు పెట్టాయి. 6,962 కేసుల్లో సర్ఫేసి చట్టం కింద చర్యలను కూడా చేపట్టాయ'ని మంత్రి తెలిపారు. ఏదేని కంపెనీల్లో ప్రమోటర్లు/డైరెక్టర్లు ఉద్దేశపూర్వక ఎగవేతదార్లుగా మారితే వాళ్లను కేపిటల్ మార్కెట్ల ద్వారా నిధుల సమీకరణ నుంచి బహిష్కరిస్తూ సెబీ ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. 2016 మార్చితో ముగిసిన ఐదేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.2,30,287 కోట్ల రుణాలను రద్దు (రైటాఫ్) చేశాయని మరో ప్రశ్నకు సమాధానంగా శుక్లా వెల్లడించారు.

బ్యాంకు కుంభకోణాల కేసుల్లో జనవరి- ఫిబ్రవరిలో

రూ.7,100 కోట్ల ఆస్తుల జప్తు

బ్యాంక్ కుంభకోణాలకు సంబంధించిన కేసుల్లో జనవరి, ఫిబ్రవరిల్లో 234 సోదాలు నిర్వహించి, రూ.7,100 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసిందని ప్రభుత్వం తెలిపింది. గత మూడేళ్లలో (ఫిబ్రవరి వరకు) మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద 605 కేసులు నమోదు చేసి, రూ.27,982 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక్‌సభకిచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఇందులో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు కూడా ఉన్నాయని వెల్లడించారు.

పీఎన్‌బీ కేసులో 107 కంపెనీలపై దర్యాప్తు

నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీల గ్రూప్‌లకు సంబంధమున్న 107 కంపెనీలు, ఏడు లిమిటెడ్ లయబులిటీ భాగస్వామ్యాల(ఎల్ఎల్‌పీ)లపై తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం(ఎస్ఎఫ్ఐఓ) దర్యాప్తు చేపడుతోంది. రూ.12,700 కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) కుంభకోణం జరగడానికి కారణమైన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్(ఎల్ఓయూలు)ను ఎలా సృష్టించారన్న విషయంపై ప్రస్తుతం ఎస్ఎఫ్ఐఓ పరిశీలన జరుపుతోంది. కార్పొరేట్ కార్యకలాపాల మంత్రి


7 ఎల్ఎల్‌పీలపైనా ఎస్ఎఫ్ఐఓ కన్ను

కూడా అయిన జైట్లీ లోక్ సభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో పై విషయాలను తెలిపారు. 'కార్పొరేట్ వ్యవహారాల శాఖ నీరవ్, మెహుల్‌లకు సంబంధించిన ఆయా వ్యక్తులు, గ్రూప్‌లపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) వద్ద పిటిషన్ దాఖలు చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు కంపెనీలు, ఎల్ఎల్‌పీలు, ట్రస్టులు వ్యక్తులు తమకు చెందిన నిధుల బదిలీ, ఆస్తుల అమ్మకాలను చేయకుండా ట్రైబ్యునల్ ఆదేశాలు జారీ చేసింద'ని కూడా ఆయన ఆ సమాధానంలో వివరించారు. 'ఆయా కంపెనీలు, వ్యక్తులకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను కోరుతూ 13 దేశాలకు విజ్ఞప్తి లేఖలు రాశాం. నిందితులపై నాన్-బెయిలబుల్ వారెంట్లను ఇవ్వాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టును కోరింది. తదుపరి దర్యాప్తు ప్రస్తుతం జరుగుతోంద'ని జైట్లీ ఆ రాతపూర్వక సమాధానంలో తెలిపారు.



వోల్వో కార్ల ధరల పెంపు

దిల్లీ: వోల్వో కార్ల ధరలు 5 శాతం వరకూ పెంచబోతున్నట్లు వోల్వో కార్ ఇండియా సంస్థ ప్రకటించింది. 2018-19 బడ్జెట్‌లో దిగుమతి సుంకం పెంచిన నేపథ్యంలో ఆ ప్రభావం తగ్గించుకునేందుకు ధరలు పెంచాల్సి వస్తోందని వెల్లడించింది. కొత్తగా తయారవుతున్న కార్లపై ఈ పెంచిన ధరలు అమల్లోకి వస్తాయని తెలిపింది. 'దిగుమతి సుంకం పెంపు ఆటోమొబైల్ పరిశ్రమపై స్వల్పకాలంలో ప్రభావం చూపుతోంది. అందుకే మా సంస్థ నుంచి వస్తున్న వివిధ రకాల కార్లపై 5 శాతం వరకూ ధరలు పెంచడానికి సిద్ధమయ్యామ'ని వోల్వో కార్ ఇండియా ఎండీ ఛార్లెస్ ఫ్రంప్ చెప్పారు. బడ్జెట్‌లో సీకేడీ (కంప్లీట్లీ నాక్డ్ డౌన్) దిగుమతులపై సుంకాన్ని 10 నుంచి 15 శాతానికి, సీబీయూ (కంప్లీట్లీ బిల్ట్ యూనిట్స్) దిగుమతులపై సుంకాన్ని 20 నుంచి 25 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే.



భారత్‌లో ఉబర్‌కు కోహ్లి ప్రచారం

దిల్లీ: భారత క్రికెట్ జట్టు సారథి, రికార్డుల రారాజు విరాట్ కోహ్లిని భారత్‌లో కార్యకలాపాలకు ప్రచారకర్తగా నియమించుకున్నట్లు ఉబర్ తెలిపింది. '2018లో బ్రాండు పురోగతికి విరాట్ కోహ్లితో ఉబర్ ఇండియా భాగస్వామ్యం అంకురార్పణ చేసింది. మార్కెటింగ్, వినియోగదారులను ఆకర్షించేందుకు ఉబర్ ఇండియా చేపట్టే చర్యల్లో కోహ్లి చురుకుగా పాల్గొంటార'ని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే ప్రచారకర్త ఒప్పందానికి సంబంధించి కుదుర్చుకున్న షరతులను వెల్లడించలేదు. 'నగరాల్లో ఒక చోటు నుంచి మరొక చోటుకు ప్రజలను చేరవేసేందుకు సాంకేతికతను గొప్పగా ఉబర్ వినియోగించుకుంటుంది. ఆర్థిక అవకాశాలను సృష్టించడం ద్వారా లక్షలాది మందిని సాధికారిత దిశగా నడిపిస్తోంద'ని కోహ్లి అన్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉబర్ ప్రచారకర్తను నియమించుకోవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. గత నెలలో ఈజిప్టు విపణిలో ప్రచారం నిమిత్తం ప్రఖ్యాతి ఫుట్‌బాల్ ఆటగాడు మహమ్మద్ సలాహ్‌ను నియమించుకుంది.

సెన్సెక్స్ ▼ 44 33307	నిఫ్టీ ▼ 16 10227	డోజోన్స్ 25269 ▲ 373	నాస్డాక్ 7533 ▲ 105	రూపాయి 65.17 ▼ (ఒక అమెరికా డాలరుకు) 03 పైసలు	ముడి చమురు 65.16 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).




ఘనం (+) నిఫ్టీ	9న	మార్పు %	గ్రహణం (-) నిఫ్టీ	9న	మార్పు %
TECH MAHINDRA	619.20	1.98	TATA STEEL	606.75	-4.58
BAJAJ FINANCE	1654.20	1.61	AXIS BANK	505.35	-2.92
HDFC	1818.60	1.10	ADANI PORT	377.90	-2.59
TCS	3034.10	1.00	YES BANK	303.25	-1.72
EICHER MOTORS	27963.85	0.91	SUN PHARMA	506.80	-1.52
INDIAN OIL CORP	385.50	0.89	ICICI BANK	292.70	-1.43
ZEE ENTERTAINMENT	568.50	0.89	VEDANTA	304.15	-1.38
BOSCH	18203.55	0.60	SBI	253.25	-1.38

విదేశీ మారకపు రేట్లు
(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.23	68.68	బ్రహ్రెయిన్ దీనార్	160.39	183.80
పౌండ్ స్టెర్లింగ్	81.74	94.81	కువైట్ దీనార్	179.28	223.24
యూరో	72.90	84.55	ఒమన్ రియాల్	157.07	179.69
జపనీస్ యెన్/100	55.52	64.40	సౌదీ రియాల్	15.75	18.66
ఆస్ట్రేలియా డాలరు	46.09	53.33	యూఏఈ దిర్హమ్	16.12	18.84
సింగపూర్ డాలరు	44.93	53.21	మలేషియా రింగిట్	14.82	18.22
థాయ్ బాత్/100	188.75	225.73	చైనీస్ యువాన్	7.27	11.78

శుక్రవారం నిఫ్టీ కదలికలు



ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్‌కు ఆర్‌బీఐ జరిమానా

ముంబయి: ఆర్‌బీఐ మార్గదర్శకాల్ని ఉల్లంఘించడం, నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను పాటించకపోవడంతో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రూ.5 కోట్ల జరిమానా విధించింది. ఖాతాదారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండానే వారి ఖాతాలు ప్రారంభించినట్లు గత ఏడాది నవంబరు 20-22 తేదీల మధ్య ఆర్‌బీఐ నిర్వహించిన పరిశీలనలో తేలింది. దాదాపు 23 లక్షల ఖాతాలు ఇలా తెరిచినట్లు తేటతెల్లమవడంతో జనవరి 15న ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షోకాజ్ నోటీసు జారీ చేసింది. కేంద్ర బ్యాంకు సూచించిన మార్గదర్శకాలు పాటించకుండా ఖాతాలు తెరిచినందుకు జరిమానా ఎందుకు విధించకూడదో వివరణ ఇవ్వాలంటూ అందులో పేర్కొంది. బ్యాంకు ఇచ్చిన సమాధానం విన్న తరవాత రూ.5 కోట్ల జరిమానా విధించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుంది. గత ఏడాది జనవరి నుంచి ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు తమ కార్యకలాపాలు కొనసాగిస్తోంది.

చివర్లో మళ్లీ గుబులు

- సూచీలకు స్వల్ప నష్టాలు
- లోహ షేర్లు డీలా



సమీక్ష

చివర్లో వెల్లువెత్తిన అమ్మకాల ముందు సూచీలు మరోసారి నిలబడలేకపోయాయి. కొన్ని ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకాలు విధించడమే ఇందుకు నేపథ్యం. ఫలితంగా లోహ షేర్లు కుదేలయ్యాయి. సెయిల్ 6.40%, జిందాల్ స్టీల్ 5.24%, టాటా స్టీల్ 4.66%, నాల్కో 2.19%, ఎన్ఎమ్‌డీసీ 1.85%, వేదాంతా 1.59%, హిందాల్కో 1.26% చొప్పున నష్టాలు నమోదు చేశాయి. రిటైల్ ద్రవ్యోల్బణం, ఐఐపీ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఆసియా షేర్లు రాణించగా, ఐరోపా మార్కెట్లు నష్టాలు నమోదు చేశాయి. ఇక వరుసగా రెండో వారం సూచీలు డీలాపడ్డాయి. వారం మొత్తం మీద చూస్తే.. సెన్సెక్స్ 739.80 పాయింట్లు, నిఫ్టీ 231.50 పాయింట్లు చొప్పున లాభాలు నమోదు చేశాయి.

సెన్సెక్స్ ఉదయం 33,465.05 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజులో అధిక భాగం లాభాల్లో కదలాడిన సూచీ.. ఒకానొకదశలో 33,519.49 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అయితే మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఇంట్రాడేలో 33,256.42 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 44.43 పాయింట్లు కోల్పోయి 33,307.14 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 15.80 పాయింట్ల నష్టంతో 10,226.85 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో 10,211.90-10,296.70 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ బ్యాంకింగ్ షేర్ల బలహీనతలు కొనసాగాయి. యాక్సిస్ బ్యాంక్ 2.85%, బ్యాంక్ ఆఫ్ బరోడా 2.12%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.43%, యెస్ బ్యాంక్ 1.41%, ఎస్‌బీఐ 1.40%, పీఎన్‌బీ 1.24% చొప్పున లాభాలు నమోదు చేశాయి.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 14 నష్టాలు చవిచూశాయి. టాటా స్టీల్ అత్యధికంగా 4.66% నష్టపోయింది. అదానీ పోర్ట్స్ 2.91%, యాక్సిస్ బ్యాంక్ 2.85%, సన్‌ఫార్మా 1.67%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.43%, యెస్ బ్యాంక్ 1.41%, ఎస్‌బీఐ 1.40%, టాటా మోటార్స్ 1.21%, ఎన్‌టీపీసీ 0.85%, మారుతీ సుజుకీ 0.79% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ 1.17%, టీసీఎస్ 1.10%, ఇన్ఫోసిస్ 0.58%, హిందుస్థాన్ యూనిలీవర్ 0.56%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో లోహ 1.94% డీలాపడింది. బ్యాంకింగ్ 0.77%, పీఎస్‌యూ 0.68%, మౌలిక 0.65%, ఆరోగ్య సంరక్షణ 0.61%, విద్యుత్ 0.59% చొప్పున నష్టాల్లో ముగిశాయి.

ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలు 88 కోట్లు

17 కోట్ల పాన్‌కార్డులు కూడా..

దిల్లీ: పాన్‌కార్డులు, బ్యాంకు ఖాతాలతో ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. దాదాపు 17 కోట్ల పాన్‌కార్డులు, 88 కోట్ల బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానమైనట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. "మార్చి 5 నాటికి 16,65,82,421 పాన్‌కార్డులు ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నారు. అలాగే మార్చి 2 నాటికి 87.79 కోట్ల బ్యాంకు ఖాతాలు కూడా ఆధార్‌తో అనుసంధానం అయ్యాయ'ని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా లోక్‌సభకు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో పేర్కొన్నారు. బ్యాంకు శాఖల్లో మార్చి 2 నాటికి 6,811 ఆధార్ నమోదు, సవరణల కేంద్రాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఆధార్ చట్టానికి విరుద్ధంగా గుర్తింపు వివరాల్ని ఎవరైనా దుర్వినియోగం చేస్తే క్రిమినల్ నేరం కిందకు వస్తుందని చెప్పారు. అలాగే పాన్‌కార్డు ఉన్నవారు కూడా తప్పనిసరిగా ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

జియో టీవీ ఇంటరాక్టివ్ సేవలు

ముంబయి: ఇంటరాక్టివ్ టీవీ సదుపాయంలో భాగంగా జియో టీవీ యాప్‌లో క్రికెట్ మ్యాచ్‌లను ఏవైనా అయిదు కెమెరా కోణాల్లో వినియోగదారులు చూసే అవకాశం ఉందని రిలయన్స్ జియో ప్రకటించింది. ప్రస్తుతం శ్రీలంకలో జరుగుతున్న నిదహాస్ ట్రోఫీ మ్యాచ్‌లను ఈ రకంగా చూడొచ్చు. అదే విధంగా వేర్వేరు మైకులను సైతం వినే సదుపాయం ఉంది. స్టంప్, స్టేడియం మైక్‌లో ఏదో ఒకదాన్ని వినియోగదారుడు ఎంపిక చేసుకోవచ్చు. హిందీ, ఇంగ్లీష్, తమిళ్, తెలుగు, కన్నడ భాషల్లో వ్యాఖ్యానాన్ని సైతం వినియోగదార్లు పొందే సౌలభ్యం ఉంది. ఈ సిరీస్‌కు వ్యాఖ్యాతలుగా జహీర్ ఖాన్, ఆశిష్ నెహ్రా, గౌరవ్ కపూర్‌లు వ్యవహరిస్తున్నారు. రాబోయే రోజుల్లో వర్చువల్ రియాల్టీ వంటి కొత్త టెక్నాలజీలను సైతం యాప్‌లోకి తీసుకొస్తామని జియో డైరెక్టర్ ఆకాశ్ అంబానీ పేర్కొన్నారు. ఒక క్లిక్‌తో పూర్తి మ్యాచ్ గణాంకాలను, కోరుకున్నప్పుడు వీడియోలను రివైండ్ లేదా రిపీట్ చేసుకునే అవకాశం ఉంది.

స్వరాజ్ 963 ఎఫ్ఈ ట్రాక్టరు

మొహాలి: మహీంద్రా గ్రూపునకు చెందిన స్వరాజ్ ట్రాక్టర్స్ నుంచి 963 ఎఫ్ఈ ట్రాక్టర్ విపణిలోకి వచ్చింది. తొలిసారిగా 60 హెచ్‌పీ ఇంజిన్ సామర్థ్యంతో కొత్త ట్రాక్టర్‌ను తీసుకొచ్చినట్లు సంస్థ తెలిపింది. 60-75 హెచ్‌పీ ఇంజిన్ సామర్థ్య విభాగంలో ఈ ట్రాక్టర్‌తోనే అడుగుపెట్టామని, ఏడాది కాలంలో 11-12 శాతం మార్కెట్ వాటా లక్ష్యంగా పెట్టుకున్నామని ఎం అండ్ ఎం ఎండీ పవన్ గోయెంకా తెలిపారు. ట్రాక్టర్ ధరను రూ.7.40 లక్షలు (ఎక్స్‌షోరూమ్, మొహాలి)గా నిర్ణయించారు. పంజాబ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్‌లోని స్వరాజ్ ట్రాక్టర్స్ డీలర్ల వద్ద ట్రాక్టర్లు అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. ప్రత్యేక అవసరాలు, ఎక్కువ పొలాలు ఉన్న రైతులను దృష్టిలో ఉంచుకొని ఈ ట్రాక్టర్‌ను తీసుకొచ్చామని స్వరాజ్ విభాగం సీఓఓ వీరేన్ పోప్లి తెలిపారు.



మార్కెట్ కబుర్లు

✦ మార్పిడి రహిత డిబెంచర్ల జారీ ద్వారా రూ.3,000 కోట్లు సమీకరించే యోచనలో **భారతీ ఎయిర్‌టెల్** ఉంది. ఈ మేరకు ఆ కంపెనీ డైరెక్టర్ల కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అలాగే నిధుల సమీకరణ అవకాశాలపై చర్చించేందుకు 12న కంపెనీ బోర్డు డైరెక్టర్లు సమావేశం కానున్నారు.

✦ ఝార్ఖండ్‌లో 2400 మెగా వాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసే నిమిత్తం **భెల్**కు రూ.11,700 కోట్ల విలువైన ఆర్డరు లభించింది.

✦ హెచ్‌పీసీఎల్ కొనుగోలు నిమిత్తం నిధుల సమీకరణకు గుజరాత్‌లోని మెగా పెట్రోకెమికల్ ప్రాజెక్టులో వాటాను **ఓఎన్‌జీసీ** విక్రయించనుంది.

✦ టెలికాం మౌలిక వసతుల ఆస్తులను జియోకు విక్రయించేందుకు **రిలయన్స్ కమ్యూనికేషన్స్**కు కాంపిటీషన్ కమీషన్ ఆఫ్ ఇండియా అనుమతులు ఇచ్చింది.

✦ **బంధన్ బ్యాంక్** తొలి పబ్లిక్ ఆఫర్‌లో ఐఎఫ్‌సీ, ఐఎఫ్‌సీ ఎఫ్ఐజీలు 1.2 శాతం వాటాను విక్రయించనున్నాయి. ఈ రెండింటికి బ్యాంకులో 5 శాతం వరకు వాటా ఉంది. ప్రతిపాదిత ఐపీఓ ఈ నెల 15న ప్రారంభం కానుంది.

✦ అన్ని రకాల ఎలక్ట్రానిక్ ఉపకరణాలను తయారీ చేసే లక్ష్యంతో ముందుకెళుతున్న **మైక్రోమ్యాక్స్** తాజాగా ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్ల విభాగంలో అడుగుపెట్టింది. ఈ విభాగం ద్వారా రూ.2000 కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తోంది.

✦ హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ వద్ద రూ.304 కోట్ల విలువైన 13.4 కోట్ల షేర్లను తనఖా పెట్టినట్లు **రిలయన్స్ కమ్యూనికేషన్స్** వెల్లడించింది. కంపెనీ పెయిడప్ కేపిటల్‌లో ఈ షేర్ల వాటా 4.85%.

✦ ఎన్‌హెచ్ఏఐ నుంచి రూ.934 కోట్ల విలువైన ఆర్డరు పొందినట్లు **సద్భావ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్** తెలిపింది. కాంట్రాక్టులో భాగంగా కర్ణాటకలో టుంకూర్- శివమొగ్గ రహదారిని విస్తరించాల్సి ఉంటుంది. 730 రోజుల్లో దీనిని పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు.

✦ **హెచ్‌జీ ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్** ఇష్యూ ధర అయిన రూ.270 వద్దే నమోదైంది. బీఎస్ఈలో షేరు ధర రూ.252.60-276 మధ్య కదలాడి చివరకు రూ.270.05 వద్ద ముగిసింది.

✦ మెదక్ జిల్లా బొల్లారంలోని **డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్** ఏపీఐ తయారీ ప్లాంట్ (ప్లాంట్-3)లో యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు నిర్వహించింది. 5 లోపాలను గుర్తించి 483 ఫారమ్‌ను జారీ చేసినట్లు కంపెనీ తెలిపింది.

విస్తరణ బాటలో గణేశ్ గ్రెయిన్స్


కోల్‌కతా: అగ్రగామి పిండి ఉత్పత్తుల సంస్థ గణేశ్ గ్రెయిన్స్ విస్తరణ ప్రణాళికలు ప్రకటించింది. తూర్పు భారత్ (బిహార్, ఝార్ఖండ్, ఒడిశా), ఈశాన్య భారత్ (అసోం, త్రిపురా), సిక్కిం, ఉత్తర భారత్ (దిల్లీ, ఎన్‌సీఆర్, ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్), దక్షిణ భారత్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు)ల్లో విస్తరించనున్నట్లు వెల్లడించింది. 'తూర్పు భారతంలో గణేశ్ గ్రెయిన్స్ దిగ్గజ బ్రాండ్‌గా ఎదిగింది. మూడు రాష్ట్రాల్లో 8 తయారీ యూనిట్లు, 6 నిల్వకేంద్రాలు ఉన్నాయి. ఇక పశ్చిమ బంగాల్‌లో 450 పంపిణీదారులు, 30,000కు పైగా రిటైలర్లు ఉన్నారు. ఇప్పుడు సంస్థ దేశవ్యాప్తంగా విస్తరించాలని భావిస్తోంది. బంగాల్‌లో విజయవంతమైన విధంగానే ప్రస్తుత ఉత్పత్తులతో పాటు విభిన్నమైన కొత్త ఉత్పత్తులను తీసుకురానున్నాం. మా పంపిణీ ఛానెళ్ల ద్వారా మరింత ఉపాధి అవకాశాలను సృష్టించడమే లక్ష్యం' అని గణేశ్ గ్రెయిన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మనీశ్ మిమానీ తెలిపారు.

టెక్ మహీంద్రా



రూ.609.70 వద్ద ప్రారంభమై రూ.606.50 - 623.10 మధ్య కదలాడి క్రితం ముగింపు 607.20తో పోలిస్తే రూ.12 (1.98%) లాభంతో రూ.619.20 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో చేతులు మారిన షేర్లు 20,95,483

టాటా స్టీల్




రూ.640.05 వద్ద మొదలై రూ.601.50 - 646.75 మధ్య చలించి క్రితం ముగింపు తో పోలిస్తే రూ.29.15 (4.58%) నష్టంతో రూ.606.75 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలో 1,80,96,367 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
అశోక్ లేలాండ్	147.25	ఆంధ్రా బ్యాంక్	38.20
ప్రీతికా ఆటో ఇండస్ట్రీస్	178.60	బీజీఆర్ ఎనర్జీ	106.85
శ్రీగణేశ్ బయోటెక్	356.00	ఆదిత్యబిర్లా క్యాపిటల్	153.00
గాలా గ్లోబల్ ప్రొడక్ట్స్	372.95	అబాన్ ఆఫ్‌షోర్	154.70
మాస్టెక్	552.00	కెనరా బ్యాంక్	231.85
సనోఫి ఇండియా	5150.00	బీఈఎంఎల్	1085.95

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
09/03	4,514	3,964	550	2,866	2,931	–65
08/03	5,254	5,618	–364	3,951	3,275	676
07/03	4,880	5,599	–719	3,950	3,541	409
06/03	5,932	5,312	620	3,007	3,741	–734
05/03	6,115	6,482	–367	3,160	3,314	–154

9న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



కోడిగుడ్లు (100కు రూపాయలలో)

హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా(ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	330
బెంగళూరు	375	చెన్నై	385
10వ తేదీకి...		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	320	నమక్కల్	370

ఎన్‌ఎస్‌ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 377.90 (387.95) 5352078
AMBUJA CEMEN 235.40 (236.25) 1257500
ASIAN PAINTS 1129.10 (1127.60) 1158526
AUROBIND PHA 592.45 (589.20) 2685763
AXIS BANK LT 505.35 (520.55) 4955525
BAJAJ AUTO L 2935.40 (2923.90) 205178
BAJAJ FINANC 1654.20 (1628.05) 839718
BHARTI AIRTE 402.15 (401.30) 4590422
BHARTI INFRA 333.15 (331.20) 5488752
BOSCH LTD 18203.55 (18094.80) 7157
BPCL 439.40 (442.20) 3712782
CIPLA 571.05 (578.00) 1149194
COAL INDIA L 304.05 (305.50) 2136347
DR. REDDYS 2129.90 (2143.40) 470814
EICHER MOTOR 27963.85 (27711.85) 28679
GAIL 436.90 (436.45) 2011796
HCL TECH 943.00 (950.65) 732364
HDFC 1818.60 (1798.75) 3000976
HDFC BANK 1851.05 (1852.85) 1027027
HERO MOTOCOR 3586.35 (3586.70) 272293
HINDALCO IND 220.20 (222.70) 13433660
HINDUSTAN UN 1300.75 (1293.15) 852176
HPCL 357.05 (360.55) 2385578
ICICI BANK 292.70 (296.95) 12489587
INDIABULLS H 1199.20 (1206.35) 1180577
INDIAN OIL 385.50 (382.10) 5655780
INDUSINDBANK 1697.55 (1694.15) 1281268
INFOSYS LTD 1163.40 (1156.65) 2110482
ITC 259.25 (258.85) 6110339
KOTAK MAHIND 1082.45 (1082.30) 1644991
LARSEN & TOU 1290.50 (1283.80) 2508919
LUPIN 764.50 (771.15) 813679
M&M 728.50 (726.65) 2191343
MARUTI SUZIK 8660.60 (8729.35) 323450
NTPC LTD 164.40 (165.30) 3737738
ONGC 179.90 (180.15) 2053847
POWER GRID C 192.90 (195.40) 5561479
RELIANCE IND 913.10 (911.45) 4863577
SBI 253.25 (256.80) 21536191
SUN PHARMA 506.80 (514.60) 4996423
TATA CONSULT 3034.10 (3003.95) 936218
TATA MOTORS 341.50 (345.15) 5519224
TATA STEEL L 606.75 (635.90) 18096367
TECH MAHINDR 619.20 (607.20) 2095483
ULTRATECH 4079.85 (4119.90) 135949
UPL LIMITED 712.15 (710.80) 1168118
VEDANTA LIMI 304.15 (308.40) 13854157
WIPRO 285.05 (285.20) 1005546
YES BANK LTD 303.25 (308.55) 11596136
ZEE ENTERTAI 568.50 (563.50) 1112161

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1437.70 (1425.75) 157434
ACC 1531.85 (1544.95) 289181
ASHOK LEYLAN 147.00 (144.15) 30193142
AVENUE SUPER 1306.55 (1293.15) 805817
BAJAJ FINSER 4966.25 (4864.60) 140074
BANK OFBAROD 131.55 (134.35) 10445844
BEL 148.45 (147.25) 3078047
BHEL 86.15 (86.10) 9925102
BRITANNIA 4841.80 (4848.40) 188502
CADILA HEALT 384.20 (388.90) 451894
COLGATE PALM 1037.65 (1037.05) 372138
CONTAINER 1248.70 (1250.60) 321044
CUMMINS INDI 776.75 (783.40) 85237
DABUR INDIA 327.25 (325.05) 1796651
DLF LIMITED 211.35 (218.40) 5137684
EMAMI LIMITE 1084.50 (1090.50) 33272
GLAXOSMI CON 6626.75 (6590.00) 7295
GLAXOSMI PHA 2272.80 (2286.25) 7381
GLENMARK PHA 533.15 (552.95) 1032077
GODREJ CONSU 1072.85 (1067.10) 248743
HAVELLS INDI 503.25 (502.55) 525582
HINDUSTAN ZI 313.30 (313.85) 3300536
ICICI PRU LI 390.50 (388.30) 935519
IDEA CELLULR 78.85 (79.65) 7295139
INTERGLOBE A 1289.60 (1288.95) 366280
JSW STEEL LT 291.95 (289.25) 8084115
LIC HOUS.FIN 483.30 (484.10) 2270801
MARICO LIMIT 308.60 (303.30) 856594
MCDOWELL 2978.25 (3001.70) 550352
MOTHERSON 317.15 (316.25) 2524956
MRF 70781.65 (70204.40) 5005
NHPC LTD 26.85 (26.70) 5791671
NMDC LTD 121.90 (124.05) 2082157
OIL INDIA 320.85 (326.55) 601955
ORACLE FIN S 3892.10 (3871.45) 7506
P&G HYG&HEAL 9402.70 (9291.30) 3662
PETRONET LNG 230.70 (235.40) 2457714
PIDILITE IND 878.70 (872.25) 238316
PIRAMAL ENTE 2362.60 (2331.50) 343028
PNB 95.60 (96.65) 30239013
POWER FIN CO 93.10 (91.90) 7680222
RURAL ELEC C 128.15 (125.70) 5970140
SAIL 69.50 (74.30) 30055967
SHREE CEMENT 16000.75 (16098.70) 25369
SHRIRAM TRAN 1338.70 (1326.25) 593989
SIEMENS 1085.80 (1102.10) 286031
SUN TV LTD 879.30 (898.40) 1641001
TATA POWER 80.00 (79.90) 5486959
TITAN IND 819.10 (817.70) 1061685
TORRENT PHAR 1329.80 (1317.80) 372963

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 156.70 (156.60) 661761
ADANI ENTERP 156.10 (168.95) 17088755
ADANI POWER 25.45 (26.10) 15513863
ALL BANK 45.45 (46.50) 7020500
AMARA RAJA 793.70 (794.05) 492436
ANANT RAJIND 50.45 (50.90) 653095
ANDHRA BANK 38.55 (39.40) 4141137
APOLLO HOSPI 1149.05 (1162.70) 294431
APOLLO TYRES 260.00 (260.00) 2986138
APTECH 291.35 (291.60) 477049
BAJAJ ELECT. 565.80 (564.75) 359559
BAJAJ HIND 10.75 (10.85) 2287797
BAJAJ HOLDIN 2728.80 (2727.75) 3598
BALAJI TELE 127.95 (131.65) 138385
BALLARPUR IN 13.25 (12.80) 1509156
BALRAMPUR CH 85.10 (89.95) 9159051
BANK OF MAHA 14.75 (14.90) 810930
BANK OFINDIA 97.65 (99.65) 7189203
BATA INDIA 707.75 (715.25) 577608
BHARAT FORGE 747.80 (748.45) 604663
BHUSHAN STEE 44.15 (47.15) 6092766
BIOCON LTD 595.15 (600.20) 2643286
BOMBAY DYE 242.80 (240.25) 4633394
CANARA BANK 235.45 (251.15) 10847515
CEAT LIMITED 1546.50 (1544.30) 447723
CENTRAL BANK 75.25 (67.60) 14051600
CHAMBAL FERT 153.15 (152.25) 694389
CITY UNIBANK 179.95 (180.00) 897827
CORPO BANK 29.60 (30.75) 426146
COX & KINGS 253.05 (255.30) 58297
D B REALTY L 52.20 (51.90) 411068
DELTA CORP L 314.90 (312.45) 1942351
DENA BANK 18.75 (18.85) 956963
DHANALAKBANK 21.45 (21.30) 309298
DIVIS LAB 998.70 (1002.70) 371889
EDELWEISS CA 260.15 (260.25) 1014769
EID PARRY 300.15 (300.45) 181837
ESSAR SHIPPI 22.95 (24.20) 200641
ESTER INDUST 58.30 (60.20) 89828
EXIDE INDUST 210.00 (209.15) 1789966
FEDERAL BANK 94.00 (93.05) 14174536
FINOLEX CABL 699.95 (713.20) 168458
G E SHIP LTD 351.90 (356.45) 25870
GAMMON INFRA 2.85 (2.90) 2924063
GATI LIMITED 101.10 (101.15) 347489
GAYATRI PROJ 201.10 (205.70) 78288
GMR INFRASTR 17.10 (17.35) 25653611
GODREJ IND 547.00 (550.45) 233343
GRASIM IND 1100.35 (1100.65) 756625
GUJ ALK&CHEM 704.00 (705.85) 31117
HCL INFOSYS 53.55 (55.45) 1832191
HEXA TECH 362.60 (358.35) 920093
HIMACHAL FUT 26.25 (26.90) 4173266
HOUSING DEV 42.20 (42.25) 6998900
IDBI 70.70 (74.80) 45432902
IDFC 49.05 (48.75) 6917381
IFCI 21.20 (21.05) 18932191
IL&FS TRANS 67.60 (67.20) 116792
IND SWIFTLAB 62.55 (59.60) 36314
INDBULLS REL 200.70 (199.05) 5552157
INDIA CEM 145.15 (147.55) 2423623
INDIAN BANK 278.45 (281.20) 2201364
INDRAPRASTHA 300.85 (310.80) 2830725
IOB 18.15 (18.10) 702203
IPCA LAB 679.80 (667.30) 383744
IRB INFRA DE 214.70 (215.50) 684383
J&K BANK 61.05 (61.60) 483486
JAI CORP 128.70 (133.50) 1668152
JAIN IRRIGAT 104.05 (105.25) 9541825
JAYPEE INFRA 9.95 (10.45) 4730384
JET AIRWAYS 688.35 (693.65) 3399667
JINDAL SAW 121.25 (125.15) 1017918
JINDAL STEEL 222.25 (234.70) 16358023
JM FINANCIAL 129.10 (133.45) 613894
JP ASSOCIATS 13.95 (14.60) 58639925
JSW ENERGY L 78.80 (79.50) 1083422
JUBILANT FOO 2060.30 (2010.45) 1376180
JUBILANT ORG 795.60 (800.05) 789621
KARNATA BANK 115.55 (117.70) 3055027
KEC INTL LTD 401.65 (410.65) 463736
KOLTE PATIL 320.65 (324.45) 130474
KPIT CUMMINS 210.15 (210.30) 1629574
L&TFIN.HOLD 160.00 (158.60) 5830204
LAK VIL BANK 99.50 (101.10) 596972
M & M FINANC 419.95 (419.05) 1785116
MANAPPURAM G 102.50 (104.60) 2257009
MMTC LIMITED 45.85 (46.20) 678369
MPHASIS LTD 825.10 (833.20) 183187
MRPL 115.65 (117.25) 520993
MTNL 20.30 (20.75) 946379
NAGARJUNA OI 3.90 (3.90) 473847
NCC LIMITED 118.10 (120.30) 4022449
NETWORK18 FI 49.80 (51.30) 744130
NEULAND LAB 716.15 (704.60) 13257
NIIT LTD 88.15 (89.95) 178064
NIIT TECHNOL 879.25 (879.05) 415572
OMAXE LTD 226.40 (226.65) 523033
ONMOBILE GLO 44.80 (45.75) 238496
ORIENT PAPER 38.35 (38.55) 135342
ORIENTALBANK 91.25 (94.25) 6383035
PARSVNATH DE 16.60 (17.45) 547103
PATEL ENGG 65.85 (65.95) 103070
POWERTRADING 90.20 (91.40) 2163833
PRAJ IND 78.20 (80.75) 663746
PRISM CEMENT 115.75 (120.00) 313609
PUNJ LLOYD 17.70 (18.00) 1001227
PURAVANKARA 143.60 (144.15) 359603
PVR LIMITED 1320.95 (1305.10) 191661
RADICO KHAIT 321.40 (319.70) 1355183
RAJESH EXPOR 805.15 (813.90) 85368
RALLIS INDIA 229.45 (225.85) 116582
RAMKY INFRA 192.70 (195.45) 98305
RAYMOND 901.75 (906.55) 458369
RELIANCE CAP 410.90 (420.75) 4616276
RELIANCE COM 22.70 (25.10) 106099484
RELIANCE INF 416.80 (427.00) 2825255
RELIANCE POW 38.25 (39.95) 5826910
ROLTA INDIA 62.55 (61.10) 2043966
SAGAR CEMENT 925.55 (920.45) 13410
SHANTHI GEAR 131.95 (135.20) 25097
SHIPPNG CORP 63.50 (64.15) 730942
SHREE RENUKA 15.55 (15.55) 12232597
SINTEX IND 18.40 (18.35) 2866525
SOBHA DEVELO 552.25 (548.80) 140037
SOUTHINDBANK 24.95 (25.15) 13891602
STERLITE TEC 337.95 (335.85) 801623
SUJANA METAL 1.30 (1.35) 43212
SUN PHARMA 405.00 (409.75) 229591
SUND FASTNER 574.05 (568.10) 277902
SUZLON ENERG 11.00 (11.50) 25719036
SYND. BANK 54.35 (55.75) 3436237
TATA CHEM 686.90 (695.05) 558095
TATA COFFEE 122.40 (123.85) 383982
TATA COMMUN 620.00 (616.70) 518290
TATA GLOBAL 268.35 (273.40) 1614381
TATA METALIK 732.55 (736.50) 77468
TATA MOT DVR 192.75 (194.90) 1058447
TATA TELESER 5.75 (5.75) 587639
THE INDIAN H 128.60 (129.45) 1407221
TORRENT POWE 252.25 (254.90) 703784
TRIVENI ENGG 47.50 (47.75) 1664547
TTK PRESTIGE 6664.35 (6663.05) 3134
TV TODAY NET 450.55 (449.80) 33825
TV18 BROADCA 62.80 (61.15) 12438579
TVS MOTOR 646.15 (646.50) 731117
UCO BANK 23.95 (24.45) 392567
UNION BANK 93.45 (96.25) 4805217
UNITECH 6.30 (6.45) 23033123
UNITED BANK 12.15 (12.50) 890176
UNITED BREWE 1016.80 (1025.30) 192726
USHA MARTIN 20.00 (21.00) 635119
VADILAL INDU 945.70 (898.90) 62743
VENKYS 3719.35 (3827.40) 193506
V-GUARD IND 230.85 (231.00) 646833
VIJAYA BANK 53.35 (51.60) 1080754
VIP 327.00 (340.85) 286434
VOLTAS 629.40 (630.95) 1181583
ZEE LEARN LI 37.85 (37.75) 234825
ZUARI GLOBAL 182.95 (186.40) 39484

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

AISHWARYA TE 5.75 (5.51) 20091
ALPHAGEO 760 (773.95) 1753
AMAR RAJA BA 793.50 (794.45) 22615
ANDHRA BANK 38.50 (39.50) 350339
ANDHRA CEMEN 10.13 (10.25) 19441
ANDHRA PAPER 289.65 (289.45) 4414
ANDHRA PETRO 57.65 (54.95) 142039
ANDHRA SUGAR 437.90 (454.45) 3344
ANJANI PORTL 177.05 (181.35) 186
ASTRA MICROW 85.05 (85.85) 37679
AUROBINDO PH 592.45 (588.95) 121332
AVANTEL SOFT 524 (529.55) 2824
AVANTI FEEDS 2357.70 (2329.55) 9561
BALAJI AMIN 576 (597.50) 11499
BARTRONICS 11.80 (12.03) 18513
BHAGIRA CHEM 289 (284.75) 550
BHAGYA NAG 47.15 (48.90) 48123
BN RATHI SEC 39.05 (39.50) 548
BRILLIANT SE 8.71 (9.16) 2457980
CAMBRIDGE TE 73.15 (74.60) 4826
CIL SECURI 25.65 (26.55) 1824
COMBAT DRUGS 26 (27) 23
CONT COFFEE 289.15 (293.90) 4169
COROMAN FERT 510.20 (521.95) 8677
CUBEX TUB 23.75 (24.95) 2084
CYBERMATE 2.83 (2.84) 23064
CYIENT LIMIT 621.90 (620.90) 4229
DECCAN CEMEN 541 (540.35) 178
DIVI'S LAB 996.45 (1001.20) 16058
DR REDDY 2130.45 (2145.50) 32295
FOUR SOFT 73.75 (71.65) 1516
GATI CORPN 100.95 (100.95) 64242
GAYATRI PROJ 201.35 (206.55) 11165
GMR INFRASTR 17.10 (17.35) 1998064
GOLDST INFRA 197.05 (197.50) 11794
GOLDSTONE EN 13.65 (13.47) 26012
GRANULES (I) 107.20 (108.15) 105378
GSS AMERICA 55.95 (55.05) 139712
GVK POWER 14.65 (14) 1301375
HBL NIFE POW 49.60 (51.15) 82799
HERITAGE FOO 694.20 (686.05) 541
HIND FLUROCA 10.01 (10.50) 3399
HYD INDUS 1645.40 (1641.70) 1211
IDL INDUSTRS 531 (530.95) 1924
IKF SOFT 0.62 (0.63) 42877
ILFS ENGINEE 37.30 (36.80) 24698
INNAREDY COM 3.10 (3.10) 4512
IVRCL INFRAS 3.90 (4.10) 186797
KAKATIYA CEM 268.65 (263.30) 1437
KALLAM SPG 31.50 (31.25) 93261
KAVERI SEED 479.90 (474.55) 31004
KCP LTD 117.25 (116.85) 6286
KERNEX MICRO 38.20 (38.35) 1360
LANCO INDUS 319 (323.95) 20064
LANCO INFRAT 1.06 (1.10) 1017870
LAURUS LABS 520.25 (517.90) 4483
LOKESH MACH 58.65 (61) 15669
MADHUCON PRO 23.95 (24.95) 25522
MIC ELECTRON 6.12 (5.97) 74016
MOLD-TEK.TEC 55.50 (54.85) 5205
MOLDTK PLA 319.05 (309.10) 1976
NAGARJAGRICH 38.80 (38.30) 9493
NATCO PHARMA 721.05 (717.15) 22466
NAVA BH VENT 146.80 (144.45) 25792
NCC 117.95 (120.10) 347786
NCL IND 219.05 (207.10) 58915
NEHA INTER 6.59 (6.88) 18743
NETTLINX 80.40 (73.30) 61501
NEULAND LAB 715 (698.25) 1465
NIHAR INFO 12.25 (12.60) 13
OIL COUNTRY 37.70 (38.70) 7024
PANKAJ POLY 8.76 (9.22) 1516
PANYAM CEMEN 44.05 (42.60) 11726
PENNER IND 55.25 (54) 115778
PHYTOCHEM I 60.90 (61.80) 3411
PIONEER DIST 183.40 (181.80) 2688
PITTI LAMIN 86.70 (88.10) 13080
POKARNA 198.20 (198.90) 3116
PRAJAY ENGS 13.05 (12.62) 41986
PREMIER EXPL 361 (365.10) 1853
PRISM CEMENT 115.90 (119.65) 65114
PRUDENTL PHA 3.89 (3.86) 215902
RAIN INDUSTR 388.50 (381.90) 393128
RAJ PACKAGIN 35.10 (35) 4262
RAJVIR INDUS 43.55 (48) 201
RAM INFORMAT 41.80 (40.35) 2748
SAGAR CEM 921.80 (921.25) 315
SAMKRG PIST 290.80 (284.25) 3709
SAMPRE NUTRI 53.40 (55) 3516
SATVAH. ISPA 19.95 (20.75) 33747
SMS PHARMA 76.25 (77.80) 7433
SPHERE GLOBA 36.25 (36.50) 16605
SREE RAYAL A 51.85 (52.75) 120326
STARCHIK SP 20.55 (19.60) 1
STEEL EXCHAN 24.40 (25.65) 19086
SUJANA METAL 1.29 (1.35) 29700
SUJANA TOWER 3.56 (3.73) 932
SUJANA UNIVE 0.81 (0.85) 3301
SURANA STRIP 2.34 (2.23) 1001
SURANA TELE 4.90 (5) 1775
SURYALAKSH.C 73 (73.50) 3596
SURYALATA SP 135.60 (138.85) 90
SUVEN PHARMA 176.85 (174.45) 61150
TAJ GVK HOTE 151.70 (153.40) 6444
TANLA 33.45 (33.95) 37720
TERA SOFTWAR 48.90 (50.85) 5748
TRANS BIOTEK 2.35 (2.47) 7592
VBC FERRO 36.65 (37.35) 200
VICEROY HOTE 14 (14.25) 24517
VIJAY TEXTIL 45.30 (47.65) 6312
VIMTA LABS 194.35 (198.35) 3067
VISAKA IND 639 (657.95) 12672
VISTA PHARMA 42.65 (44.10) 35709
VIVIMED LABS 71.90 (70.50) 126803
VST INDUS 2989.20 (2926.40) 160
YBRANT DIGIT 4.99 (5.08) 188484
ZENTECH 132.45 (121) 164585

'భావస్వేచ్ఛ'కు సంకెళ్లు బిగిస్తున్నారు

- 'ఇండియా టుడే' సమాలోచనలో మనసువిప్పిన సోనియాగాంధీ
- దేశం కోసం భావసారూప్య పార్టీలు కలిసిరావాలన్న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్

ముంబయి

ప్రజల భావవ్యక్తీకరణ స్వేచ్ఛపై ఒక పద్ధతి ప్రకారం తీవ్ర దాడి జరుగుతోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో మోదీ సర్కారు విఫలమైందనీ... తిరోగమన దార్శనికత దేశాన్ని నడిపిస్తోందన్నారు. తన పరిధులేంటో తనకు తెలుసనీ.. అందుకే 2004లో మన్మోహన్‌కు ప్రధాని బాధ్యతలను అప్పగించామని చెప్పారు. తాను సహజ వక్తను కానని అంగీకరించారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా భావసారూప్య పార్టీలు స్థానిక విభేదాలను పక్కనపెట్టి కలిసి రావాలన్నారు. రాహుల్‌కు పార్టీ పగ్గాలు అప్పగించిన తర్వాత తీరిగ్గా ఉన్నట్లు చెప్పారు. శుక్రవారమిక్కడ 'ఇండియా టుడే' ఏర్పాటు చేసిన సమాలోచనలో.. 71 సంవత్సరాల సోనియా విభిన్న అంశాలపై తన మనసులోని మాటలను పంచుకున్నారు. ఈ సందర్భంగా అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు.

మోదీకి సలహా ఇచ్చే ధైర్యం చేయలేను

వాజ్‌పేయి హయాంలో మేము బద్ధ శత్రువులం. అయినా, చాలా సామరస్యతతో.. బాగా పని చేశాం. మోదీ నాకు వ్యక్తిగతంగా తెలియదు. ఆయనకు సలహాలివ్వడానికి చాలామంది ఉన్నారు. నేనా ధైర్యం చేయను.

"ప్రజాస్వామ్యం అనుమతించేది భిన్నాభిప్రాయాలను, చర్చలనేగానీ.. స్వగతాలను కాదు. మన సమాజం, మన స్వాతంత్ర్యం ఒక పద్ధతి ప్రకారం తీవ్ర దాడికి గురవుతున్నాయి. ఆలోచించుకునే స్వేచ్ఛ; ఇతరుల ఆలోచనలతో విభేదించే అవకాశం; నచ్చినవారిని కలవడం; నచ్చిన వ్యక్తులను పెళ్లి చేసుకోవడం- ఇవన్నీ ఇప్పుడు పెను దాడికి గురవుతున్నాయి. పాలక పక్షపు (భాజపా) రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఆనాలోచితంగానో, పొరపాటునో వస్తున్నవి కావు. ప్రమాదకర ఎత్తుగడలో భాగంగా సంధిస్తున్నవే. భారతీయ తత్వానికి ప్రతిరూపమైన రాజ్యాంగానికి తూట్లు పొడిచే ప్రయత్నం... వారి వ్యాఖ్యల్లో ధ్వనిస్తోంది.

పార్లమెంటరీ మెజారిటీ సాధించడమంటే.. 'చర్చ'ల గొంతునొక్కేందుకు అనుమతి దొరకిందన్న దుర్భావం నాటుకుపోయింది. అందుకే ప్రత్యామ్నాయ గొంతులు మూగబోతున్నాయి. హింసకూ, హత్యలకు గురవుతున్నాయి. మత విద్వేషాలూ చెలరేగుతున్నాయి.

నేను సహజ వక్తను కాను. 'లీడరు'గా కంటే 'రీడరు'గానే నాకు గుర్తింపు ఎక్కువ.

ఆ వేగం మనకొద్దు

నిజమే. మనం వేగం (ఫాస్ట్)గా ముందుకు దూసుకుపోవాలి. కానీ..'ముందు చేయడం; తర్వాత ఆలోచించడం (ఫస్ట్ యాక్ట్; సెకెండ్ థింక్) అన్నట్టు మాత్రం కాకూడదు.

మోదీ సర్కారు విఫలమైంది...

ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ఎన్డీయే ప్రభుత్వం విఫలమైంది. సమాచార హక్కు చట్టం శీతల గిడ్డంగికి వెళ్లిపోయింది. ఆధార్.. వ్యక్తులను నియంత్రించే సాధనమైపోయింది. విజ్ఞానంతో ముందుకెళ్లాల్సిన మన సమాజంలో ఇప్పుడు శాస్త్రీయత అపహాస్యానికి గురవుతోంది.

ఏదీ మార్పు?

దేశంలో నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో అందరికీ తెలిసిందే. ఉన్నఫళంగా 2017లో 7.5 మిలియన్ ఉద్యోగాలు సృష్టించామని చెబుతున్నారు. ఇదే నిజమైతే.. పరిస్థితి ఎందుకు మారలేదు?

మన్మోహన్ నా కంటే ఉత్తముడనే...

నా పరిధులేంటో నాకు తెలుసు. నాకంటే మన్మోహన్‌సింగే ఉత్తమ సేవలు అందించగలరని భావించా. అందుకే 2004లో ఆయనకు ప్రధాని పగ్గాలు అప్పగించాం. పార్టీ ఆదేశిస్తే 2019లోనూ రాయ్‌బరేలి నుంచే పోటీ చేస్తా.

నూతన విధానంలో ప్రజలకు చేరువవ్వాలి

కొత్త రీతిలో ప్రజలను చేరుకోవడం ఇప్పుడు కాంగ్రెస్ ముందున్న సవాలు. తన పథకాలను, కార్యక్రమాలను పరిరక్షించుకునే మార్గాన్ని అన్వేషించాల్సిన అవసరమూ ఉంది.



ఇప్పుడు విశ్రాంతి పొందుతున్నా

కాంగ్రెస్ సారథ్య బాధ్యతలను రాహుల్‌కు అప్పగించాక... నా భుజాల పైనుంచి భారం దిగిపోయినట్టుంది. ఇప్పుడు విశ్రాంతి పొందుతున్నా. చదువుకోవడం, సినిమాలు చూడ్డం వీలవుతోంది. ప్రస్తుతం... నా భర్త రాజీవ్, అత్తమ్మ ఇందిరలకు సంబంధించిన పత్రాలను సేకరిస్తున్నా. రాజీవ్ బడిలో ఉన్నప్పుడు ఆయనకు అత్తమ్మ రాసిన లేఖలు, ఆయనిచ్చిన సమాధానాలు ఇంట్లో ఉన్నాయి. ఉద్వేగపూరితమైన ఈ లేఖలను డిజిటలైజ్ చేసేపని పెట్టుకున్నా.



అందుకే ఇటలీ వెళ్లాడు

ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ముగించుకుని.. తన అమ్మమ్మను చూడ్డానికని రాహుల్ ఇటలీ వెళ్లాడు. అందుకే ఫలితాల రోజు ఇక్కడ లేడు.

ప్రియాంక ఇష్టం...

నా కుమార్తె ప్రియాంకకు పిల్లలతోనే సరిపోతోంది. రాయ్‌బరేలి, అమేథీ నియోజకవర్గాల్లో ప్రచారానికే ఇప్పటివరకూ ఆమె పరిమితమైంది. భవిష్యత్తులో ఏమో! ఆమె ఇష్టం.

అందుకే ఓడిపోయాం...

ప్రభుత్వ వ్యతిరేకత వల్లే 2014లో ఓడిపోయాం. మోదీ ఉద్ధృతంగా ప్రచారం సాగించారు. ఆ స్థాయిలో మేము మార్కెట్ చేసుకోలేకపోయాం. దీనికితోడు 2జీ స్పెక్ట్రంపై కాగ్ రిపోర్ట్‌ను కొండంతలు చేసి చూపడం తదితర కారణాలూ తోడయ్యాయి.

రాహుల్‌కు బాధ్యత తెలుసు

తన బాధ్యతలేంటో రాహుల్‌కు తెలుసు. నేనేం చెప్పనక్కర్లేదు. అవసరమైతే నా సాయం ఉంటుంది. సీనియర్లను, కొత్తవారిని మేళవించి పార్టీకి పునరుజ్జీవం తెచ్చేందుకు కృషి చేస్తున్నాడు. ఇది క్లిష్టమైన వ్యవహారం. అయినా, దీనిపై స్పష్టతతో ఉన్నాడు. పార్టీలో సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఉండేలా చూస్తున్నాడు.

భారత్ గొప్ప దేశం. చాలా అద్భుతమైన దేశం. ఇది మనందరిది. మన యావత్ శక్తితో దానిని కాపాడుకుందాం. ప్రేమిద్దాం.

మళ్లీ అధికారంలోకి

భాజపా, ఎన్డీయేలను అధిగమించి... 2019లో మా పార్టీ అధికారంలోకి వస్తుంది. ఎన్నికల నినాదాలు, ఉత్తుత్తి హామీలు నాకు గిట్టవు.

గుడులకు వెళ్లడాన్ని ప్రదర్శించుకోలేదు

(గుజరాత్ ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ హిందూ ఆలయాలను సందర్శించడంపై స్పందిస్తూ..) విరోధులు పనిగట్టుకుని కాంగ్రెస్‌ను ముస్లిం పార్టీగా ప్రచారం చేశారు. ఎప్పట్నుంచో గుడులకు వెళ్తున్నా, మేము ఏనాడూ ప్రదర్శించుకోలేదు.

స్థానిక విభేదాలను పక్కన పెట్టాలి

దేశ ప్రయోజనాల దృష్ట్యా... స్థానిక వైరుధ్యాలను పక్కనపెట్టి, భావసారూప్య పార్టీలు కలిసి నడవాలి. వీటని ఏకతాటిపైకి తీసుకురావడం కొరకరాని కొయ్యే. జాతి ప్రయోజనాల గురించి నిస్వార్థంగా ఆలోచిస్తే ఇదేమీ అసాధ్యం కాదు. చాలా పార్టీలతో కలిసి గతంలో పనిచేశాం.

అవునా! నిజమా?

2014, మే 26న భాజపా అధికారంలోకి రాకమునుపటి వరకూ భారత్ అంధకారంలోనే ఉండేదా? ఇందులో ఎంత నిజముంది? భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాతే దేశం అభివృద్ధి పట్టాలెక్కిందా!

అందుకే పార్లమెంటులో గందరగోళం

పార్లమెంటరీ సంప్రదాయాలకు వాజ్‌పేయి ఎంతో గౌరవమిచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారు. పార్లమెంటులో గందరగోళం సృష్టిస్తున్నారని కాంగ్రెస్‌పై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. కానీ, దానికి బలమైన కారణముంది. ఈ ప్రభుత్వానికి 'ఇతరులకు వసతి కల్పించే స్ఫూర్తి' లేకపోవడం వల్లే వారం రోజులుగా ఈ పరిస్థితి నెలకొంది. నేటి 'అచ్ఛేదిన్'... 2004 నాటి భాజపా నినాదం 'ఇండియా షైనింగ్' ఫలితాన్నే తెస్తుంది.

కార్తీ వ్యవహారం నాకు తెలియదు

కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీపై నమోదైన సీబీఐ కేసు వివరాలు తెలియదు. రాజకీయ ప్రత్యర్థులపై కేసులు బనాయించడం ఈ ప్రభుత్వానికి ఆనవాయితీ. న్యాయవ్యవస్థ గందరగోళంలో చిక్కుకుంది.

ఫ్రాన్స్ అధ్యక్షునికి మోదీ ఘన స్వాగతం

దిల్లీ: నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ శుక్రవారం భారత్‌కు విచ్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇక్కడి విమానాశ్రయంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మెక్రాన్‌తో పాటు ఆయన భార్య మేరీ, ఫ్రాన్స్ సీనియర్ మంత్రులు విచ్చేశారు. మెక్రాన్ పర్యటన నేపథ్యంలో- ఫ్రాన్స్ సహకారంతో జైతాపూర్‌లో నిర్మితమవుతున్న అణువిద్యుత్ కర్మాగారంపై రెండు దేశాల మధ్య ఒప్పందంపై సంతకాలు జరిగే వీలుంది. ఉభయ దేశాల మధ్య సంబంధాల బలోపేతం; కలిసికట్టుగా తీవ్రవాదాన్ని ఎదుర్కోవడం; హిందూ మహాసముద్ర ప్రాంతంలో సహకారాన్ని పెంపొందించుకోవడం; తీర ప్రాంతాల భద్రత తదితర అంశాలపై రెండు ప్రభుత్వాలు దృష్టి సారించనున్నాయి. రక్షణ రంగంతో పాటు, అణువిద్యుత్, అంతరిక్ష పరిజ్ఞానం తదితర కీలకాంశాలు రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలకం కానున్నట్లు విదేశీ వ్యవహారాలశాఖ సంయుక్త కార్యదర్శి కె.నాగరాజ్ నాయుడు తెలిపారు.

రూ.27 లక్షలు పలికిన గాంధీజీ ఫొటో

వాషింగ్టన్: భారత జాతిపిత మహాత్మాగాంధీ స్వయంగా సంతకం చేసి ఉన్న అత్యంత అరుదైన ఆయన ఫొటో ఇక్కడ జరిగిన వేలంలో 41,806 డాలర్లు (సుమారు రూ.27 లక్షల పైచిలుకు) పలికింది. అలనాటి కాంగ్రెస్ అధ్యక్షుడు, సహాయ నిరాకరణ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన మదన్ మోహన్ మాలవీయతో కలిసి మహాత్మాగాంధీ నడుస్తూ వెళుతున్న ఈ ఫొటోలను 1931 సెప్టెంబరులో లండన్‌లో తీసినట్లు వేలం నిర్వాహక సంస్థ వెల్లడించింది. అప్పట్లో బ్రిటన్ ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి వెళుతుండగా ఈ ఫొటోను తీశారు. భారత జాతీయ కాంగ్రెస్ తరఫున గాంధీజీ ఆ సమావేశానికి హాజరైనారు. ఈ ఫొటోపై గాంధీ స్వయంగా సంతకం చేశారు.

భాజపా వ్యతిరేక శక్తులను ఏకం చేస్తాం: మమత

కోల్‌కతా: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను ఓటమి పాల్జేయడానికి భాజపా వ్యతిరేక శక్తులన్నిటినీ ఏకం చేసేందుకు తాను యత్నిస్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం నాడిక్కడ స్పష్టం చేశారు. కేంద్రప్రభుత్వ ఆధీనంలో మనదేశం 'సూపర్ ఎమర్జెన్సీ'ని ఎదుర్కొంటోందని ఆమె అన్నారు. జాతీయ రాజకీయాల గురించి చర్చించేందుకు మమతాబెనర్జీ ఎన్సీపీ సీనియర్ నేత ప్రఫుల్ పటేల్‌తో సమావేశమైనారు. ముమ్ముందు 'ఫెడరల్ ఫ్రంట్' ఏర్పాటు అంశం అవకాశం గురించి చర్చించుకున్నట్లు ఆ తర్వాత విలేకరులతో మాట్లాడిన పటేల్, మమతా బెనర్జీలు చెప్పారు. 'పిల్లి మెడలో ఎవరో ఒకరు గంట కట్టాల్సిందే. భాజపాకు వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రతి ఒక్కరు కలిసి రావాలనే మేము కోరుకుంటున్నాం. అలాంటి వారికి మేము అన్నిరకాలుగా సాయపడతాం' అంటూ ఆమె చెప్పారు.

బాలికపై షాపింగ్‌మాల్‌లో అత్యాచారం

మహిళాదినోత్సవం రోజునే మధ్యప్రదేశ్‌లో ఆకృత్యం

ఇండోర్: మహిళా దినోత్సవం రోజునే మధ్యప్రదేశ్‌లో తొమ్మిదేళ్ల బాలిక అత్యాచారానికి గురైంది. ఇండోర్‌లోని ఓ షాపింగ్ మాల్‌లో.. గురువారం అర్జున్ రాథోడ్ అనే యువకుడు ఈ ఆకృత్యానికి పాల్పడ్డాడు. మాల్‌లోని గేమింగ్‌జోన్‌లో ఉద్యోగిగా అతడు పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్కడే ఆడుకుంటున్న బాలికను మాల్‌లోని ఓ మారుమూల ప్రదేశానికి తీసుకువెళ్లి నిందితుడు అత్యాచారం జరిపాడని పేర్కొన్నారు. ఘటన అనంతరం బాధిత బాలిక తన తల్లికి విషయాన్ని తెలియజెప్పిందని.. రాథోడ్‌ను మాల్‌లో ఉన్న వ్యక్తులు పట్టుకుని చితకబాదారని వివరించారు.

బాలికలపై అత్యాచారాలకు పాల్పడితే మరణశిక్ష!

బిల్లును ఆమోదించిన రాజస్థాన్

జైపూర్: పన్నెండేళ్ల లోపు బాలికలపై అత్యాచారాలకు పాల్పడేవారికి మరణశిక్ష విధించేలా రూపొందించిన కీలక బిల్లును రాజస్థాన్ అసెంబ్లీ శుక్రవారం ఆమోదించింది. దేశంలో ఇప్పటికే మధ్యప్రదేశ్ ఇలాంటి బిల్లును ఆమోదించగా రాజస్థాన్ రెండో రాష్ట్రంగా నిలిచింది. బాలికలపై అత్యాచారం, సామూహిక అత్యాచారానికి పాల్పడేవారికి మరణశిక్ష లేదా వరుసగా 14, 20 ఏళ్లకు తగ్గకుండా కఠిన జైలుశిక్ష విధించేలా బిల్లులో పొందుపరిచారు. అలాగే జీవితఖైదుతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉంది.

అవశేషకాలానికి మాత్రమే పన్నురాయితీల వర్తింపు

ఈనాడు, దిల్లీ: ప్రత్యేకహోదా రాష్ట్రాలతో సహా దేశంలోని మిగతా ఏ రాష్ట్రాలకూ జీఎస్‌టీ తిరిగి చెల్లింపు విధానాన్ని అమలుచేయడంలేదని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రతాప్‌శుక్లా ఓ లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాకపోతే గతంలోని సెంట్రల్‌ఎక్సైజ్ విధానం కిందికి వచ్చే యూనిట్లకు ఇదివరకు చెప్పిన గడువులో మిగిలిన కాలానికి 1.7.2017 నుంచి బడ్జెట్‌ద్వారా మద్దతు పలుకుతూ ఒక పథకాన్ని ప్రకటించినట్లు చెప్పారు. సీజీఎస్‌టీ, ఐజీఎస్‌టీ క్రెడిట్‌ను ఉపయోగించుకున్న తర్వాత ఆ సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి చెల్లించిన సీజీఎస్‌టీ, ఐజీఎస్‌టీకి సమానమైన మొత్తం వరకే ఆ రాయితీ పరిమితమై ఉంటుందని పేర్కొన్నారు.

భారత ఐటీ నిపుణులకు ఆహ్వానం పలుకనున్న జపాన్

2 లక్షల ఉద్యోగాలకు అవకాశం

బెంగళూరు: భారత ఐటీ నిపుణులకు జపాన్ ఆహ్వానం పలుకనుంది. తమ దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఐటీ రంగ అవసరాలకు అనుగుణంగా.. భారత్ నుంచి నిపుణులను రప్పించాలని భావిస్తోంది. తమ దేశంలో స్థిరనివాసం ఏర్పరుచుకునేలా వీరికి గ్రీన్ కార్డులనూ జారీచేస్తామని జపాన్ ప్రభుత్వానికి చెందిన జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జేఈటీఆర్ఓ) కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు షిగెకి మాయెడా తెలిపారు. బెంగళూరులో జరిగిన భారత్-జపాన్ వాణిజ్య భాగస్వామ్య సదస్సులో ఆయన ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం జపాన్‌లో 9.2లక్షల మంది ఐటీ నిపుణులున్నారని.. మరో 2లక్షల మంది కోసం తక్షణ డిమాండు ఉందని అన్నారు. 2030 వరకు అవసరమైన నిపుణుల సంఖ్య 8లక్షలకు చేరుతుందని పేర్కొన్నారు. ఈ లోటును పూడ్చుకునేందుకు జపాన్ భారత్ వైపు దృష్టి సారించిందని షిగెకి అన్నారు. అత్యధిక నైపుణ్యాలున్నవారికి తమ దేశం గ్రీన్ కార్డులూ జారీ చేయనుందని. . కేవలం ఒక్క ఏడాది వ్యవధిలోనే శాశ్వత నివాస అనుమతిని ఇవ్వనుందని పేర్కొన్నారు. ఇటు ఈ ఏడాది ఆరంభం నుంచి.. భారతీయులకు వీసా నిబంధనలను జపాన్ మరింత సరళీకరించింది.

మరో మూడు రోజులు సీబీఐ అదుపులోనే కార్తీ

దిల్లీ: మాజీ కేంద్ర ఆర్థికమంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీని.. మరో మూడు రోజులు సీబీఐ (కేంద్ర దర్యాప్తు సంస్థ) అదుపులోనే ఉంచుతూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఆయన్ను సీబీఐ కోర్టులో ప్రవేశపెట్టింది. ఇటు కస్టడీని మార్చి 12 వరకు పొడగిస్తూ న్యాయమూర్తి సునీల్ రానా ఆదేశాలిచ్చారు. కార్తీ బెయిల్ అభ్యర్థనపై విచారణను మార్చి 15కు వాయిదా వేసింది. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన అక్రమ నగదు చలామణీ కేసులో కార్తీకి ఊరట లభించింది. ఆయన్ను అరెస్టు చేయకుండా దిల్లీ హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో తదుపరి విచారణ జరిగే (మార్చి 20) వరకు ఈ రక్షణ కొనసాగుతుందని పేర్కొంది.

'సౌర కూటమి' ఆవిర్భావ సదస్సుకు భారీ సన్నాహాలు

దిల్లీ: అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్‌ఏ) ఆవిర్భావ సదస్సుకు భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. సౌరవిద్యుత్‌ను ప్రోత్సహించేందుకు భారత్-ఫ్రాన్స్‌లు ఉమ్మడిగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు దిల్లీ వేదిక కానుంది. ఈనెల 11న జరిగే సదస్సుకు మొత్తం 23 దేశాల అధినేతలు, ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇప్పటికే పలు దేశాల అధినేతలు దిల్లీ చేరుకుంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారమిక్కడ హైదరాబాద్ హౌస్‌లో మూడు దేశాధినేతలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. రిపబ్లిక్ ఆఫ్ టోగో అధ్యక్షుడు ఫారో ఎస్సోజింగ్మా నసింగ్బే; టువాలు ప్రధాని ఎనెల్ సొపోగా; రిపబ్లిక్ ఆఫ్ వనౌటు ప్రధాని చార్లట్ సవాయ్‌లతో ఆయన భేటీ అయ్యారు. ఫ్రాన్స్ ప్రధాని ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లు ఈ సదస్సును సంయుక్తంగా ప్రారంభిస్తారు. 121 ఐఎస్‌ఏ సభ్య దేశాల్లో సౌర విద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించడం; నిధుల సమీకరణ; సాంకేతిక సహకారం తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తారు.

త్రిపుర పీఠంపై విప్లవ్‌కుమార్

- ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం
- ఉపముఖ్యమంత్రి, మరో ఏడుగురు మంత్రులతో కొలువుదీరిన ప్రభుత్వం
- రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రధాని మోదీ హామీ

అగర్తల: ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో 25ఏళ్ల వామపక్ష పాలనకు తెరదించుతూ కమలనాథుల ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రావటం ఇదే తొలిసారి. ముఖ్యమంత్రిగా విప్లవ్ కుమార్ దేవ్, ఉప ముఖ్యమంత్రిగా జిష్ణు దేవ్ వర్మన్ గురువారం పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. మరో ఏడుగురు మంత్రులతో కూడా గవర్నర్ తథాగతరాయ్ ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిలో అయిదుగురు భాజపాకు, మిగిలిన ఇద్దరు మిత్రపక్షం ఐపీఎఫ్‌టీకి చెందిన వారు. అసోం రైఫిల్స్ మైదానంలో భారీ వేదికపై నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, భాజపా అధ్యక్షుడు అమిత్ షా, ఆ పార్టీ అగ్రనేతలు ఎల్‌కే అడ్వాణీ, మురళీ మనోహర్ జోషిలతో పాటు గుజరాత్, మధ్యప్రదేశ్, అసోం, ఝార్ఖండ్‌లకు చెందిన భాజపా ముఖ్యమంత్రులు విచ్చేశారు. త్రిపుర ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగిన సీపీఎం నేత మాణిక్ సర్కార్ కార్యక్రమానికి హాజరైనప్పటికీ ఇతర వామపక్ష నేతలు ఎవరూ రాలేదు. భాజపా, ఐపీఎఫ్‌టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన జిష్ణుదేవ్ వర్మన్ అసెంబ్లీకి ఎన్నిక కావాల్సి ఉంది. ఆయన పోటీకి దిగిన చరిలం(ఎస్టీ)స్థానంలో సీపీఎం అభ్యర్థి మృతితో పోలింగ్ ఈ నెల 12వ తేదీకి వాయిదా పడింది.



శుక్రవారం అగర్తలాలో త్రిపుర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన అనంతరం ప్రధానిని ఆప్యాయంగా హత్తుకున్న విప్లవ్ కుమార్ దేవ్

వెలుగుల ప్రస్థానం ప్రారంభం: మోదీ

భాజపా ప్రభుత్వ ప్రమాణస్వీకార వేడుకను ప్రధాని నరేంద్ర మోదీ దీపావళి సంబరాలతో పోల్చారు. రాష్ట్రంలో అభివృద్ధి వెలుగుల ప్రస్థానం నేడే ప్రారంభమైందని చెప్పారు. త్రిపుర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం ప్రజలనుద్దేశించి ప్రధాని మోదీతో పాటు భాజపా అధ్యక్షుడు అమిత్ షా, నూతన ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్‌లు ప్రసంగించారు.

మోదీతో మాణిక్ కరచాలనం

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్ కరచాలనం చేయటం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాన విశేషం. కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రధాని మోదీ.. .సభా స్థలి నుంచి వెలుపలికి వెళ్తున్న మాణిక్ సర్కార్‌కు వీడ్కోలు పలికారు. ఎన్నికల ప్రచార సమయంలో పరస్పరం విమర్శలు చేసుకున్న ఈ నేతలు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో హుందాగా ప్రవర్తించటం పలువురిని ఆకట్టుకుంది. అంతేకాకుండా సభా వేదిక వద్ద భాజపా అగ్ర నేతలు అడ్వాణీ, మురళీ మనోహర్ జోషీలు మాణిక్ సర్కార్‌కు చేరోవైపున కూర్చున్నారు. వారిద్దరూ మాణిక్‌తో ముచ్చటిస్తూ కనిపించారు.

విద్యార్థి దశ నుంచే సంఘ్ సేవ

త్రిపుర తొలి భాజపా ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న 48ఏళ్ల విప్లవ్ కుమార్ దేవ్‌కు ఆర్‌ఎస్‌ఎస్‌తో సుదీర్ఘ అనుబంధం ఉంది. రాష్ట్ర పదో ముఖ్యమంత్రి అయిన విప్లవ్ కుమార్ దేశంలోని యువ ముఖ్యమంత్రుల్లో ఒకరుగా నిలిచారు. త్రిపురలోని గోమతి జిల్లా రాజ్‌ధర్ నగర్ గ్రామంలో మధ్యతరగతి బెంగాలీ కుటుంబంలో 1971 నవంబరు 25న విప్లవ్ కుమార్ జన్మించారు. అతని తండ్రి హరదన్ దేవ్ జన్‌సంఘ్‌లో స్థానిక నాయకుడు. ఉదయ్‌పూర్ కళాశాల నుంచి డిగ్రీ పట్టా పొందిన విప్లవ్ 1999లో దిల్లీ వెళ్లి ఆర్‌ఎస్‌ఎస్ పూర్తిస్థాయి కార్యకర్తగా మారారు. 2015లో త్రిపురకు తిరిగి వచ్చిన విప్లవ్‌కు మార్ 2016 జనవరి 6న భాజపా రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. సీపీఎంను ఓడించటంలో కీలక పాత్ర వహించారు. విప్లవ్‌కుమార్ భార్య నితి ఎస్‌బీఐ అధికారిణి. ఈ దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.



ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తున్న దేవ్

కిమ్‌ను కలిసేందుకు సిద్ధమే!

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్: ప్రపంచ రాజకీయాల్లో ఉత్తర, దక్షిణ ధ్రువాలుగా ఉండే ఇద్దరు వ్యక్తులు త్వరలో ఒకే వేదికపైకి రానున్నారు. ఉప్పునిప్పులుగా మండిపడే వారు ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకునేందుకు ప్రాథమికంగా అంగీకరించారు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను కలుసుకునేందుకు సుముఖత తెలిపినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం స్వయంగా వెల్లడించారు. చరిత్రాత్మకంగా నిలిచే ఈ భేటీకి త్వరలోనే రంగం సిద్ధమవుతుందని, స్థలం, సమయం త్వరలోనే ఖరారవుతాయని శ్వేతసౌధాధిపతి తెలిపారు. అయితే, చర్చలకు అంగీకరించినంత మాత్రాన ఉత్తరకొరియాపై విధించిన ఆంక్షలను ఇప్పుడే ఎత్తివేయబోమని, అణునిరాయుధీకరణ ఒప్పందంపై సంతకాలు చేసే వరకూ అవి కొనసాగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. దక్షిణ కొరియా జాతీయ భద్రత సలహాదారు చుంగ్ యి-యంగ్ శుక్రవారం శ్వేతసౌధంలో ట్రంప్‌తో సమావేశం అనంతరం అగ్రరాజ్యాధిపతి నుంచి ఈ ప్రకటన వెలువడింది. అణునిరాయుధీకరణకు సిద్ధంగా ఉన్నామని, ఇక మీదట అణ్వాయుధ, క్షిపణి పరీక్షలు జరపబోమన్న ఉత్తరకొరియా అధ్యక్షుడి సందేశాన్ని ట్రంప్‌కు తెలియజేసినట్లు చుంగ్ యంగ్ వెల్లడించారు. ఆ తర్వాత శ్వేతసౌధం కూడా కిమ్ జోంగ్ ఉన్‌తో ముఖాముఖి భేటీకి ట్రంప్ సంసిద్ధత తెలిపిన విషయాన్ని నిర్ధారించింది. ట్రంప్ కూడా ఈ విషయాన్ని ట్వీట్ చేశారు. ఉత్తర కొరియా, అమెరికా అధ్యక్షుల భేటీ కార్యరూపం దాల్చితే ఆ రెండు దేశాల అధినేతల తొలి సమావేశంగా చరిత్రలో నిలిచిపోతుంది. ఇటీవల తనను కలిసిన దక్షిణ కొరియా ప్రతినిధులతో అణునిరాయుధీకరణకు, క్షిపణుల ప్రయోగాలను నిలిపివేయటానికి తాను సిద్ధంగా ఉన్నట్లు, ట్రంప్‌ను కలుసుకోవాలని భావిస్తున్నట్లు కిమ్ తెలపటంతో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఇద్దరు నేతల భేటీకి రెండు నెలల సమయం పట్టవచ్చని అమెరికా అధికారులు అభిప్రాయపడ్డారు.

సింగపూర్ ప్రధానితో రాహుల్ భేటీ

సింగపూర్: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ శుక్రవారమిక్కడ సింగపూర్ ప్రధాని లీ సియన్ లూంగ్‌తో సమావేశమయ్యారు. భారత్-సింగపూర్ నడుమ సంబంధాలు సహా పలు అంశాలపై వారిద్దరూ విస్తృతంగా చర్చించారు. "ఈ రోజు ఉదయం ప్రధాని లీ సియన్‌ను కలిశా. ఇరు దేశాల సంబంధాలతో పాటు అనేక అంశాలపై కూలంకషంగా మాట్లాడుకున్నాం" అని రాహుల్ గాంధీ ఫేస్‌బుక్‌లో వ్యాఖ్యానించారు. తమ భేటీకి సంబంధించి కొన్ని చిత్రాలనూ పోస్ట్ చేశారు. డిప్యూటీ ప్రధాని షణ్ముగరత్నం, పలువురు మంత్రులు, చట్టసభ్యులతోనూ ఆయన సమావేశమయ్యారు. ఇక్కడి భారతీయ సమాజంతో మమేకమయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే రాహుల్‌గాంధీ మూడు రోజుల పర్యటన నిమిత్తం గురువారం సింగపూర్ వచ్చారు. భారతీయ వ్యాపారవేత్తలు; సింగపూర్ జాతీయ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు.

పాక్ ఉగ్రవాదులపై అమెరికా భారీ రివార్డులు

వాషింగ్టన్: పాకిస్థానీ ఉగ్రవాదులపై అమెరికా ఉక్కుపాదం మోపింది. ముగ్గురు కీలక ఉగ్ర నాయకుల సమాచారం అందించేవారికి భారీ రివార్డులు ప్రకటించింది. పాక్ తాలిబాన్ సంస్థ 'తెహ్రిక్-ఈ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ)' అధిపతి మౌలానా ఫజ్లుల్లాపై 5 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 32.5 కోట్లు) రివార్డును ప్రకటించింది. అలాగే జమాత్ ఉల్-అహ్రార్ నాయకుడు అబ్దుల్ వలీ.. లష్కర్-ఈ-ఇస్లాం ఉగ్రవాద సంస్థకు చెందిన మంగల్ బాగ్‌లపై 3 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 19.5 కోట్లు) వంతున రివార్డులు ప్రకటించింది.

ముషారఫ్‌ను అరెస్టు చేయండి

ఇస్లామాబాద్: పాకిస్థానీ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ అరెస్టుకు ఇక్కడి ప్రత్యేక ట్రైబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఆస్తులను జప్తు చేయాల్సిందిగా పాక్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయనపై దేశద్రోహం నేరానికి సంబంధించిన కేసు విచారణ సందర్భంగా ప్రత్యేక ట్రైబ్యునల్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దేశద్రోహం కేసులో ఆయనను ఇప్పటికే పరారీలో నేరస్తుడిగా ప్రకటించి ఉన్న విషయం గమనార్హం.

కేంద్ర పన్నుల్లో పంచుతున్నది 35శాతం వాటానే

ఈనాడు, దిల్లీ: కేంద్ర పన్నుల్లో వాటాను 14వ ఆర్థికసంఘం సిఫార్సుల ప్రకారం 32శాతం నుంచి 42శాతానికి పెంచినట్లు కేంద్రం పదేపదే చెబుతూ వస్తోంది. కానీ శుక్రవారం లోక్‌సభలో ఓ లిఖితపూర్వక ప్రశ్నకు ఇచ్చిన సమాధానం ప్రకారం కేంద్రం పంచేవాటా 35శాతానికే పరిమితమైనట్లు కనిపిస్తోంది. కేంద్ర నుంచి రాష్ట్రానికి అందే ఆదాయం తగ్గుదలపై కరీంనగర్ ఎంపీ బి.వినోద్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పొన్‌రాధాకృష్ణన్ ఇచ్చిన సమాధానం ఈ వివరాలను బయటపెట్టింది. 14వ ఆర్థికసంఘం సిఫార్సులు అమల్లోకి వచ్చిన 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు గరిష్ఠంగా 35.70శాతం పన్నులనే రాష్ట్రాలకు వాటా రూపంలో పంచినట్లు తేటతెల్లమైంది.

రాష్ట్రాలకు పంపిణీ చేసిన వాటా వివరాలు (రూ. కోట్లలో..)

సం.	మొత్తం పన్ను ఆదాయం	రాష్ట్రాలకు పంచింది	శాతం	ఏపీ	శాతం
2015-16	14,55,648.11	5,06,192.96	34.77	21,893.79	4.32
2016-17	17,15,822.40	6,08,000.31	35.43	26,263.88	4.31
2017-18	18,84,788.15	6,73,005.29	35.70	29,001.25	4.30



శుక్రవారం థాయిలాండ్‌లోని పటాయాలో జరిగిన మిస్ ఇంటర్నేషనల్ 2018 ట్రాన్స్‌జెండర్ పోటీల్లో విజేతగా నిలిచిన గుయెన్ హోంగ్ గియాంగ్‌ను ముద్దాడుతున్న పోటీదార్లు

ఛాంపియన్స్

ఆ పెంపు వెనుక కోహ్లి, ధోని..



దిల్లీ: అనేక తర్జన భర్జనల అనంతరం భారత క్రికెటర్ల జీతాల పెంపు ప్రతిపాదన ఎట్టకేలకు అమల్లోకి వచ్చింది. అన్ని స్థాయిల్లోనూ భారత ఆటగాళ్ల జీతాలు భారీగా పెంచుతూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ విషయంలో కెప్టెన్ కోహ్లి, మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనిల ప్రమేయం కీలకమని అంటున్నాడు బీసీసీఐ పాలకుల కమిటీ ఛైర్మన్ వినోద్ రాయ్. ముఖ్యంగా మూడు ఫార్మాట్లలో ఆడుతూ, నిలకడగా రాణించే ఆటగాళ్ల కోసం 'ఎ+' గ్రేడ్ (రూ.7 కోట్ల వార్షిక వేతనం) తేవడంలో వీళ్లిద్దరి అభిప్రాయాలు కీలకమయ్యాయని రాయ్ చెప్పాడు. "చర్చల సందర్భంగా ఎ+ గ్రేడ్ గురించి కోహ్లి, ధోనీలే సలహా ఇచ్చారు. మూడు ఫార్మాట్లలోనూ ఆడుతూ టాప్-10 ర్యాంకింగ్స్‌లో ఉన్న వాళ్లకు ఇందులో చోటుండాలన్నది వారి ఆలోచన. ప్రదర్శన ఆధారంగానే ఇందులో చోటు దక్కాలని వారు అభిప్రాయపడ్డారు. కాబట్టి ఎవరూ ఇందులో శాశ్వతంగా ఉండే అవకాశం లేదు. బాగా ఆడిన వాళ్లకు ఈ విభాగంలో చోటు దక్కుతుంది. లేదంటే లేదు'' అని రాయ్ అన్నాడు. బీసీసీఐ తాజాగా ప్రకటించిన కాంట్రాక్టుల్లో కోహ్లితో పాటు రోహిత్, ధావన్, భువనేశ్వర్, బుమ్రాలకు ఎ+ గ్రేడ్‌లో చోటు దక్కిన సంగతి తెలిసిందే.

ముక్కోణపు టీ20 సిరీస్‌లో నేడు
శ్రీలంక × బంగ్లాదేశ్
రాత్రి 7 నుంచి డి స్పోర్ట్స్‌లో..



నిరుడు మహిళల వన్డే ప్రపంచకప్ ఆడే సమయానికే మిథాలీ రాజ్ 35వ పడికి చేరువైంది. ఆ టోర్నీనే తన చివరి ప్రపంచకప్ అని స్వయంగా ప్రకటించింది మిథాలి. ఈ టోర్నీతో మిథాలీ కెరీర్‌కు తెరపడినట్లే అనుకున్నారంతా. కానీ ఆ ప్రపంచకప్ ప్రదర్శన ఇచ్చిన ఊపో.. అమ్మాయిల ఆటకు ఆదరణ పెరిగిందన్న ఉత్సాహమో కానీ.. మిథాలీలో ఇప్పుడు కొత్త జోష్ కనిపిస్తోంది. ఇటీవలి దక్షిణాఫ్రికా పర్యటనలో మిథాలీ ఆటే ఇందుకు నిదర్శనం. వన్డే సిరీస్‌లో జట్టును ముందుండి నడిపించిన మిథాలీ.. టీ20 సిరీస్‌లోనూ సత్తా చాటి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు అందుకుంది. 4 మ్యాచ్‌ల్లో 3 అర్ధ సెంచరీలతో అదరగొట్టింది. ఇక సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో వన్డే సమరానికి సిద్ధమైంది. మార్చి 12న వడోదరాలో ఆసీస్‌తో తొలి వన్డే నేపథ్యంలో 'ఈనాడు'తో ముఖాముఖి సందర్భంగా వివిధ అంశాలపై మిథాలీ ఏమందంటే..

వన్డేలంటేనే ఇష్టం

'ఈనాడు'తో మిథాలీ రాజ్

దక్షిణాఫ్రికా పర్యటనపై..

దక్షిణాఫ్రికా సిరీస్‌ను ఆస్వాదించాం. వన్డే, టీ20 సిరీస్ విజయాలతో జట్టులో కొత్త ఉత్సాహం వచ్చింది. విదేశీ గడ్డపై సిరీస్ గెలిస్తే ఆ మజానే వేరు. జట్టులో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. వన్డే, టీ20 సిరీస్‌లలో క్రీడాకారిణులు అద్భుతంగా రాణించారు. బాధ్యతలు పంచుకునేవారి సంఖ్య పెరగడం సానుకూలాంశం.

జట్టు కూర్పుపై..

అనుభవజ్ఞులు.. యువ క్రీడాకారులతో జట్టు బాగుంది. కేవలం అనుభవజ్ఞులు.. కేవలం యువ క్రీడాకారిణులు ఉంటే ఫలితాలు రావు. రెండింటి కూర్పు సరిగ్గా కుదిరినపుడే అత్యుత్తమ ఫలితాలు వస్తాయి. ప్రస్తుత జట్టులో అనుభవం.. యువ రక్తం రెండూ ఉన్నాయి.

3 ఫార్మాట్లలో ఆడటంపై..

ప్రతి ఒక్కరూ ఫార్మాట్‌కు తగ్గట్లు ఆటను మార్చుకోవాలి. టీ20ల్లో ఎక్కువ సమయం ఉండదు. తొలి బంతి నుంచే బాదుడు మొదలుపెట్టాలి. క్రీజులో నిలదొక్కుకునేందుకు పెద్దగా అవకాశం ఉండదు. ప్రతి బంతినీ బాదే క్రమంలో వీలైనన్ని ఎక్కువ షాట్లు ఆడతాం. కొన్ని వినూత్నమైన షాట్లను టీ20ల్లోనే ఆడగలం. వన్డేల్లో అలా కాదు. క్రీజులో కుదురుకోడానికి సమయం ఉంటుంది. మంచి స్థితికి చేరుకున్నాకే షాట్లు ఆడతాం. టీ20 ఫార్మాట్ నా ఫేవరెట్ కాదు. వన్డేలంటేనే నాకిష్టం.

ఆస్ట్రేలియాతో సిరీస్‌పై..

కంగారూలతో సిరీస్ సవాలే. ఆస్ట్రేలియా బలమైన జట్టు. మేం సొంతగడ్డపై ఆడుతున్నా ప్రత్యర్థే మా కన్నా కొంచెం బలంగా ఉంది. దక్షిణాఫ్రికాలో రెండు సిరీస్‌లు గెలిచినా.. ఆసీస్‌ను నిలువరించడం అంత సులువేం కాదు. ఇది ఐసీసీ టోర్నీ. వచ్చే వన్డే ప్రపంచ కప్‌కు అర్హత పాయింట్లు రాబట్టడానికి ఈ సిరీస్ చాలా కీలకం. సొంత గడ్డపై ఆడుతుంటే ఆత్మవిశ్వాసం ఉంటుంది. ఐసీసీ ప్రపంచ కప్ సెమీఫైనల్లో చివరిసారిగా ఆడిన మ్యాచ్‌లో ఆసీస్‌పై పైచేయి సాధించాం. ఆ గెలుపు స్ఫూర్తితో మళ్లీ సత్తా చాటడానికి ప్రయత్నం చేస్తాం. ఐతే ప్రపంచ కప్ తర్వాత చాలా విరామం వచ్చింది. క్రీడాకారిణులు కలిసికట్టుగా ఆడటం ముఖ్యం.

– ఈనాడు, హైదరాబాద్

మహిళల క్రికెట్ 12 నుంచి

భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య పరిమిత ఓవర్ల క్రికెట్‌కు రంగం సిద్ధమైంది. భారత్, ఆస్ట్రేలియా.. మూడు వన్డేల సిరీస్‌తో పాటు.. ఇంగ్లాండ్‌తో కలిసి ముక్కోణపు టీ20 సిరీస్‌లో తలపడనున్నాయి. వన్డే సిరీస్‌కు వదోదర వేదిక. టీ20 సిరీస్‌కు ముంబయి ఆతిథ్యమివ్వనుంది. ఈ నెల 12 వన్డే సిరీస్ ఆరంభం కానుంది.

భారత్‌కు ఐర్లాండ్ షాక్

అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్

ఇపో (మలేసియా): అజ్లాన్‌షా హాకీ టోర్నమెంట్లో భారత్‌కు షాక్. పతక ఆశలు ఆవిరయ్యాయి. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-3 గోల్స్‌తో ఐర్లాండ్ చేతిలో పరాజయం చవిచూసింది. ఈ మ్యాచ్‌లో రెండుసార్లు (10వ ని, 26వ ని) ఆధిక్యంలో నిలిచిన భారత్.. ఆ అవకాశాలను సొమ్ము చేసుకోలేక ఓటమి మూటగట్టుకుంది. ఐర్లాండ్ చేతిలో భారత్ ఓడడం ఇదే తొలిసారి. మ్యాచ్ పదో నిమిషంలో లభించిన పెనాల్టీకార్నర్‌ను వరుణ్ కుమార్ సద్వినియోగం చేయడంతో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ షేన్ డొనొగె (24వ ని) కొట్టిన గోల్‌తో ఐర్లాండ్ స్కోరు సమం చేసింది. అయితే వారి ఆనందాన్ని ఆవిరి చేస్తూ మరో రెండు నిమిషాలకే అమిత్ రోహిదాస్ గోల్ సాధించడంతో భారత్ 2-1తో మరోసారి ఆధిక్యంలో నిలిచింది. మూడో క్వార్టర్‌లో ఐర్లాండ్ ఎదురుదాడికి దిగింది. వరుస దాడులతో అవకాశాలు సృష్టించుకుంది. సీన్ ముర్రే (36వ ని) కొట్టిన గోల్‌తో స్కోరు సమం చేసిన ఐర్లాండ్.. షేన్ డొనొగె (42వ ని) మరోసారి పెనాల్టీకార్నర్‌ను గోల్‌గా మలచడంతో 3-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత స్కోరు సమం చేయడానికి భారత్ ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ పరాజయంతో పతకం రేసుకు దూరమైన భారత్.. ఇక వర్గీకరణ మ్యాచ్‌లు ఆడనుంది.



మెరిసిన మహిళల జట్టు

సియోల్: పురుషుల హాకీ జట్టు వరుస పరాజయాలతో అజ్లాన్‌షా టోర్నీ నుంచి పతక రేసుకు దూరమైతే.. మరోవైపు కొరియా పర్యటనలో మహిళల జట్టు మాత్రం తమ విజయ యాత్ర కొనసాగిస్తోంది. ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన నాలుగో మ్యాచ్‌లో రాణి రాంపాల్ నేతృత్వంలోని భారత జట్టు 3-1తో కొరియాను ఓడించి.. సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంది. గుర్జిత్ కౌర్ (2వ ని) ఆరంభంలోనే గోల్ కొట్టి భారత్‌కు శుభారంభం అందించింది. ఆ వెంటనే దీపిక (14వ ని) గోల్ చేసి ఆధిక్యం రెట్టింపు చేసింది పూనమ్ రాణి (47వ ని) ఫీల్డ్ గోల్‌తో భారత్ 3-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. చివర్లో మి హ్యుయన్ (57వ ని) గోల్ చేసినా అప్పటికే భారత్ విజయం ఖరారైంది. ఈ సిరీస్‌లో ఆఖరి మ్యాచ్ ఆదివారం జరుగుతుంది.

అంజుమ్‌కు రజతం

- సీనియర్ షూటింగ్ ప్రపంచకప్



దిల్లీ: మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ సీనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత జోరు కొనసాగుతోంది. శుక్రవారం మహిళల 50మీ. రైఫిల్ త్రీ పోజిషన్స్ విభాగంలో అంజుమ్ ముద్గిల్ రజతం సొంతం చేసుకుంది. ఫైనల్ రౌండ్లో అంజుమ్ 454.2 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆమెకిదే తొలి ప్రపంచకప్. అర్హత రౌండ్లో రెండో స్థానంలో నిలిచి ఫైనల్ చేరిన అంజుమ్.. తుది పోరులోనూ చక్కటి ప్రదర్శన చేసింది. చైనా షూటర్లు.. రుజియో (455.4), టింగ్ సన్ (442.2) పసిడి, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. పురుషుల 25మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో భారత్‌కు నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో పతకం సాధిస్తాడని ఆశలు పెట్టుకున్న అనీశ్ భన్‌వాలా అర్హత రౌండ్లో ఏడో స్థానంలో నిలవడంతో ఫైనల్ చేరలేకపోయాడు. ఇప్పటివరకూ టోర్నీలో భారత్ ఎనిమిది పతకాలు (3 స్వర్ణాలు, 1 రజతం, 4 కాంస్యాలు) సాధించింది.

అంతా అబద్ధం

వెంగ్‌సర్కార్ ఆరోపణలపై శ్రీనివాసన్

చెన్నై: భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ పదవి నుంచి తప్పుకోవడానికి కారణమయ్యానంటూ తనపై భారత మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ చేసిన ఆరోపణలపై బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్ స్పందించాడు. వెంగీ అబద్ధమాడుతున్నాడని.. అతడి ఆరోపణల్లో ఆంతర్యమేంటో అర్థం కావడం లేదని శ్రీని అన్నాడు. "వెంగీ ఎవరి తరపున ఇలా మాట్లాడుతున్నాడు? అతడి ఉద్దేశమేంటి? ఏదైనా కానివ్వండి.. అతడి మాటల్లో నిజం లేదు. ఒక క్రికెటర్ ఇలా మాట్లాడటం బాగోదు. తాను సెలక్షన్ కమిటీలో కొనసాగకపోవడానికి నేనే కారణమన్న ఆరోపణ వాస్తవం కాదు. వెంగీ ఇప్పుడు దీని గురించి మాట్లాడటంలో ఆంతర్యమేంటి? నేనెప్పుడూ సెలక్షన్ విషయాల్లో జోక్యం చేసుకోలేదు. వెంగీతో నాకు ఎలాంటి శత్రుత్వం లేదు. ఒక క్రికెటర్‌గా వెంగీని గౌరవించాను. ఒక జాతీయ హీరోగా గుర్తించాను. అతడిలా మాట్లాడటం బాధాకరం'' అని శ్రీనివాసన్ అన్నాడు. 2008లో తమిళనాడు ఆటగాడు బద్రీనాథ్‌ను కాకుండా కోహ్లిని భారత జట్టులోకి ఎంపిక చేయడాన్ని కెప్టెన్ ధోనితో పాటు అప్పుడు బీసీసీఐ కోశాధికారిగా ఉన్న శ్రీనివాసన్ వ్యతిరేకించారని, అందుకే చీఫ్ సెలక్టర్‌గా తన పదవి ఊడిందని వెంగీ ఆరోపించిన సంగతి తెలిసిందే.



తల్లిగా తొలి గెలుపు

ఇండియన్‌వెల్స్: బిడ్డకు జన్మనిచ్చిన 15 నెలల విరామం తర్వాత మళ్లీ ప్రొఫెషనల్ టెన్నిస్‌లోకి అడుగుపెట్టిన అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్ శుభారంభం చేసింది. ఇండియన్‌వెల్స్ టోర్నీ తొలి మ్యాచ్‌లో ఆమె 7-5, 6-3తో వరుస సెట్లలో జరినా దియాజ్‌ను ఓడించింది. ఈ టోర్నీలో అన్‌సీడెడ్‌గా బరిలో దిగిన సెరెనా.. మ్యాచ్ ఆడుతున్నప్పుడు కేరింతలతో స్టేడియం హోరెత్తింది. అభిమానులు నిలబడి చప్పట్లతో ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ టోర్నీలో ఆడడం సెరెనాకు గత పదిహేడేళ్లలో ఇది మూడోసారి మాత్రమే. శక్తిమంతమైన షాట్లతో అలరించిన ఆమె.. తొలి సెట్ పదకొండో గేమ్‌లో దియాజ్ సర్వీసు బ్రేక్ చేసింది.. ఆపై 7-5తో సెట్ గెలుచుకుంది. తర్వాత రెండో సెట్లో మరోసారి ఆరంభంలోనే బ్రేక్ సాధించిన సెరెనా.. 6-3తో సెట్‌తో పాటు మ్యాచ్ గెలుచుకుంది.

షమిపై కేసు నమోదు



హసీన్

కోల్‌కతా: టీమ్ఇండియా పేసర్ మహ్మద్ షమిపై శుక్రవారం పోలీసు కేసు నమోదైంది. అతడి భార్య ఫిర్యాదు మేరకు షమితో పాటు మరో నలుగురిపై వివిధ బెయిలబుల్, నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కోల్‌కతా పోలీసులు కేసు దాఖలు చేశారు. "షమి భార్య హసీన్ జహాన్ లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. అతడితో పాటు మరో నలుగురిపై హత్యాయత్నం, గృహ హింసతో పాటు పలు సెక్షన్ల కింద జాధవ్‌పూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది" అని కోల్‌కతా సంయుక్త పోలీసు కమిషనర్ ప్రవీణ్ త్రిపాఠి చెప్పాడు. షమి అన్న తనపై గతేడాది అత్యాచారం చేశాడని హసీన్ ఫిర్యాదు చేయడంతో అతనిపై అత్యాచార కేసు పెట్టారు. అభియోగాలన్నీ రుజువైతే షమికి కనీసం పదేళ్ల జైలు శిక్ష పడొచ్చు. షమిని హసీన్ రెండో పెళ్లి చేసుకుంది. అతడితో పెళ్లికి ముందే ఆమెకు ఇద్దరు కూతుళ్లున్నారు. "నా మొదటి భర్తతో ప్రస్తుతం నాకెలాంటి సంబంధాలు లేవు. ఇద్దరు కూతుళ్లలో ఒకరు నాతో ఉండగా.. ఇంకో అమ్మాయి వేరే చోట చదువుకుంటోంది" అని హసీన్ వివరించింది.

అవన్నీ అబద్ధాలే: హసీన్ తనపై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని.. వాటిలో అర్థం లేదని షమి అన్నాడు. "గత ఐదేళ్లుగా తనని హింసిస్తున్నానని చెప్పింది, కానీ మా వివాహమై నాలుగేళ్లే అవుతోంది" అని అతను తెలిపాడు. "ఐదేళ్లుగా ఇలా జరుగుతుంటే ముందే ఎందుకు బయటకు రాలేదు. ఇతర మహిళలకు పంపానంటూ సామాజిక మాధ్యమాల్లో నా పేరుతో కనిపిస్తున్న సందేశాలు నేను పెట్టినవి కావు. అది నా ఫోన్ కాదు, నా నంబరు కూడా కాదు. ఆ సందేశాలు నేను పంపలేదు. కాబట్టి చేయని తప్పును ఒప్పుకోను. నేను కుటుంబంతో ఎలా ఉంటానో అందరికీ తెలుసు. ఆరోపణలన్నీ.. నాపై బురద చల్లే ప్రయత్నంలో భాగమే అనిపిస్తోంది. నేనెప్పుడూ నా భార్య, కూతురుతో సమయాన్ని ఆస్వాదిస్తా. హోళీ అయినా మరే ఇతర పండగైనా నేను కుటుంబంతోనే గడిపా. నాపై ఇంతలా ఆరోపణలు చేస్తున్నప్పటికీ తనకు అండగా ఉంటా" అని షమి చెప్పాడు.



ఐపీఎల్ నుంచి తప్పిస్తారా?: భార్యను చంపించడానికి ప్రయత్నించాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న షమి కెరీర్ చిక్కుల్లో పడనుందా? అతడిని ఐపీఎల్ నుంచి తప్పించే అవకాశాలున్నాయా?.. అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి. అతను ప్రాతినిధ్యం వహిస్తున్న దిల్లీ డేర్‌డెవిల్స్ ఈ దిశగానే ఆలోచిస్తోంది. "ఇది సున్నితమైన అంశం. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేం. ఆటగాళ్లతో మాకు కాంట్రాక్టు ఉంది. దాని ప్రకారం టోర్నీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవచ్చు. ఈ కేసులో షమి తన నిజాయితీని నిరూపించుకోవాలి. బీసీసీఐ అభిప్రాయం తీసుకుంటాం" అని దిల్లీ జట్టు ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇప్పటికే షమిని బీసీసీఐ కాంట్రాక్టుల జాబితా నుంచి తప్పించిన సంగతి తెలిసిందే.

డేర్‌డెవిల్స్‌లో సగభాగం జేఎస్‌డబ్ల్యూకు!

దిల్లీ: ఐపీఎల్ ఫ్రాంఛైజీ దిల్లీ డేర్‌డెవిల్స్ యాజమాన్యం వాటాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటివరకు వందశాతం వాటా కలిగిన జీఎమ్ఆర్ సంస్థలో 50 శాతం వాటా జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ కొనుగోలు చేసింది. ఈ మేరకు రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఐపీఎల్ ప్రారంభమైన తర్వాత ఒక ఫ్రాంఛైజీ తన వాటాను అమ్మడం ఇదే తొలిసారి. అయితే ఈ ఒప్పందానికి బీసీసీఐ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. దిల్లీ జట్టును మరింత ముందుకు తీసుకుపోవడానికి ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని జీఎమ్ఆర్ గ్రూప్ తెలిపింది.



రబాడ (5/96)

రబాడ విజృంభణ.. ఆసీస్ 243

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియా చేతిలో తొలి టెస్టులో కంగుతిన్న దక్షిణాఫ్రికా.. రెండో టెస్టును ఆశావహ దృక్పథంతో ఆరంభించింది. ఫాస్ట్‌బౌలర్ కాగిసో రబాడ (5/96) విజృంభించడంతో ఆతిథ్య దక్షిణాఫ్రికా.. ఆస్ట్రేలియాను తొలి ఇన్నింగ్స్‌లో 243 పరుగులకే ఆలౌట్ చేసింది. ఓపెనర్లు డేవిడ్ వార్నర్ (63), బాన్‌క్రాఫ్ట్ (38) శుభారంభాన్నందించినా.. మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమవడంతో ఆసీస్ తక్కువ స్కోరుకే ఆలౌటైంది. మిడిలార్డర్లో టిమ్ పైన్ (36) పోరాడటంతో ఆసీస్ 200 దాటగలిగింది. సఫారీ బౌలర్లలో రబాడతో పాటు ఎంగిడి (3/51), ఫిలాండర్ (2/25) కూడా రాణించారు. కెరీర్లో చివరి టెస్టు సిరీస్ ఆడుతున్న మోర్నీ మోర్కెల్‌ను ఈ మ్యాచ్‌కు దక్షిణాఫ్రికా తుది జట్టులోకి తీసుకోలేదు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి మార్క్రమ్ (11) వికెట్ నష్టపోయి 39 పరుగులు చేసింది. ఎల్గర్ (11), రబాడ (17) క్రీజులో ఉన్నారు.

రాజధాని నిర్మాణానికి మొండిచేయి

- అమరావతికి రైతులిచ్చిన భూముల విలువ రూ.40 వేల కోట్లు
- కేంద్రం ఇచ్చిన నిధులు రూ.2500 కోట్లు
- దృశ్య శ్రవణ సమావేశంలో సీఎం చంద్రబాబునాయుడు



సచివాలయం నుంచి మంత్రులు, కార్యదర్శులు, వివిధ శాఖాధిపతులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు - అమరావతి

రైతులు 33 వేల ఎకరాలను భూ సమీకరణలో ఇస్తే వారి త్యాగనిరతికి కూడా కనీసం గౌరవం ఇవ్వకుండా రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయింపులో మొండి చేయి చూపారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. వెలగపూడిలోని సచివాలయంలో శుక్రవారం మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులు, జిల్లా కలెక్టర్లతో ఆయన దృశ్య శ్రవణ సమావేశం నిర్వహించారు. "రాజధానికి ఏం ఖర్చు పెట్టారు అని అడుగుతున్నారు. కేంద్రం మనకు ఇచ్చింది కేవలం రూ.2500 కోట్లే. ఆ నిధులు కన్నా ఎక్కువగా రూ.40 వేల కోట్ల విలువైన భూములను రైతులు ఇచ్చారు. కేంద్రం వైఖరి పరిశీలించాకే తెదేపా మంత్రులతో రాజీనామా చేయించాం..." అని వెల్లడించారు. మూడేళ్ల 9 నెలల్లో రాష్ట్ర తలసరి ఆదాయాన్ని అదనంగా రూ.50 వేల మేర పెంచామన్నారు.

రెండు రోజుల్లో వినియోగపత్రాలివ్వాలి: కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రెండు రోజుల్లో వినియోగపత్రాలు పంపించాలని, అవి కూడా ఎక్కడా సందేహాలకు తావు లేకుండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కేంద్రానికి పంపించే వినియోగపత్రాల వివరాలన్నింటినీ సీఎం డ్యాష్‌బోర్డులో పొందుపరచాలన్నారు. దిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాశ్ మాట్లాడుతూ రూ.400 కోట్లకు సంబంధించిన వినియోగపత్రాలు పంపిస్తే రూ.2536 కోట్లు విడుదలవుతాయని, 16 పథకాలకు సంబంధించి 6-12 నెలలుగా, 5 పథకాలకు సంబంధించి ఆరు నెలలుగా వినియోగపత్రాలు పంపలేదని వివరించారు.

గుంటూరు ఘటన ప్రభుత్వ వైఫల్యమే: "గుంటూరులో అతిసారం బారిన పడి ఎనిమిది మృతి చెందిన ఘటన ప్రభుత్వ వైఫల్యం కిందకే వస్తుంది. బాధ్యులపైన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వంపైన వ్యతిరేక భావన ఏర్పడుతుంది. రాబోయే మంత్రివర్గ సమావేశానికి పూర్తి వివరాలతో రావాలి..." అని సీఎం అధికారులను ఆదేశించారు. పురపాలక శాఖ డైరెక్టర్ కన్నబాబు మాట్లాడుతూ ఇప్పటికే 8 మందిని సస్పెండ్ చేశామని, నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపైన పూర్తి చర్యలు తీసుకుంటామన్నారు. మెరుగైన, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఈ నెలాఖరులోగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కోరారు.

- "రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది అక్టోబర్ 2వ తేదీ నాటికి భూధార్ జారీ ప్రక్రియను పూర్తి చెయ్యాలి. తొలిసారిగా ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన జగ్గయ్యపేట మండలంలో మార్చి 31వ తేదీ నాటికి పూర్తి చేయాలి. మే 31వ తేదీకి కృష్ణా జిల్లాలో పూర్తి చెయ్యాలి..." అని సీఎం పేర్కొన్నారు.
- "ఏప్రిల్ నాటికి అన్ని జిల్లాలు బహిరంగ విసర్జ నరహితంగా (ఓడీఎఫ్) మారాలి. చివరి స్థానంలో ఉన్న విజయనగరం జిల్లాకు వచ్చినప్పుడు అక్కడ చివరి మరుగుదొడ్డి నిర్మించుకున్న వ్యక్తికి అవార్డును అందిస్తా. కడప, విజయనగరం, కర్నూలు జిల్లాలు వెనుకవరుసలో ఎందుకున్నాయో కలెక్టర్లు సమాధానం చెప్పాలి..." అని సీఎం ప్రశ్నించారు.
- ఉపాధి పథకం అమలులో కర్నూలు, అనంతపురం, కడప, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు వెనుకంజలో ఉండటంపై కలెక్టర్లను ప్రశ్నించగా వ్యవసాయపనులు ఉండటంతో కూలీలు రావటం లేదని వివరణ ఇచ్చారు.
- రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ విభాగాధిపతుల పోస్టులు ఖాళీగా ఉండరాదన్నారు. ఏ జిల్లాలో ఏయే పోస్టులు ఖాళీగా ఉన్నాయో ఆ వివరాలను పంపించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వాటిల్లో తక్షణమే అధికారులను నియమించే బాధ్యతలను సంబంధిత శాఖల రాష్ట్ర విభాగాధిపతులు, మంత్రులు తీసుకోవాలన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కాగితరహితంగా అన్నీ ఈ-కార్యాలయంలోనే పని చేయాలన్నారు. ఇవి సరిగ్గా పనిచేయడం లేదని పలువురు అధికారులు ఫిర్యాదు చేయగా... నేషనల్ ఇన్ఫర్‌మేటిక్ కేంద్రం అధికారులపైన సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లౌడ్, ఫైబర్ తదితర మౌలికవసతులకు సంబంధించి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
- మనం రూపొందించిన సీఎఫ్ఎంఎస్ (కాంప్రిహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) పేటెంట్ హక్కులు పొందాలని చెప్పారు.
- సగటున ఒక్కో దస్త్రం పరిష్కారానికి 24 గంటల లోపు సమయం తీసుకుని పరిష్కరించిన మంత్రులు ఎనిమిది మంది ఉన్నారని సీఎం వెల్లడించారు. ఇది మంచి పరిణామమని వ్యాఖ్యానించారు. నారాయణ, చినరాజప్పలు రెండు గంటల సమయం తీసుకుని అగ్రస్థానంలో నిలవగా... నారా లోకేష్ (3 గంటలు) , అచ్చెన్నాయుడు (8), దేవినేని- సుజయ్‌రంగారావు (9), మాణిక్యాలరావు (10 గంటలు) కాలవ శ్రీనివాసులు (22 గంటలు) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు. సగటున ఒక్కో దస్త్రం పరిష్కారానికి ఎక్కువ సమయం తీసుకున్న మంత్రుల జాబితాలో గంటా శ్రీనివాసరావు, పరిటాల సునీత అట్టడుగున ఉన్నారు. విభాగాధిపతుల్లో సిద్ధార్థజైన్ కేవలం గంటలోనే దస్త్రాలను పరిష్కరించడం పట్ల, ఆర్థిక శాఖలోనూ త్వరితగతిన దస్త్రాలు పరిష్కరించడంపై ముద్దాడ రవిచంద్రను సీఎం అభినందించారు. మంత్రులు తీసుకున్న సమయం వివరాలు **ఈనాడు.నెట్‌లో..**

'నారీ శక్తి పురస్కార' గ్రహీతలు ప్రధానమంత్రి నరేంద్రమోదీని శుక్రవారం నాడిక్కడ కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న పురస్కారగ్రహీతలందరినీ అభినందించారు.

అమ్మకు అండగా 'అంగన్‌వాడీలు'

- పోషకాహార కార్యకర్తలుగా కొత్త బాధ్యతలు
- 10 రకాల వీడియో సందేశాలతో శిక్షణ
- అనంతరం వారితో మహిళలకు అవగాహన

ఈనాడు అమరావతి: మహిళగా అమ్మతనంతోనే పరిపూర్ణత అని వివాహిత విశ్వసిస్తుంది. గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ పుట్టబోయే ముందు... పుట్టిన తర్వాత కూడా ఆ బిడ్డ సంపూర్ణ ఆరోగ్యం కోసం కంటికి రెప్పలా వ్యవహరిస్తుంది. అమ్మకంత ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో అమ్మకోసం అనే కార్యక్రమానికి రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ శ్రీకారం చుట్టింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. గర్భిణులు ఆరోగ్య పరిరక్షణలో, బాలింతలు పోషకాహారం విషయంలో, తల్లులు చిన్నారుల పెంపకంలోను తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధానోద్దేశం. శిక్షణ పొందిన అంగన్‌వాడీ కార్యకర్తలు వారికి ఈ మేరకు అవగాహన కల్పించాలి. అంగన్‌వాడీ కార్యకర్త అంటే అంగన్‌వాడీ కేంద్రంలో అన్నం వండి వడ్డించడం కాదని వారు పోషకాహార కార్యకర్తలుగా మారాలనేదీ ఈ పథకంలో మరో లక్ష్యం. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించడంలో సఫలీకృతమైతే వారు మహిళలను సులభంగా చైతన్యపరచగలరని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే వారి కోసం ఈ లక్ష్యాలకు సంబంధించి 10 రకాల వీడియో సందేశాలను తయారు చేసింది. ఒక్కోటి 2:30 నిమిషాల నిడివితో ఉన్నాయి. వీటిని రాష్ట్రవ్యాప్తంగా 44వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తల వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేయనున్నారు.

వీడియో సందేశాల్లో కొన్ని..: బిడ్డ పుట్టిన రోజు నుంచి ఆరోనెల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. కనీసం నీటి చుక్క కూడా పసిబిడ్డకు ఇవ్వరాదు. ★ బలహీన నవజాత శిశువులను గుర్తించడం, వారి సంరక్షణ. ★ రక్తహీనత సమస్య ఉన్న మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు. ★ పిల్లల్లో పెరుగుదల పర్యవేక్షణ. ★ పరిశుభ్రత, అంటువ్యాధుల నివారణ తదితరాలు.

పెళ్లింట పెను విషాదం

- ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- వరుడు సహా అయిదుగురి దుర్మరణం

కొణిజర్ల - న్యూస్‌టుడే

ఇష్ట దైవం సన్నిధిలో పెళ్లి వేడుక ముగిసింది. సుదూరాన ఉన్న ఇళ్లకు వాహనాలు బయల్దేరాయి. గమ్యం చేరువవుతోంది. ముందే ఇళ్లకు చేరిన వారిని 'కొత్తజంటతో బయల్దేరిన వాహనం ఇంకా ఇంటికి చేరలేదేమన్న' సందేహం వెంటాడుతోంది. వారి కన్నా ముందే.. వరుడి సహా ఐదుగురి మరణ వార్త ఆ ఇంటి తలుపు తట్టడంతో పెళ్లి ఇళ్లు రోదనలతో మార్మోగింది.

కారు చెట్టును ఢీకొనడంతో వరుడు సహా అయిదుగురు మృత్యువాత పడగా.. వధువు సహా మరో అయిదుగురు గాయపడ్డారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సమీపంలో శుక్రవారం వేకువజామున ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వరంగల్ గ్రామీణ జిల్లా వర్ధన్నపేటకు చెందిన అచ్చి రామకృష్ణప్రసాద్ (34), తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన అమ్మాజీ దుర్గల వివాహం పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని పాతూరు కేశవస్వామి ఆలయంలో గురువారం రాత్రి జరిగింది. కల్యాణం అనంతరం నూతన వధూవరులతోపాటు.. బంధువులు వేర్వేరు వాహనాల్లో వర్ధన్నపేటకు కార్లలో బయల్దేరారు. వధూవరులు ప్రయాణించే కారు ఖమ్మం జిల్లా కొణిజర్ల పోలీస్ స్టేషన్ సమీపంలో అదుపుతప్పింది. కుడి వైపునకు దూసుకొచ్చి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. ఢీకొన్న వేగానికి కారు ముందు భాగం నుజ్జయింది. వధువు, చిన్నారుల ఆర్తనాదాలు విని అటుగా వెళ్లే స్థానికులు కారులో ఇరుక్కున్న వారిని బయటకు లాగారు. అప్పటికే కారు నడుపుతున్న వరుడు రామకృష్ణప్రసాద్(34), అతని చెల్లెలు శ్రీదేవి(32), బావ కోమాండురు శరత్(38), అక్క శేషం పద్మ(42), డ్రైవర్ వడ్లకొండ వేణు(38) మరణించారు. వధువు దుర్గ, వరుడి పెద్ద బావ శేషం చలపతి తీవ్రంగా గాయపడగా.. చలపతి కుమారుడు రామన్, శ్రీదేవి పిల్లలు మహతి, క్రిష్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చలపతి, దుర్గలను ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రిలో ప్రాథమిక వైద్యం చేయించిన అనంతరం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు.



మృతులు రామకృష్ణ ప్రసాద్, పద్మ, శ్రీదేవి,శరత్, వేణు(పాత చిత్రాలు)

డ్రైవర్ అస్వస్థతతో

'ప్రమాదం జరిగిన కొద్ది నిముషాల ముందే డ్రైవర్ అస్వస్థతకు గురయ్యాడు. తప్పనిసరి పరిస్థితుల్లో వరుడు రామకృష్ణ ప్రసాద్ వాహనం నడిపాడు.' అని పోలీసులు వెల్లడించారు. వరుడి అక్క శేషం పద్మ కుటుంబం వర్ధన్నపేటలో నివసిస్తుండగా.. చెల్లెలు శ్రీదేవి కుటుంబం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో నివసిస్తోందని తెలిపారు.

ఏడడుగులు వేసిన ఏడు గంటల్లోపే

వివాహం గురువారం రాత్రి 10.26 గంటలకు జరిగింది. అర్ధరాత్రి ఒంటి గంట దాటాక అందరూ మూడు కార్లలో వర్ధన్నపేటకు బయల్దేరారు. తెల్లవారుజామున 4.30 ప్రాంతంలో ఖమ్మం జిల్లా తల్లాడ వద్ద అన్ని వాహనాలు ఆగాయి. అందరూ అక్కడే కాసేపు విశ్రాంతి తీసుకోవడంతోపాటు టీ తాగారు. అక్కడ్నుంచి మిగిలిన బంధువులు ముందు వెళ్లగా.. కాసేపు తర్వాత వరుడి వాహనం బయల్దేరింది. తర్వాత కొద్దిసేపటికే సుమారు 5.30 ప్రాంతంలో ప్రమాదం జరిగింది. 'ప్రమాదానికి వేగం, నిద్రలేమి కారణమై ఉండొచ్చని భావిస్తున్నాం. ప్రమాదం జరిగిన సమయంలో అందరూ నిద్రలోనే ఉన్నారు. ఏం జరిగిందో తెలిసేలోపే అయిదుగురు మృత్యువాతపడ్డారు.' అని పోలీసులు తెలిపారు. మృతదేహాలను ఖమ్మం పెద్దాసుపత్రిలో పంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు.

పోరాట పటిమే విజయానికి సోపానం

- ఎంచుకున్న రంగంలో పట్టుదలతో ముందుకెళ్లాలి
- విద్యార్థులకు ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళి సూచన

నారాయణవనం, న్యూస్‌టుడే: 'ఎంచుకున్న రంగంలో చివరి వరకు విద్యార్థులు పట్టుదల, పోరాట పటిమతో ముందుకెళితే విజయం తప్పక వరిస్తుంది' అని ప్రముఖ సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. చిత్తూరు జిల్లా పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల జుబిలేషన్ కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిజాయతీగా ఉంటూ.. మన చుట్టూ ఉన్న సమాజాన్ని అర్థం చేసుకుని ముందుకెళితే ఏ రంగంలోనైనా రాణించగలమన్నది తన నమ్మకమని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. సైన్సుఫిక్షన్ సినిమా ఎప్పుడు తీస్తారు అనే ప్రశ్నకు సమాధానమిస్తూ... ఏదీ అనుకొని తీయనని, కథ నచ్చిన తరవాతే ఎలా తీయాలని ఆలోచిస్తానని చెప్పారు. త్వరలోనే కొత్త కుర్రాళ్లతో సినిమా చేస్తానని తెలిపారు. తను తీసిన 11 సినిమాలు హిట్ అవ్వడంలో విజయ రహస్యం చెప్పాలన్న ప్రశ్నకు బదులిస్తూ జనాలనాడి, అభిరుచులకు తగ్గట్టుగా సినిమా చేస్తాను. మన పని మనం చిత్తశుద్ధితో చేసుకుంటూ పోతే డబ్బే మనదగ్గరకు వస్తుందని అన్నారు. 'ఈనాడు' పత్రిక సంపాదకులు రామోజీరావు తనకు స్ఫూర్తి అని, సాధారణ స్థాయి నుంచి ఆయన మహాసామ్రాజ్యం సృష్టించారని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నిర్మాతలుగా శ్యామ్‌ప్రసాద్, కేవీ రెడ్డి, వ్యక్తిగా లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్‌నారాయణ ఇష్టమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డాక్టర్ అశోకరాజు, కళాశాలల వైస్‌ఛైర్మన్ ఇందిరావేణి, వైస్‌ప్రెసిడెంట్ ఘోష్, ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, సంగమేశ్వరరాజు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సినీ దర్శకుడు రాజమౌళి దంపతులు



కొమ్ముకోనాం.. ధరలోనూ ఘనం..!

విశాఖపట్నం తీరంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు శుక్రవారం భారీగా కొమ్ముకోనాం చేపలు చిక్కాయి. ఈ చిత్రంలో కనిపిస్తున్న ఓ కొమ్ముకోనాం చేప 12 అడుగుల పొడవు, 180 కిలోలకుపైగా బరువు తూగి చూపరులను అలరించింది. అనంతరం స్థానిక మత్స్యకారులు దీనిని రూ. 24 వేలకు విక్రయించారు.

కేజీబీవీల్లో నాప్‌కిన్‌ల ఏటీఎంలు

మంత్రి పరిటాల సునీత వెల్లడి

అనంతపురం, న్యూస్‌టుడే: మహిళా అభ్యున్నతి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రెట్టింపు స్థాయిలో నిధులు కేటాయించిందని మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురంలో మంత్రి మాట్లాడుతూ.. సెర్ప్-ఐసీడీఎస్ ప్రాజెక్టులకే రూ.11,684 కోట్లు కేటాయించామన్నారు. ఈ దఫా వినూత్న పథకాలకు శ్రీకారం చుడుతున్నామని.. ఆడ పిల్లలు, స్త్రీల ఆరోగ్య సంరక్షణకు శానిటరీ నాప్‌కిన్లు సరఫరా చేస్తామన్నారు. ప్రప్రథమంగా కేజీబీవీల్లో ప్రయోగాత్మకంగా ఏటీఎంలను ప్రవేశపెట్టాలని భావిస్తున్నామని.. రూ.2, రూ.5 నాణెం వేయగానే ఒక నాప్‌కిన్ వచ్చేలా ఈ ఏటీఎంలు ఉంటాయన్నారు. వడ్డీలేని రుణాల కోసం గతంలో రూ.110 కోట్లే ఉంటే.. ఇప్పుడు రూ. వెయ్యి కోట్లకు పెంచామన్నారు. స్త్రీ నిధి రూ.50 కోట్ల నుంచి రూ. వంద కోట్లకు, పోషకాహార పథకానికి గతేడాది రూ.470 కోట్లే ఉంటే ఇప్పుడు రూ.821 కోట్లకు పెంచామన్నారు. అన్న అమృత హస్తానికి రూ.53 కోట్ల నుంచి రూ.195 కోట్లకు పెంచామన్నారు. ప్రత్యేక పోషకాహార పథకాన్ని నూతనంగా ప్రవేశ పెడుతున్నామనీ.. ఇందుకు రూ.360 కోట్లు వెచ్చించనున్నట్లు మంత్రి వివరించారు.

టెట్ ప్రాథమిక 'కీ'పై 19,314 అభ్యంతరాలు

ఈనాడు, అమరావతి: టెట్ ప్రాథమిక 'కీ'పై శుక్రవారం వరకు 19,314 అభ్యంతరాలు వచ్చినట్లు కన్వీనర్ సుబ్బారెడ్డి వెల్లడించారు. పేపర్-1కు 12,070, పేపర్-2కు 5,018, పేపర్-3కి 2,226 అభ్యంతరాలు వచ్చాయి. వీటిని పరిశీలించిన అనంతరం తుది 'కీ'ని ఈనెల 12న విడుదల చేయనున్నట్లు తెలిపారు. అభ్యంతరాలు తెలిపే అభ్యర్థులు తాము సూచించే జవాబు సరైనదని చెప్పేందుకు ఆధారాన్ని ఆన్‌లైన్‌లో ఉంచాలని అధికారులు సూచించారు. ఆధారాలను అప్‌లోడ్ చేయని వారి అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోరు. మరోవైపు గుంటూరులోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గత నెల 24న నిర్వహించిన టెట్ పరీక్షలో ఆన్‌లైన్‌లో ఐదు ప్రశ్నలు కనిపించలేదు. అభ్యర్థులు ఇన్విజిలేటర్లకు ఫిర్యాదు చేయడంతో వారి నుంచి సంతకాలు సైతం స్వీకరించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00

సైనా నెహ్వాల్.. భారత బ్యాడ్మింటన్ సత్తా ఏంటో ప్రపంచానికి చాటి.. దేశంలో ఈ ఆటను మరో స్థాయికి తీసుకెళ్లిన షట్లర్. లెక్కకు మిక్కిలి సూపర్ సిరీస్ టైటిళ్లు.. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలు.. ఇలా ఎన్నెన్నో ఘనతలు సైనా సొంతం. అయితే 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం సొంతం చేసుకుని పతాక స్థాయిని అందుకున్న సైనా.. తర్వాత ఆశించిన స్థాయిలో రాణించట్లేదు. గాయాలు, ఫామ్ లేమి ఆమెను దెబ్బ తీశాయి. ఒక దశలో గురువు గోపీచంద్‌ను, తనకు బ్యాడ్మింటన్‌లో ఓనమాలు నేర్పిన హైదరాబాద్‌ను విడిచిపెట్టి బెంగళూరుకు వెళ్లినా.. సైనా ప్రదర్శనలో ఆశించిన మార్పు కనిపించలేదు. నిరుడు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుని, గురువు గోపీచంద్ దగ్గరికే చేరిన సైనా.. పూర్వపు ఫామ్ అందుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తోంది. తనకు అందని ద్రాక్షగా ఉన్న, తన గురువు కెరీర్‌కు తలమానికంగా నిలిచిన ఆల్ఇంగ్లాండ్ టైటిల్‌ను అందుకోవాలని పట్టుదలతో శ్రమిస్తోంది. ఈ ప్రయత్నంలో సైనా విజయవంతమవుతుందా? పునరాగమనంలో సత్తా చాటి గురువుకు దక్షిణ ఇస్తుందా?



అది..
గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీ..
కెరీర్‌లో దాదాపు అన్ని ఘనతల్నీ అందుకున్న సైనా తీవ్రంగా శ్రమిస్తోంది. చెమటతో టీషర్ట్ తడిసి ముద్దయింది.. ఒంట్లో ఓపికంతా ఆవిరవుతోంది... రాకెట్ విశ్రాంతి కోరుతోంది..
ఇక చాలంటూ షటిల్స్ వేడుకుంటున్నాయి.
అయినా.. ఎక్కడా తగ్గట్లేదు సైనా. మరింత కసిగా.. మరింత పట్టుదలగా.. సాగుతున్న ఆమె సాధన చూసేందుకు రెండు కళ్లు చాలవు!
ఇప్పుడు ఆమె లక్ష్యం ఒక్కటే.. ఆల్ ఇంగ్లాండ్ టైటిల్!

గురు దక్షిణ కోసం...

సాధారణంగా క్రీడాకారుల కెరీర్ రెండు దశలు. అంతర్జాతీయ ప్రస్థానం ఆరంభించినప్పటి నుంచి కెరీర్‌లో అత్యున్నత స్థానం చేరుకోవడం వరకు మొదటి దశ. అత్యున్నత స్థానం నుంచి రిటైర్మెంట్ వరకు రెండో దశ. ఇప్పుడు సైనాది కూడా సెకండ్ ఇన్నింగ్సే! 16 ఏళ్ల వయసులో.. 2006లో అంతర్జాతీయ కెరీర్‌కు శ్రీకారం చుట్టిన సైనా 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించింది. 2015లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకు సొంతం చేసుకుంది. అదే ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం గెల్చుకుంది. అక్కడి వరకు ఆమె కెరీర్ దిగ్విజయంగా దూసుకెళ్లింది. 2015 తర్వాతే రెండో దశ ప్రారంభమైంది. అప్పటికే బెంగళూరులోని ప్రకాశ్ పదుకొణె అకాడమీకి మారిన సైనా సొంతగడ్డకు.. స్నేహితులకు దూరంగా అయిష్టంగా.. అన్యమనస్కంగానే కెరీర్ కొనసాగించింది. అందుకేనేమో 2015 నుంచి ఇప్పటి వరకు సైనా సాధించింది చాలా తక్కువే.

2014 ఆగస్టులో బెంగళూరు వెళ్ళిన సైనా.. నిరుడు ప్రపంచ ఛాంపియన్‌షిప్ తర్వాత (ఆగస్టు) మళ్లీ సొంతగూటికి చేరుకుంది. గురువు గోపీచంద్ ఆధ్వర్యంలో సెకండ్ ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టింది. అతని మార్గనిర్దేశనంలో మరోసారి రాకెట్‌కు పదును పెడుతోంది. 27 ఏళ్ల సైనాకు ఇప్పుడు తొలి సవాల్.. ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌సిప్. పదకొండో సారైనా గోపీ ఆశయం.. తన లక్ష్యం నెరవేరాలన్న పట్టుదల సైనాది. అందుకు ఆమె పడుతున్న తపన, శ్రమ అనన్యసామాన్యం. ఐదు నెలల నుంచి సైనా దినచర్య పూర్తిగా మారిపోయింది. మోకాలి గాయంతో ఫిట్‌నెస్‌తో వెనుకబడ్డ సైనాకు గోపీ, ఫిజియో కిరణ్ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అందరితో పాటే ఉదయం మూడున్నర గంటలు.. సాయంత్రం మూడు గంటలు శిక్షణ తప్పనిసరి. గాయాలు కాకుండా ఉండేందుకు.. తన దేహానికి సరిపోయే ఎక్సర్‌సైజులు రోజూ ఉదయం గంటసేపు చేస్తోంది. శనివారం, ఆదివారం, పండగలప్పుడు కొందరికి సెలవు. అయినా సైనా మాత్రం ఒక్కరోజు కూడా శిక్షణకు దూరమవ్వట్లేదు. ప్రత్యేక డైట్ కారణంగా సైనా ఐదు కిలోలు తగ్గింది. పూర్తిగా కూరగాయలతో తక్కువ కార్బోహైడ్రేట్స్ ఉండే ఆహారం తీసుకుంటోంది. తనకు ఇష్టమైన ఆహారాన్ని పూర్తిగా మానేసింది. దీంతో సైనా దేహంలో కొవ్వు శాతం తగ్గి.. మజిల్ శాతం పెరిగింది. ఎనర్జీ లెవెల్స్ కూడా బాగా పెరిగాయి. దేహం ఇప్పుడు మరింత ఫిట్‌గా తయారైంది. ప్రత్యేక శిక్షణ, డైట్‌తో సైనా వయసు రెండేళ్ళు తగ్గిందన్నది ఫిజియో కిరణ్ అభిప్రాయం.



> ఆల్ ఇంగ్లాండ్‌లో ప్రతి ఏడాదీ పోటీ పెరుగుతోంది. శిక్షణలో సైనా బరువు చాలా తగ్గింది. ఆమె శక్తిసామర్థ్యాలు పెరిగాయి. ఆటలోనూ చాలా పురోగతి కనిపిస్తుంది. ఆల్ ఇంగ్లాండ్‌లో కొత్త సైనాను చూస్తారు
> –గోపీచంద్

పూర్తి ఫిట్‌నెస్‌తో కనిపిస్తున్న సైనా బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఆల్ ఇంగ్లాండ్‌లో ఎలా ఆడుతుందన్నది ఆసక్తికరం. ప్రస్తుతం 11వ ర్యాంకులో ఉన్న ఆమె.. తొలి రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ ఛాంపియన్ యింగ్ తై జు (చైనీస్)తో తలపడనుంది. ఇప్పటి వరకు వీరిద్దరూ 14 సార్లు పోటీపడగా.. ఐదింట్లో సైనా నెగ్గింది. తొమ్మిదింట్లో ప్రత్యర్థి గెలిచింది. గత ఏడు మ్యాచ్‌ల్లో సైనాపై యింగ్ తై జుదే పైచేయి. ఐతే సైనా రికార్డులను కాకుండా ఆటను నమ్ముకుంటోంది. "ఆల్ ఇంగ్లాండ్‌లో తై జుతో తొలి మ్యాచ్. కఠినమైన డ్రా. టైటిల్ గెలవాలంటే ప్రతి ఒక్కరినీ ఓడించేందుకు మానసికంగా సిద్ధంగా ఉండాలి. తొలి రౌండ్లో ఆమెను ఓడించాలంటే చాలా చాలా ఫిట్‌గా ఉండాలి. యువ ఆటగాళ్ళతో సుదీర్ఘ ర్యాలీలు ప్రాక్టీస్ చేస్తున్నా. ఈ వ్యూహం ఫలిస్తుందని అనుకుంటున్నా. కోచ్‌గా చేయాల్సినవన్నీ గోపీ సర్ చేస్తున్నారు. ఈ ఐదు నెలల్లో నాలో చాలా మార్పొచ్చింది. దేహంలో కొవ్వు శాతం తగ్గింది. గతం కంటే ఇప్పుడు చురుగ్గా కదులుతున్నా"నని అంటోంది సైనా. ఏదేమైనా సైనా సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ అలరించాలన్నది అందరి ఆకాంక్ష!

రంగంలోకి... మూడో నేత్రం!



క్రికెట్లో క్యాచ్, రనౌట్, స్టంపింగ్.. ఇలా ఎందులో సందేహమున్నా అంపైర్ వెంటనే మూడో అంపైర్‌కు నివేదిస్తాడు. టెన్నిస్‌లోనూ బంతి ఔటా కాదా అని తెలుసుకోవడానికి సమీక్ష కోరతారు. ఇంకా చాలా ఆటల్లో వీడియో రీప్లేలు చూడటం, దాని ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం మామూలే. కానీ ప్రపంచంలో అత్యధిక ఆదరణ ఉన్న ఫుట్‌బాల్‌లో మాత్రం వీడియో సమీక్షకు చోటు లేదు! అధునాతన సాంకేతిక అందుబాటులో ఉన్నా.. ఆట లయ దెబ్బ తింటుందన్న ఉద్దేశంతో దశాబ్దాలుగా దాని సహకారం తీసుకోలేదు. కానీ ఇప్పుడు ప్రపంచ ఫుట్‌బాల్ విప్లవాత్మక మార్పు వైపు అడుగులేస్తోంది. ఆటలోకి వీడియో అసిస్టెంట్ రిఫరీ (వీఏఆర్) పద్ధతిని తీసుకొస్తోంది. ఈ ఏడాది ప్రపంచకప్‌లో ఈ సాంకేతికత అరంగేట్రం చేయనుంది.

ఫుట్‌బాల్.. వేగానికి మారుపేరైన ఆట! ఒకసారి రిఫరీ విజిల్ మోగితే.. ఇక పరుగే పరుగు. 90 నిమిషాల పాటు నిర్విరామ వినోదం! ఆటగాళ్ల వేగాన్ని అందుకోవడం రిఫరీలకు అన్నిసార్లూ సాధ్యం కాదు. ఆ క్రమంలో తప్పిదాలూ తక్కువేమీ కాదు. ఇక మైదానంలో తమ నట విన్యాసాలతో రిఫరీల్ని తప్పుదోవ పట్టించే ఆటగాళ్లకూ కొదవేమీ లేదు. ఈ తప్పిదాల్ని నివారించడానికి వీఏఆర్ సాంకేతికతను ఈ ఏడాది జూన్, జులై నెలల్లో రష్యా వేదికగా జరిగే ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో అమల్లోకి తేవడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఫిఫా ఇందుకు ముందు నుంచే సుముఖంగా ఉండగా.. ఇటీవలే అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల బోర్డు (ఐఎఫ్ఏబీ) కూడా ఆమోదం తెలిపింది. కాబట్టి రాబోయే ప్రపంచకప్‌లో ఈ సాంకేతికతను చూడటం లాంఛనమే!

ఎప్పుడెప్పుడు?

గోల్ విషయంలో సందేహాలున్నపుడు.. ఆటగాళ్లకు రెడ్ కార్డు ప్రకటించడంపై సందిగ్ధత నెలకొన్నపుడు.. పెనాల్టీకి సంబంధించిన నిర్ణయాలు వెలువరించాల్సినపుడు.. ఏదైనా నిర్ణయం ప్రకటించాల్సిన ఆటగాడి విషయంలో స్పష్టత లేనపుడు.. ఈ నాలుగు సందర్భాల్లో మైదాన రిఫరీ వీఏఆర్ సమీక్ష కోరతాడు. ఈ సమీక్ష కోరేది రిఫరీనే. దీనికి ప్రత్యేకమైన సంజ్ఞ ఉంటుంది. సమీక్ష కోరిన రెండున్నర నిమిషాల్లో నిర్ణయం వెలువడాలి. ఆట పునఃప్రారంభం కావాలి. రిఫరీ ముందు నిర్ణయం ప్రకటించి ఉన్నప్పటికీ సమీక్ష తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకోవచ్చు.



ఏంటీ సాంకేతికత?

వీఏఆర్ అంటే.. వీడియో అసిస్టెంట్ రిఫరీ. ఫుట్‌బాల్ మ్యాచ్‌ల్లో రిఫరీ నిర్ణయాల్లో తప్పిదాల్ని తగ్గించేందుకు ఉద్దేశించిన సాంకేతికత ఇది. ఇందుకోసం ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. మైదానంలోనే ఒక వైపుగా ఇందుకోసం ఒక గది ఉంటుంది. అందులో వివిధ కోణాల్లో మ్యాచ్ లైవ్ దృశ్యాల్ని చూపించే టీవీలుంటాయి. వీటికి ప్రసారదారు కెమెరాలతో సంబంధం ఉండదు. దాని వల్ల ఏమైనా పొరబాట్లు జరగొచ్చనే ఉద్దేశంతో వీఏఆర్ కోసమే స్టేడియంలో ప్రత్యేకంగా కెమెరాల ఏర్పాటు ఉంటుంది. వీఏఆర్ గదిలో వీడియో అసిస్టెంట్ రిఫరీ, అతడి సహాయకుడు, రీప్లే ఆపరేటర్.. ఈ ముగ్గురూ ఉంటారు. సమీక్ష కోరినపుడు వెంటనే వీడియోల్ని సమీక్షించి సమాచారం మైదాన రిఫరీకి సమాచారం అందిస్తారు.

మంచా చెడా..?

వీఏఆర్ వినియోగంపై ప్రపంచ ఫుట్‌బాల్‌లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ప్రపంచ క్రీడల్లో ఫుట్‌బాల్‌లో జరిగినన్ని తప్పులు ఇంకెందులోనూ జరగవు. అంత పెద్ద మైదానంలో 22 మంది ఆటగాళ్లను ఒక్క రిఫరీ క్షణక్షణం గమనిస్తూ కచ్చితమైన నిర్ణయాలు ప్రకటించడం అసాధ్యం. ఆఫ్‌సైడ్, పెనాల్టీలు, రెడ్ కార్డుల విషయంలో తరచుగా తప్పిదాలు జరుగుతుంటాయి. వీటిని తగ్గించేందుకు వీడియో సమీక్ష తీసుకుంటే తప్పేంటన్న వాదన ఎప్పట్నుంచో ఉంది. ఐతే సంప్రదాయవాదులు మాత్రం ఈ ప్రతిపాదనను ముందు నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. వీడియో సమీక్ష వినియోగంతో ఆట అందమే దెబ్బ తింటుందన్న అభిప్రాయాలున్నాయి. మంచి ఊపుమీద సాగుతున్న ఆటను వీడియో సమీక్ష కోసం ఆగితే.. ఆటగాళ్ల లయ దెబ్బ తింటుందని.. ఆటలో స్తబ్ధత మంచిది కాదని.. అభిమానుల్లో కూడా ఆసక్తి పోతుందన్నది ఒక వర్గం వాదన.





2008 చైనాలో ఐబా ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్.. భారత స్టార్ బాక్సర్ మేరీకోమ్ స్వర్ణం కైవసం చేసుకుంది.. ఇందులో ఏంటి విశేషం అంటారా?
అప్పటికే ఆమె ఇద్దరు బిడ్డల తల్లి!

2009 యుఎస్ ఓపెన్.. కిమ్ క్లియస్టర్స్ చేతిలో ట్రోఫీ.
ఈ ట్రోఫీ ప్రత్యేకత ఏంటంటే తల్లి అయిన తర్వాత కొట్టిన టైటిల్ అది!

లాంగ్ డిస్టెన్స్ పరుగులో సత్తా చాటి 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో రజతాన్ని గెలిచింది ఐర్లాండ్ అథ్లెట్ సోనియా సులెవాన్.
ఈమె స్పెషాలిటీ బిడ్డ పుట్టిన కేవలం 10 రోజులకే ట్రాక్‌లోకి రావడం!

పెళ్లైపోతే అంతే.. ఇక కష్టం.. కెరీర్‌కు తెరపడినట్లే. ఇలాంటి ఆలోచనలు ఈ అథ్లెట్లను చూస్తే పటాపంచలవుతాయి. కెరీర్‌లో మంచి స్థితిలో ఉన్నా.. వివాహం చేసుకుని, పిల్లల్ని కని మళ్లీ ఆటలో వెలిగిన క్రీడాకారిణులు కొందరున్నారు. మరి వారెవరో చూద్దామా..

అమ్మ.. కొట్టింది

సూపర్ మేరీ

అమ్మయిన తర్వాత ఛాంపియన్‌గా నిలిచిన వారి జాబితాలో ముందుంటుంది భారత నారి మేరీకోమ్. ఇద్దరు బిడ్డలకు జన్మ ఇచ్చిన తర్వాత మళ్లీ బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టిన మేరీ.. నింగ్బో (చైనా, 2008), బ్రిడ్జిటౌన్ (2010) ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో స్వర్ణాలు గెలిచింది. అన్నిటికంటే హైలైట్ ఏమిటంటే 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలవడం. 2010, 14 ఆసియా క్రీడల్లోనూ ఆమె పతకాలు సాధించింది. ఒలింపిక్స్‌లో పతకం కొట్టినా ఆమె ఆగలేదు. మరోసారి ఈ మెగా ఈవెంట్లో పతకమే లక్ష్యంగా బరిలో నిలిచింది. 2020 టోక్యో ఒలింపిక్స్ కోసం ఆమె కఠోరంగా శ్రమిస్తోంది.



సెరెనా వచ్చేసింది..

అందరూ ఒక ఎత్తు.. అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ మరో ఎత్తు. 23 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచి ఓపెన్ శకంలో అత్యధిక టైటిళ్లు గెలిచిన క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించిన సెరెనా.. ఇటీవలే అమ్మ అయింది. బిడ్డకు జన్మనిచ్చాక అతికష్టమ్మీద బతికానని చెప్పిన ఆమె.. సుదీర్ఘ విరామం తర్వాత ఇండియన్‌వెల్స్ టోర్నీలో ఆడి శుభారంభం చేసింది. ఇప్పుడు సెరెనా ముందున్న లక్ష్యం ఒక్కటే అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన మార్గరెట్ కోర్ట్ (24 టైటిళ్లు) రికార్డును అధిగమించడం. రాబోయే ఫ్రెంచ్ ఓపెన్లో సత్తా చాటాలనేది ఆమె కోరిక. అమ్మ అయిన తర్వాత కూడా మెరిసిన క్లియ్‌స్టర్స్, డావెన్‌పోర్ట్ జాబితాలో ఆమె చేరుతుందో లేదో త్వరలో తెలుస్తుంది.





టెన్నిస్ అమ్మలు

కిమ్ క్లియ్‌స్టర్స్, లిండ్సే డావెన్‌పోర్ట్ ఇద్దరికి పోలికలు ఉన్నాయి. ఇద్దరూ టెన్నిస్ క్రీడాకారిణులే కావడం.. అంతేకాక అమ్మ అయిన తర్వాత తిరిగొచ్చి టైటిళ్లు సాధించడం. 2007లో ఆటకు రిటైర్‌మెంట్ ప్రకటించిన క్లియ్‌స్టర్స్.. 2009లో పునరాగమనం చేసింది. వచ్చి రెండు టోర్నీలు ఆడిందో లేదో యుఎస్ ఓపెన్ గెలిచేసింది. ఆమె అక్కడితో ఆగలేదు. 2010లో మరోసారి యుఎస్ టైటిల్ సొంతం చేసున్న ఈ బెల్జియం స్టార్.. 2011లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌నూ ఖాతాలో వేసుకుంది. ఇక అమెరికా తార డెవన్‌పోర్ట్ గర్భం దాల్చినా టోర్నీలు ఆడింది. అంతేకాదు ఆ సమయంలో ఆమె నాలుగు టోర్నీల్లో మూడింట్లో విజేతగా నిలిచింది. 2007లో ప్రసవించిన ఆమె ఆ తర్వాత డబ్ల్యూటీఏ టైటిళ్లు సాధించింది. అంతేకాక 2008లో బీజింగ్ ఒలింపిక్స్‌లో క్వార్టర్స్ వరకు వెళ్లింది.




పతకం కోసం మళ్లీ..

జెస్సికా ఇనీస్ హిల్.. ఈ బ్రిటన్ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ తల్లి అయిన తర్వాత కూడా ఒలింపిక్స్ పతకాన్ని సాధించింది. 2012 బీజింగ్ ఒలింపిక్స్‌లో హెప్టాథ్లాన్‌లో స్వర్ణం గెలిచిన జెస్సికా.. అదే ఏడాది తల్లి అయి కామన్వెల్త్ క్రీడలకు దూరమైంది. కానీ ఒలింపిక్స్‌లో సాధించిన పతకాన్ని నిలబెట్టుకోవాలనే పట్టుదలే మళ్లీ ఆమెను ట్రాక్ మీదకు తీసుకొచ్చింది. 2016 రియో ఒలింపిక్స్‌లో జెస్సికా పసిడి గెలవకపోయినా.. రజతం సాధించి అబ్బురపరిచింది.

బిడ్డ పుట్టిన 10 రోజులకే



ఐర్లాండ్ అథ్లెట్ సోనియా సులెవాన్‌ది అందరి కంటే భిన్నమైన కథ. 1999లో ఆడపిల్లకు జన్మనిచ్చిన ఆమె 10 రోజులకే మళ్లీ ట్రాక్‌లో అడుగుపెట్టి అందర్ని ఆశ్చర్యపరిచింది. చాలా కష్టమైనా శిక్షణ శిబిరంలో పాల్గొంది. ఇంతటి పట్టుదల, శ్రమ ఉంది కాబట్టే ఆమె 2000 సిడ్నీ ఒలింపిక్స్‌లో 5000 వేల మీ పరుగులో రజతం సాధించగలిగింది. 10 వేల పరుగులోనూ ఆమె చివరిదాకా పతకం రేసులో నిలిచినా 6వ స్థానంతో సరిపెట్టుకుంది.



ఈనాడు సినిమా


నాగార్జున, మైరా శరీన్

'ఆఫీసర్' ఎప్పుడొస్తాడంటే!

నాగార్జున కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఆఫీసర్'. మైరా శరీన్ కథానాయిక. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ముంబైలో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 25న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు నాగార్జున ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. చిత్రంలోని కొన్ని స్టిల్స్‌ని కూడా పంచుకొన్నారాయన. వాటిలో నాగ్, మైరా గన్నులు ఎక్కుపెట్టి కనిపిస్తున్నారు. "రామ్ గోపాల్ వర్మ 'ఆఫీసర్' కోసం మా ఇద్దరి గన్నులు లోడ్ అయ్యాయి. అవి మే 25న థియేటర్లో పేలుతాయి" అని నాగ్ ట్వీట్ చేశారు. ఇందులో నాగార్జున పోలీసు అధికారిగా నటిస్తున్న విషయం తెలిసిందే. పాతికేళ్ల తర్వాత నాగార్జున - రామ్‌గోపాల్ వర్మ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో కథానాయిక మైరా శరీన్ గాఢతతో కూడిన సన్నివేశాల్లో చాలా బాగా నటించిందని, ఆ విషయంలో నేను, నాగార్జున చాలా సంతృప్తిగా ఉన్నామని రామ్‌గోపాల్ వర్మ తెలిపారు. ఇది మైరాకి తొలి చిత్రమంటే నమ్మబుద్ధి కావడం లేదన్నారు.

కొత్త లుక్ గురూ

పాత్రలకి తగ్గట్టుగా తనని మార్చుకొంటూ, తెరపై ఎప్పటికప్పుడు సరికొత్తగా కనిపించే కథానాయకుడు వెంకటేష్. 'గురు' కోసం ఆయన మారిన విధానం ప్రేక్షకులకు ఎంతగానో నచ్చింది. ఇప్పుడు మరోసారి ఆయన ఓ కొత్త లుక్‌లో దర్శనమిచ్చేందుకు సిద్ధమయ్యారు. తేజ దర్శకత్వంలో వెంకటేష్ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కబోతోంది. శ్రియ కథానాయిక. ఈ నెలలోనే చిత్రీకరణ ప్రారంభం కానున్న ఆ సినిమాలో వెంకటేష్ అధ్యాపకుడిగా కనిపించనున్నట్టు తెలిసింది. అందుకు తగ్గట్టుగానే ఆయన కొత్త గెటప్‌లోకి మారిపోయారు. ఆ లుక్ సామాజిక అనుసంధాన వేదికల్లో సందడి చేస్తోంది. నారా రోహిత్ ఇందులో ముఖ్యపాత్రని పోషిస్తున్నారు. ఆయన లుక్ కూడా బయటికొచ్చింది. సురేష్ ప్రొడక్షన్స్, ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.


వెంకటేష్

పంచ్ డైలాగ్

మనిషి అంటే నమ్మకం.. ఇవ్వడం, తీసుకోవడం, ఎదుటోళ్ల గురించి ఆలోచించడం, రేపటి గురించి ఆశ, కాస్త సంతోషం, కాస్త కన్నీరు.. ఇవన్నీ ఉంటేనే మనిషవుతాడు.

చిత్రం: గమ్యం, - పంపినవారు: మధుకర్, కర్నూలు

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

బంద్‌తో ఏం సాధించారు?


ఆర్.నారాయణమూర్తి

"ఇదివరకు చెప్పినట్టుగానే డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు కేవలం రూ.2 వేలు మాత్రమే ఛార్జీలు తగ్గించారు. ప్రచారచిత్రాల ప్రదర్శన విషయంలోనూ న్యాయం జరగలేదు. మరి థియేటర్ల బంద్ వల్ల ఒరిగింది, సాధించిందేమిటి?" అని ప్రశ్నించారు దర్శకనిర్మాత ఆర్.నారాయణమూర్తి. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. "ప్రజాస్వామ్యంలో సమస్యల పరిష్కారానికి ఉపయోగించే బ్రహ్మాస్త్రం బంద్. అది క్కడ నిష్ప్రయోజనమైంది. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో మాత్రం బంద్ కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో ఐక్యత కొరవడినందున థియేటర్లు తెరుచుకున్నాయి. సెలవుల్లో పెద్ద సినిమాలు ఎక్కుగా విడుదలవుతాయి. చిన్న సినిమాలకి ఆస్కారం ఉండదు. ఏప్రిల్ నెలలో సెలవులు కాబట్టి అప్పుడు పెద్ద సినిమాల విడుదలకి సిద్ధం అయ్యారు. ఈలోగా మార్చిలో అయినా సినిమాలను విడుదల చేసుకుందామని చిన్న నిర్మాతలు సిద్ధమైతే, దురుద్దేశంతో బంద్‌ను ప్రకటించారు. ఇది న్యాయసమ్మతం కాదు. కొద్దిమంది కొరకు కొద్దిమంది చేత మన చిత్ర పరిశ్రమ పాలన కొనసాగుతోంది. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, పంపిణీదారులలోని కొందరు ఈ డిజిటల్ ప్రొవైడర్స్ కంపెనీల్లో భాగస్వాములుగా ఉంటున్నారు. వాళ్లు బతకాలని అనుకోవడంతో సమస్య ఏర్పడింది. ఇది సరికాదు. చిత్రపరిశ్రమలోని వారంతా బతకాలి. కేవలం రూ.2 వేలకే సినిమాలను ప్రదర్శించే డిజటల్ కంపెనీలున్నాయి. కానీ వాటిని రానియ్యకుండా గుత్తాధిపత్యం సాగిస్తోన్న కంపెనీలు అడ్డుపడుతున్నాయి. చిత్రపరిశ్రమ మనుగడ కోసం రెండు తెలుగు రాష్ట్రాల సినిమాటోగ్రఫీ మంత్రులైన తలసాని శ్రీనివాస యాదవ్, గంటా శ్రీనివాసరావుతోపాటు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని డిజిటల్ ప్రొవైడర్స్, చిత్రపరిశ్రమతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా" అన్నారు. తెలంగాణ చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ "తక్కువ మొత్తానికే సేవలందించే కంపెనీల ద్వారా సినిమాలను ప్రదర్శించుకునే వెసులబాటు కల్పించేందుకు రెండు ప్రభుత్వాలు కృషి చేయాల"న్నారు.

అదృష్టానిదే అతి పెద్ద పాత్ర


కీర్తి సురేష్

"సినీ ప్రయాణంలో అద్భుతాలు జరగాలని ఎప్పుడూ కోరుకోలేదు. ఒకొక్క అడుగే ముందుకేస్తున్నా. అంతిమంగా ఇక్కడ అదృష్టానిదే అతి పెద్ద పాత్ర" అని చెబుతోంది కీర్తి సురేష్. త్వరలోనే 'మహానటి'గా సందడి చేయబోతున్న ఆమె తమిళం, మలయాళంలో నటిస్తూ బిజీగా గడుపుతోంది. "నేనిప్పుడు ఎక్కడున్నాను? ఏ స్థాయికి ఎదిగాను? అని ఎప్పుడూ లెక్కలేసుకోను. నేనింకా అంత దూరం కూడా ప్రయాణం చేయలేదు. అందుకే వచ్చే అవకాశాలపైనా, వాటికి న్యాయం చేయడంపైనే నా దృష్టంతా. పాత్రల విషయంలో కూడా ప్రత్యేకమైన ప్రణాళికలంటూ ఏమీ లేవు. కాకపోతే ఎప్పుడూ ఒకే రకంగా తెరపై కనిపించకుండా, ప్రేక్షకులకు... నాకూ చేసే పాత్రలు కొత్తగా అనిపిస్తే చాలు. కానీ ఇంత తక్కువ సమయంలోనే మరిచిపోలేని కొన్ని పాత్రలు లభించాయి. అవి గుర్తుకొచ్చినప్పుడే నేను లక్కీ అనుకొంటుంటా" అని చెప్పింది కీర్తి.


మధుబాల


మార్లిన్ మన్రో

మధుబాల... మార్లిన్ మన్రో ఒకటే!

'అమర్', 'ఛల్తీ కా నామ్ గాడీ', 'మొగల్ ఎ ఆజమ్', 'బర్సాత్ కీ రాత్'.. ఈ బాలీవుడ్ క్లాసిక్ చిత్రాల పేరు చెప్పగానే కళ్లముందు కదిలే రూపం మధుబాల. బాలీవుడ్ ట్రాజడీ క్వీన్‌గా చిరస్థాయిగా సినీ అభిమానుల గుండెల్లో నిలిచిపోయిన మధుబాల ఎన్నో కీర్తి శిఖరాలను అందుకొన్నారు. తాజాగా ఆమెకు మరో అరుదైన గౌరవం దక్కింది. ప్రముఖ అమెరికా వార్తా పత్రిక న్యూయార్క్ టైమ్స్ మధుబాలను గుర్తు చేసుకొంటూ నివాళి అర్పించింది. తమ పత్రికలోని 'ఓవర్‌లుక్డ్' సెగ్మెంట్‌లో ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన 15 మంది మహిళల గురించి రాసి నివాళి అర్పించింది న్యూయార్క్ టైమ్స్. ఆ జాబితాలో భారతీయ నటి మధుబాల పేరు ఉండటం విశేషం. బాలీవుడ్‌ని మైమరపించిన నటి అంటూ మధుబాల అసలు పేరైన 'ముంతాజ్ బేగమ్'ను ప్రస్తావిస్తూ ఆమె నటనను, భారతీయ చిత్ర సీమకు ఆమె చేసిన సేవల్ని కొనియాడారు. "ఆధునిక యువతిని ప్రతిబింబించేలా మధుబాల ఉండేవారు. ఆమెను మార్లిన్ మన్రోతో పోల్చొచ్చు. కళ్లు తిప్పుకోలేని అందం, తక్కువ కెరీర్, విషాదంగా ముగిసిన జీవితం..."అని రాసుకొచ్చింది. వెండితెరపై దిలీప్‌కుమార్, మధుబాల జోడీ ఎంత గొప్పగా ఉండేదో ఈ సందర్భంగా గుర్తుచేసుకొన్నారు. గాయకుడు కిషోర్ కుమార్‌తో ఆమె వివాహం.. అనంతర పరిణామాలతో పాటు అనారోగ్యం ఆమెను ఏవిధంగా కబళించిందో కూడా ఇందులో రాసింది న్యూయార్క్ టైమ్స్.

నిప్పుతో ఆట... వీళ్లకు సరదాట!


కంగనా రనౌత్


రాజ్‌కుమార్


నిప్పు సెగ తగిలితేనే శరీరం తట్టుకోలేదు. అలాంటిది ఇక్కడ కంగనా రనౌత్ ఏకంగా తన నాలుకను లైటర్‌తో కాల్చుకుంటోంది.... రాజ్‌కుమార్ రావ్ తన నుదుటిపై వెలిగించిన సిగరెట్‌తో రుద్దుకుంటున్నాడు... వాళ్ల ముఖాల్లో ఎక్కడా బాధ కనిపించడం లేదు. పైగా ఆనందంగా చిరునవ్వులు చిందిస్తున్నారు... ఏంటి వీళ్లకు పిచ్చా? అనిపిస్తోంది కదూ..! వాళ్లకు పిచ్చో ఉందో లేదో తర్వాత విషయం కానీ ఈ ఇద్దరు నటిస్తున్న చిత్రం పేరు మాత్రం 'మెంటల్ హై క్యా'. ఈ సినిమాకు సంబంధించిన చిత్ర విచిత్రమైన పోస్టర్స్‌ను చిత్ర నిర్మాణ సంస్థ బాలాజీ మోషన్ పిక్చర్స్ ట్విట్టర్‌లో పంచుకొంటుంది. చేతిలో కత్తితో బాత్ టబ్‌లో కంగనా కూర్చుని ఉంటే... బాత్ టబ్ అంచుమీద రొట్టెతో ఉన్న టోస్టర్ కనిపిస్తుంది. రాజ్‌కుమార్ రావ్ పెద్ద కత్తెతో యాపిల్ కోస్తుంటే అతని చేతి నుంచి రక్తం వస్తుంటుంది... ఇలాంటి పోస్టర్స్‌ను విడుదల చేస్తూ సినిమాపై అంచనాలను పెంచుతోంది చిత్రబృందం. తెలుగు దర్శకుడు ప్రకాష్ కోవెలమూడి బాలీవుడ్‌కి పరిచయమవుతున్న చిత్రమిది. ఈ మధ్యే ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. 'క్వీన్' తర్వాత కంగనా, రాజ్‌కుమార్ రావ్ కలయికలో వస్తున్న రెండో చిత్రమిది. "ఇది చాలా అద్భుతమైన కథ. చాలా ఆసక్తిగా ఉండటమే కాదు కొత్త తరహా వినోదం ఉన్న చిత్రం. 'క్వీన్' తర్వాత కంగనాతో ఈ సినిమా చేయడం చాలా సరదాగా ఉంద"ని చెబుతున్నాడు రాజ్‌కుమార్. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఆ రోజుల్లో 'ఆనందం'


అన్నా ఆంటోనీ

కళాశాల రోజుల్లో ఆస్వాదించిన ఆనందాన్ని మరొకసారి తెరపై చూపించే ప్రయత్నమే మా చిత్రం అన్నారు నిర్మాత ఎత్తరి గురురాజ్. సుఖీభవ మూవీస్ పతాకంపై ఆయన ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న చిత్రం 'ఆనందం'. మలయాళంలో విజయవంతమైన 'ఆనందం' చిత్రానికి అనువాద రూపమిది. అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, అన్నా ఆంటోనీ ముఖ్యపాత్రలు పోషించారు. 'ప్రేమమ్' ఫేమ్ నివిన్ పాలి ఓ అతిథి పాత్రలో నటించారు. ఈ నెల 23న విడుదల చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ ''కళాశాలలోని అనుభవాలు మనసు పొరల్లో జ్ఞాపకాలుగా మిగిలివుంటాయి. వాటినే తెరపైకి తీసుకొచ్చి ఆ రోజుల్ని గుర్తు చేసే ప్రయత్నం చేస్తున్నాం. మూడు ప్రేమజంటల చుట్టూ సాగే ఈ కథ ప్రతి హృదయాన్ని తాకుతుంది. ఈ నెల 17న పాటల్ని విడుదల చేస్తాం" అన్నారు. మాటలు: రాజశేఖర్‌రెడ్డి, పాటలు: వనమాలి, సంగీతం: సచిన్ వారియర్, ఛాయాగ్రహణం: ఆనంద్.ఇ చంద్రన్, సహనిర్మాతలు: వీరా వెంకటేశ్వరరావు, వి.ఆర్.బి.రాజు, రవివర్మ చిలువూరి, సమర్పణ: ఆర్.సీతారామరాజు.

బ్రహ్మానందం.. 'హాస్య నటబ్రహ్మ'


బ్రహ్మానందం, అలీ

కాకతీయ లలిత కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 11న మహబూబ్‌నగర్‌లో కాకతీయ కళా వైభవోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఈ వేడుకలో ప్రముఖ నటుడు బ్రహ్మానందాన్ని 'హాస్య నటబ్రహ్మ' పురస్కారంతో సత్కరిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కాకతీయ లలిత కళా పరిషత్‌కి ఛైర్మన్ అయిన టి.సుబ్బరామిరెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. "ఆనాటి కాకతీయ కళా వైదుష్యాన్ని తెలియజేస్తూ సాంస్కృతిక, సాహిత్య సేవ చేయాలనేది మా ఉద్దేశం. 1100 చిత్రాలలో హాస్యంతోపాటు పలురకాల పాత్రలతో మెప్పించినందుకు బ్రహ్మానందాన్ని సత్కరిస్తున్నాం. ఇంకా నటీనటులు జయప్రద, డా.రాజశేఖర్, జీవిత, బాబూమోహన్, పరుచూరి గోపాలకృష్ణ, అలీ, కవిత, కేథరిన్, హంసానందిని, శ్రద్ధాదాస్, పృధ్వీ, రఘుబాబు, శ్రీనివాసరెడ్డిలకు కాకతీయ పురస్కారాల్ని అందజేస్తాం. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సంగీత, సాహిత్య, నృత్య కళాకారులు ఎల్లారి శివారెడ్డి, కపిలవాయి లింగమూర్తి, గోరేటి వెంకన్న, చిక్కా హరీష్, జంగిరెడ్డి, పద్మాలయ ఆచార్య, వంగీశ్వర నీరజలను కాకతీయ అవార్డులతో సత్కరిస్తాం. ఈ సభలో సంగీత నత్య రూపకం, తెలంగాణ జానపద నృత్యాల ప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయి" అని టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. బ్రహ్మానందం మాట్లాడుతూ "ఇదివరకు పలు అవార్డులు అందుకున్నప్పటికీ ఇప్పుడు కాకతీయ కళావైభవోత్సవం సందర్భంగా అందుకోనున్న ఈ పురస్కారం నాకు చాలా విశిష్టమైంది" అన్నారు. "నటరాజుకి కళాకారులంటే ఇష్టం. ఆయన టి.సుబ్బరామిరెడ్డి రూపంలో ఈ రకమైన కళాసేవ చేస్తున్నాడ"ని నటుడు అలీ అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, దర్శకుడు త్రివిక్రమ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈతరం
youth@eenadu.in
ఈనాడు
శనివారం, మార్చి 10, 2018 విజయవాడ 16

కనికట్టు క్రికెట్టు

ఆస్ట్రేలియా జట్టుపై సిక్సులు కొడదాం రండి

భారత్ పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ ఉంటే కాలేజీకి బంకు కొట్టి టీవీలకు అతుక్కుపోవాల్సిందే. ఇండియా ఆస్ట్రేలియా మ్యాచ్ ఉంటే చాలు ఆ రోజు బయట ప్రపంచాన్ని మరిచిపోయి మ్యాచ్ చూస్తాం. అయితే ఎప్పుడూ మ్యాచ్‌లు చూడ్డమేనా? మనమూ అంతర్జాతీయ వేదికపై సిక్సులు, బౌండరీలు కొట్టి అదరగొడితే భలే ఉంటుంది కదూ! అయినా ఇదెలా సాధ్యం అంటారా? సాధ్యమే. వర్చువల్ రియాలిటీ సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా 'ప్రో యుగ' అనే అంకుర సంస్థ 'ఐబీ క్రికెట్' ఆటను రూపొందించింది. వీడియో గేముల్లో క్రికెట్ ఆడటమంటే కంప్యూటర్ తెరమీదో, లేదా మొబైల్ ఫోన్లోనో ఆడుతుంటాం. కానీ ఐబీ క్రికెట్ అలా కాదు. మనమే మైదానంలో మ్యాచ్ ఆడుతున్నట్టు భలే తమాషాగా ఉంటుంది. గత నెల 22న లఖ్‌నవూలో జరిగిన యూపీ ఇన్వెస్టర్స్ సదస్సులో ఐబీ క్రికెట్‌ను విడుదల చేశారు. సదస్సుకు ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ సైతం ఐబీ క్రికెట్‌ను కాసేపు సరదాగా ఆడారు. ప్రస్తుతం వరంగల్ ఎన్ఐటీలో జరుగుతున్న స్ప్రింగ్స్ స్ప్రీ వేడుకల్లో పాలుపంచుకునేందుకు ఐబీ క్రికెట్ నిర్వాహకులకు ఆహ్వానం అందింది. విద్యార్థులు తెగ ముచ్చటగా క్రికెట్ ఆడేస్తున్నారు.



త్రివిక్రమ్

వసంతసాయి

ఎన్నో ప్రత్యేకతలు

ఐబీ క్రికెట్ ఆటలో ఎన్నో విశేషాలు ఉన్నాయి. ఉన్న గదిలోనే వర్చువల్ రియాలిటీ ఫ్రేమును కళ్లకు ధరించి ఎలక్ట్రానిక్ బ్యాటు పట్టుకుని నిల్చోవాలి. బ్యాట్ కంప్యూటర్‌కు అనుసంధానమై ఉంటుంది. మన చుట్టూ వేలాది సంఖ్యలో ప్రేక్షకులు కనిపిస్తారు. ప్రత్యర్థి ఆటగాళ్లు, ఎంపైర్లు అందరూ మన చుట్టూ కనిపిస్తారు. స్కోరు బోర్డుపై మన పేరు ఉంటుంది. ప్రత్యర్థి ఆటగాడు బంతి వేయగానే దాన్ని మనం హిట్ చేయాలి. మనం ఆడేదాన్నిబట్టి ఫోర్లు, సిక్సులు లేదా వికెట్లు కోల్పోవడం ఉంటుంది. బౌండరీల సమయంలో ప్రేక్షకుల కేరింతలు. అచ్చు అంతర్జాతీయ వేదికపై ఆడినట్టే వింత అనుభూతి కల్గుతుంది. డే, నైట్ మ్యాచ్‌లు కూడా ఆడేలా సెట్టింగ్స్ ఉన్నాయి. ఈ ఆటను రూపొందించింది మన తెలుగు కుర్రాళ్లే. దిల్లీ ఐఐటీలో బీటెక్ సీఎస్ఈ పూర్తి చేసిన త్రివిక్రమ్‌ది సిద్దిపేట. ప్రో యుగ కంపెనీ సీఈవో. హైదరాబాద్ ఐఐఐటీలో బీటెక్ చదివిన వసంతసాయి వ్యవస్థాపకుడు. త్వరలో ఈ ఆటను 25 దేశాల్లో విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు.

- జి.పాండురంగశర్మ, ఈనాడు, వరంగల్

పచ్చబొట్టేసినా... ఆకట్టుకోలేమయా!

టా'టుస్'

టాటూ అనేది యువతలో లేటెస్ట్ ట్రెండ్. మనసుకు నచ్చిన చిత్రాన్ని శరీరంపై అచ్చుపోయించుకుంటారు. వివిధ కళాకృతులతో తమ తృష్ణ తీర్చుకుంటారు. అయితే ఇవి అమ్మాయిలు, అబ్బాయిల్లో ఎంతమందికి నచ్చుతాయని అమెరికాలోని ఓ సంస్థ సర్వే చేసింది. అబ్బాయిలు ముఖ్యంగా అమ్మాయిల మనసు దోచుకోవడానికి టాటూలు వేయించుకుంటారు. అయితే దురదృష్టం ఏమిటంటే... వాటిని అమ్మాయిలు అసలు పట్టించుకోరని సర్వేలో తేలింది. ఇక అమ్మాయిలు వేళ్లు, మెడపై వేసుకొనే చిన్న టాటూలు అబ్బాయిల దృష్టిని ఆకర్షిస్తాయని తెలుసుకున్నారు. పెద్ద టాటూలు ఏవైనా అమ్మాయిలు, అబ్బాయిలు ఎవరూ ఇష్టపడరని తెలిసిపోయింది.



కాబట్టి కుర్రకారూ.. ఆకట్టుకోవడానికి పచ్చబొట్టులు అక్కర్లేదు... అర్థమైందా?

ఆ ఇద్దరు సాయానికి సైన్యం

సాయం చేయాలంటే...
కోట్ల కొద్దీ డబ్బులే ఉండాలా?
చిన్ని మెదడులో మెరుపులాంటి ఆలోచన చాలదా!
వెలుగులు నింపాలంటే..
సూర్యోదయమే కావాలా?
వేల దీపాలు వెలిగించ గలిగే
చిరు దివ్వె సరిపోదా!
ఈ ఇద్దరు యువకులు మెరుపు లాంటి ఆలోచనతో... అంతర్జాలంలో చిరుదివ్వె వెలిగించారు.
ఆ స్ఫూర్తి మూడు లక్షలకు పైగా దీపాలను వెలిగించి కాంతులు పంచుతోంది.



దేశవ్యాప్తంగా పోటీ... 1900 ఆవిష్కరణల నుంచి దరఖాస్తులు.. 7 నెలల సుదీర్ఘ వడపోత.. 30 సంస్థల ఎంపిక... తుదిపోటీకి దిల్లీకి పిలుపు.. అందులో అత్యుత్తమంగా నిలిచిన సామాజిక అంతర్జాల ఆవిష్కరణే డొనేట్‌కార్ట్. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌లో నాస్కామ్ సోషల్ ఇన్నోవేషన్ ఫోరంలో విజేతగా నిల్చింది. ప్రజలు దాతృత్వంగా ధనం బదులు వస్తువులను కొని ఇచ్చేలా భారతదేశపు మొదటి క్రౌడ్ సోర్సింగ్ వేదికను ఏర్పాటు చేశారు తెలుగు కుర్రాళ్లు అనిల్‌కుమార్‌రెడ్డి, సందీప్. ముంబయి కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాలతో పాటూ దేశవ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థలు రూ.1.5 కోట్ల విలువైన 3 లక్షలకు పైగా ఉత్పత్తుల్ని సాయంగా అందుకోవడం విశేషం. పెద్ద సమస్యకు వినూత్న ఆలోచనతో సులభ పరిష్కారం చూపి అందరి మన్ననలు అందుకుంటున్న వ్యవస్థాపకుల్లో ఒకరైన అనిల్‌కుమార్‌రెడ్డిని 'ఈతరం' పలకరించింది. తమని కదిలించిన ఘటనలు, డొనేట్‌కార్ట్ ప్రారంభం... తదితర విషయాలు వివరించారు.

"నాది చిత్తూరు జిల్లా మదనపల్లి. సందీప్‌ది కోదాడ. ఇద్దరం ఎన్ఐటీ నాగ్‌పూర్‌లో ఇంజినీరింగ్ చదివాం. కళాశాలలో చదివే రోజుల్లో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటుండేవాళ్లం. సమీపంలో ఉన్న పాఠశాలలకు వెళ్లి బోధించేవాళ్లం. సరిగ్గా అప్పుడే 2015లో చెన్నైలో వరదలు వచ్చాయి. 25 రోజుల పాటూ గూంజ్ స్వచ్ఛంద సంస్థతో కలిసి అక్కడ సేవా కార్యక్రమాల్లో పనిచేశాను. వరద బాధితులకు సాయపడేందుకు జనం స్పందించి పాత దుస్తులు, ఆహారం, నీళ్లు పంపడంతో వాటిని తీసుకెళ్లి అవసరమైన వారికి పంచడం మా విధి. అయితే అక్కడ జనాలు ఆశించేది ఒకటి ఉంటే దాతలు పంపేది మరొకటి ఉండేది. దీంతో చాలా వస్తువులు మిగిలిపోయేవి. ఎందుకు ఇలా జరుగుతోందని ఆలోచించాం. దాతలకు నిజంగా అక్కడ అవసరాలు ఏంటో తెలియకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు గుర్తించి పరిష్కారంపై దృష్టిపెట్టాం.

ఉద్యోగం వద్దనుకుని..

2015 ఫైనల్ ఇయర్‌లో ఉండగానే ప్రాంగణ నియామకాల్లో మేం ఉద్యోగాలకు ఎంపికయ్యాం. కానీ మా ఆలోచనంతా చెన్నై వరదల్లో గుర్తించిన సమస్యకు పరిష్కారం చుట్టూనే తిరుగుతుండేవి. ఉద్యోగం వద్దనుకొని అంకుర సంస్థ ఏర్పాటు దిశగా అడుగులు వేశాం. వస్తువులు కొనుగోలు చేయాలన్నా.. ఇంటికి ఏదైనా ఆర్డర్ ఇవ్వాలన్నా.. ఇంకా చాలా విషయాల్లో ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం వినియోగిస్తున్నాం. దానం చేసేందుకూ ఇలాంటి వేదిక ఉంటే ఇరువురికి ఉపయోగకరంగానే కాదు పారదర్శకంగానూ ఉంటుందని ఆలోచించాం. దాతలకు తమ నిధులను ఎలా ఎక్కడ వినియోగించారనే సమాచారం ఎప్పటికప్పుడు తెలిపేలా డొనేట్‌కార్ట్‌ను క్రౌడ్ సోర్సింగ్ వేదికగా ఏర్పాటు చేశాం.

వేదిక కల్పిస్తాం..

పిల్లలు, వృద్ధులు, మహిళలు, విద్య, వైద్యం, జంతువులు ఇలా ఎన్నో అంశాలపై స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. అక్కడ ఉంటున్న వారి రోజువారీ జీవనానికి ఎన్నో వస్తువులు అవసరమవుతుంటాయి. ఏదైనా స్వచ్ఛంద సంస్థ తమను సంప్రదించినప్పుడు వారి అవసరాలను గుర్తించి వెబ్‌సైట్‌లో ప్రచారం(క్యాంపెయిన్) నిర్వహిస్తాం. ఆయా సంస్థల గురించి పూర్తిగా తెలుసుకున్నాకే వేదికలో చోటు కల్పిస్తాం. ఇందుకోసం సామాజిక మాధ్యమాలు, ఆదాయపు పన్ను మినహాయింపు 80 జి సర్టిఫికెట్ ఇలాంటివన్నీ పరిశీలిస్తాం. ప్రస్తుతం చైల్డ్ హెల్ప్ ఫౌండేషన్ మహిళాదినోత్సవం పురస్కరించుకుని శానిటరీ నాప్‌కిన్ ప్యాక్‌ను బహుమతిగా ఇవ్వాలని కోరాయి. 25వేల నాప్‌కిన్‌లు అవసరం దాతలు బాగా స్పందించారు. అక్కడ ఉన్న వస్తువుపై క్లిక్ చేసి ఆ మేరకు సొమ్ము చెల్లిస్తే సరిపోతుంది. ఆ వస్తువులను ఆయా సంస్థలకు చేరుస్తాం. దీంతో డబ్బులు సద్వినియోగం చేశారో? లేదో? అనే ఆందోళన ఉండదు. దాతలకు తమ సాయం ఎక్కడికిపోతుందో తెలుస్తుంది. 30 శాతం మంది దాతలు యు.ఎస్., యు.కె. నుంచి ఇస్తుంటారు. చాలామంది కొత్త దాతలు తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఇప్పటివరకు 300 క్యాంపెయిన్లు నిర్వహించి రూ. 1.5 కోట్ల విలువైన సామగ్రిని అవసరమైన వారికి అందజేశాం. మహారాష్ట్రలోని ఒక మారుమూల ప్రాంతంలో మహిళలు ప్రసవం కోసం 40 కి.మీ. నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. అక్కడ ఒక డెలివరీ టేబుల్ కావాలని కోరితే దాతల సాయంతో వారికి అందజేశాం. ఇలాంటి ఎన్నో ఉదంతాలు ఉన్నాయి. 30 శాతం వరకు తెలుగు రాష్ట్రాల్లోని సంస్థలు సాయం పొందాయి. ప్రభుత్వ పాఠశాలకు శానిటరీ నాప్‌కిన్స్, మంజులత రైస్‌బకెట్ ఛాలెంజ్, మహిళలకు కుట్టుమిషన్లు ఇలా తమ వేదిక ద్వారా దాతల తోడ్పాటుతో అవసరమైన వారికి అందజేస్తున్నాం."



పురస్కారంతో గుర్తింపు..

సమాజ హితం పెంపొందించడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినూత్నంగా వినియోగించేలా చేసినందుకు డొనేట్‌కార్ట్‌కు తాజా అవార్డుతో మరింత గుర్తింపు దక్కింది. నాస్కామ్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ విభాగంలో విజేతగా నిలవడంతో మా సంస్థకు క్రెడిబులిటీ వచ్చిందని భావిస్తున్నాం. అవార్డుకు ఎంపిక కావటం ద్వారా నాస్కామ్ నుంచి ఏడాదిపాటు మెంటరింగ్ లభిస్తుంది. అది మా సంస్థకు మరింత ఉపయోగపడుతుంది. కేటీఆర్ అవార్డు బహూకరించడమే కాదు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కలిసి పనిచేద్దామన్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్‌ను కలవమన్నారు. ఒక క్యాంపెయిన్ సిద్ధం చేయబోతున్నాం. రాబోయే రోజుల్లో మరింత మందికి www.donatekart.com వేదిక ద్వారా పారదర్శకంగా సేవలు అందాలని కోరుకుంటున్నాం.



- మల్లేపల్లి రమేశ్‌రెడ్డి, ఈనాడు, హైదరాబాద్

మనసు అప్పుడే చచ్చిపోయింది

మనసులో మాట

నా పేరు అనూరాధ. మాది విజయవాడ. అమ్మా, నాన్న, మేం ముగ్గురం అక్కాచెల్లెళ్లం. నేనే పెద్దదాన్ని. సంతోషంగా ఉండేవాళ్లం. మేం బాగా చదువుకోవాలనేవారు అమ్మా, నాన్న. అనుకున్నవన్నీ జరగవు. బంధువుల ఇంటికి వెళ్లిన అమ్మా, నాన్న తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అప్పుడు నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. మేం ముగ్గురం అనాథలయ్యాం. పక్క ఊరిలో ఉండే అమ్మమ్మవాళ్లు మమ్మల్ని వాళ్లింటికి తీసుకెళ్లారు. అక్కడే ఉంటూ చదువు కొనసాగించాం. మావయ్య బాగానే చూసేవాడు. అయితే ఆయనకు పెళ్లి అవడంతో మా కష్టాలు మొదలయ్యాయి. మాకు అన్నం పెట్టడానికి అత్త ఒప్పుకొనేది కాదు. ఇంట్లో పనంతా చేసి స్కూల్‌కు వెళ్లేవాళ్లం. రోజుకు ఒకసారి మాకు అన్నం పెట్టేవారు. పదోతరగతి పాసయ్యాను. నేను ఏదైనా చిన్న ఉద్యోగం చేసి, కనీసం చెల్లెళ్లకు కడుపునిండా అన్నం పెట్టాలనిపించేది. ఏదైనా ఉద్యోగం చూసుకుందాం అనుకుంటుండగా, గతంలో మా ఊరి నుంచి కొంతమంది మహిళలను ఉద్యోగాలకు తీసుకెళ్లినవాళ్లు వచ్చారు. ఉత్తరాదిన బనియన్ల కంపెనీలో పని ఇప్పిస్తామని చెప్పడంతో, మా ఊరిలో నా వయసు వారే మరో పదిమంది కలిసి వస్తామని చెప్పాం. అమ్మమ్మతో చెప్పా. ఎందుకు అంత దూరం అంది. మరి చెల్లెళ్లకు అన్నీ చూడాలి కదా అని ఒప్పించాను. నాకు భోజన వసతులు ఇచ్చి, నెలకు నాలుగువేల రూపాయలు జీతం ఇస్తామన్నారు. వీటితో చెల్లెళ్లను లోటు లేకుండా చూసుకోవచ్చునుకుని సరే అన్నా.



సంతోషంగా రైలెక్కి, మరుసటిరోజుకు ఏదో ఊరు చేరుకున్నాం. అక్కడ మమ్మల్ని ఓ పెద్ద బంగళాకు తీసుకెళ్లారు. సిద్ధమవ్వండి, పనికి వెళ్లాలన్నారు. మేమంతా రెడీ అయ్యాం. ఆ తరువాత ఎవరెవరో వ్యక్తులు వచ్చి మమ్మల్ని చూసి వెళ్లడం ప్రారంభించారు. మాకు ముందు అర్థం కాక, అక్కడో మహిళ ఉంటే అడిగాం. ఆ తరువాత తెలిసింది, మమ్మల్ని వేశ్యావృత్తి చేయించే వ్యక్తులకు విక్రయిస్తున్నారని. మేమంతా గొడవ పడ్డాం. నలుగురు రౌడీలు మమ్మల్ని తీవ్రంగా కొట్టారు. ఆ రోజు రాత్రి మేం ఎలాగైనా అక్కడి నుంచి తప్పించుకోవాలని ప్రయత్నించాం. పారిపోవడం కుదరదని అర్థమైంది. మర్నాడు నన్ను మరో చోటుకి తరలించారు. భాష తెలీదు, మనుషులు తెలీదు. ఎందుకిలా వచ్చి ఇరుక్కున్నానని ఎన్నోసార్లు బాధపడ్డాను. ఏడ్చాను. వేశ్యావృత్తి చేస్తేనే అన్నం పెడతామన్నారు. అన్నం వద్దన్నాను. బాగా కొట్టారు. ఒంటిపై యాసిడ్ పోస్తామని బెదిరించేవారు. వాళ్లు మనుషులు కాదు నారీమాంస భక్షకులు. అప్పటికే మనసు చచ్చిపోయింది. నన్ను ఆ వృత్తిలోకి దింపారు. అమ్మమ్మ మాట వినుంటే ఇలా జరిగుండేది కాదని ఎన్నిసార్లు అనుకున్నానో నాకే తెలీదు. అప్పటికే నా జీవితం చేయి జారిపోయింది.

అది ముంబయి శివార్లలో ఓ మారుమూల ప్రాంతమని తెలుసుకోవడానికి మూడు నెలలు పట్టింది. చెల్లెళ్లు గుర్తువచ్చేవారు. ఏడ్చిఏడ్చి కళ్లు ఎంతగా బీటలు వారాయంటే... నాకు నేను అద్దంలో నెర్రెలు, నెర్రెలుగా చీలిపోయి కన్పిస్తున్నాను. కొంతకాలానికి బాగా జబ్బు పడ్డాను. ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎయిడ్స్ వచ్చిందని డాక్టర్లు చెప్పారు. దీంతో నిర్వాహకులు ఇంట్లో పనులు చేయించేవారు. ఒకసారి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో రెండువేల రూపాయలు ఇచ్చి, ఇంటికి వెళ్లిపొమ్మని, విజయవాడకు టిక్కెట్టు చేతిలో పెట్టారు. అమ్మమ్మ, చెల్లెళ్ల వద్దకు వెళ్లాను. అమ్మమ్మకు అన్నీ చెప్పాను. దాంతో నన్ను విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఈ వ్యాధి ప్రారంభ దశలో ఉందని చెప్పారు. మందులు వాడితే మిగతావారిలాగే బతకడానికి అవకాశం ఉందన్నారు. అమ్మమ్మ ఒప్పుకోలేదు. గ్రామంలో పరువు పోతుందని, ఇంటికి రావడానికి వీలు లేదని తెగేసి చెప్పేసింది. ఆసుపత్రివాళ్లు, చెన్నైలో ఓ స్వచ్ఛంద సంస్థ నాలాంటివాళ్లకి వైద్యంతోపాటు షెల్టర్ ఇస్తారని చెప్పారు. దిక్కులేక చెన్నై రైలెక్కా. తీరా అడ్రస్ పోయింది. భాష తెలీక, పగలు అడుక్కుని తింటూ, రాత్రిళ్లు ప్లాట్‌ఫారంపై నిద్రపోయేదాన్ని. అలా పది రోజులు గడిచాయి. ఓ రోజు తెలుగు మాట్లాడేవారు కనిపిస్తే వాళ్లని సాయం అడిగా. ఆ సంస్థ చిరునామా కనుక్కొని నన్ను ఆటో ఎక్కించి పంపించారు.

ఆ స్వచ్ఛంద సంస్థ అందించిన చేయూత మరువలేనిది. ఇప్పుడు అక్కడే మందులు వాడుతున్నా. నాకు ఇప్పుడు 22 ఏళ్లు. ఇక్కడ నాలాగే ఇటువంటి వ్యాధి ఉన్న మరో వ్యక్తిని వివాహం చేసుకున్నాను. ఇద్దరం ఇక్కడే నాలాంటివారికి సేవలందిస్తున్నాం. మాకు ఓ పాప. అయితే పాపకు హెచ్ఐవీ లేదు. ఇప్పుడు అమ్మమ్మ, చెల్లెళ్లు ఎవరూ నాతో మాట్లాడరు. నేను చనిపోయానని ఊర్లో చెప్పారట. సొంతవాళ్లని వదిలేసి బయటకు అడుగు పెట్టినప్పుడు నాకు 16 ఏళ్లు. ఈ ఐదేళ్లలో నా జీవితం ఎలా మారిపోయిందో అని అనిపిస్తేనే చాలా వేదనగా ఉంటుంది. దీనికి కారణం తెలిసీ తెలియని వయసులో వేసే తప్పటడుగా? నన్ను పట్టించుకోని బంధువులదా? అమ్మానాన్నలను చంపేసిన దేవుడిదా? క్రూరత్వానికి పోతపోసిన మగమృగాళ్లదా?

సెన్సేషనల్

'సుదు'గాలి

అందమంటే..
తెలుపు రంగులోనే ఉంటుందా?

నలుపు రంగులో ఉండదా? అనే ఆలోచనను రేకెత్తిస్తున్న ఈ బ్లాక్ బ్యూటీ పేరు సుదు గ్రామ్. 69.8 వేల మంది ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోవర్లు ఉన్న సుదు ప్రస్తుతం సోషల్‌మీడియా సెన్సేషనల్. నమ్మలేని నిజమేంటంటే ఈ బ్లాక్ బ్యూటీ నిజమైన మోడల్ కాదు.. ప్రపంచంలోని తొలి డిజిటల్ సూపర్‌మోడల్!

తాజాగా ఇంటర్నెట్‌లో ఎక్కువగా షేర్ అవుతున్న ఫొటో ఇదే. ఈ డిజిటల్ మోడల్‌కు రాకెట్ వేగంతో ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లు పెరుగుతున్నారు. ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్‌లో డిస్కషన్స్ నడుస్తున్నాయి. మేకప్, హెయిర్, ఫొటోలోని జీవం చూసి..'టూ పర్ఫెక్ట్ టు బి రియల్' అంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. ఈ ఫొటోను లండన్‌కి చెందిన ఫొటోగ్రాఫర్ కామరూన్ జేమ్స్ విల్సన్ గ్రాఫిక్స్‌లో సృష్టించాడు.'డార్క్ స్కిన్ మోడల్స్ విప్లవం చూసి స్ఫూర్తి పొంది ఈ డిజిటల్ మోడల్‌ను క్రియేట్ చేశాను. దురదృష్టవశాత్తూ ఇది నిజం మోడల్ కాదు' అంటున్నాడు కామెరూన్. కళపై ప్రేమతో సహజంగా ఉండాలని ఆయన ఈ మోడల్‌ను క్రియేట్ చేశాడు. ఈ డిజిటల్ మోడల్ 2,762 అమెరికన్ డాలర్ల ధర పలికింది. కమర్షియల్‌గా ఏదో సంపాదించాలని ఈ బొమ్మను సృష్టించలేదు అంటోన్న జేమ్స్‌కి నెటిజన్లు జేజేలు కొడుతున్నారు. నలుపు చర్మాన్ని మెయిన్ స్ట్రీమ్ మీడియాలో గ్లామరైజ్ చేసినందుకు ధన్యవాదాలంటూ ఫ్యాషన్ ప్రియులు ప్రశంసిస్తున్నారు. డిజిటల్ బ్లాక్ బ్యూటీ సుదును చూసి 'భవిష్యత్‌లో వర్చువల్ మోడల్స్ ప్రపంచాన్ని ఏలినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నది కొందరి భావన. దీనికి సుదు సృష్టిస్తున్న సుడిగాలే నిదర్శనం.

